www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

చేతులు కలిపిన భారత్–పాక్

అరేబియా సముద్రంలో 12 మంది భారతీయులు ప్రయాణిస్తున్న నావ మునక

సంయుక్త ఆపరేషన్ చేపట్టి వారిని కాపాడిన ఇరుదేశాల కోస్టుగార్డ్స్

10


సంయుక్త ఆపరేషన్ దృశ్యం

శుక్రవారం | 6-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 248

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ. 12.08 తదుపరి షష్ఠి; నక్షత్రం: శ్రవణం సా. 5.18 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా.9.13-10.47; దుర్ముహూర్తం: ఉ.8.48-9.32, మ.12.28-1.12; అమృతఘడియలు: ఉ.6.57-8.32; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 6 డిసెంబరు 2024

ONEPLUS

మూడేళ్లలో రూ.6,000 కోట్ల పెట్టుబడులు

50 శాతం పెరగనున్న సర్వీస్ సెంటర్లు

న్యూఢిల్లీ: చైనా స్మార్ట్ ఫోన్ల కంపెనీ వన్‌ప్లస్ భారత్‌లో వ్యాపార కార్యకలాపాలను ప్రాజెక్ట్ స్టార్‌లైట్ పేరుతో మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం ఏటా రూ.2,000 కోట్ల చొప్పున వచ్చే మూడేళ్లలో రూ.6,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనుంది. అదే విధంగా 2026 జూన్ నాటికి సర్వీసుకేంద్రాల సంఖ్యను ప్రస్తుత స్థాయి నుంచి 50 శాతం పెంచుతామని కంపెనీ సీఈఓ రాబిన్ లూ తెలిపారు. ఇప్పుడున్న రిటైల్ స్టోర్లలో సగాన్ని మరింత అప్‌గ్రేడ్ చేయాలని కూడా కంపెనీ నిర్ణయించింది. గత ఏడాదితో పోలిస్తే కంపెనీ తన సర్వీస్ సెంటర్లను ఇప్పటికే 22 శాతం పెంచుకుంది. కంపెనీ యాజమాన్యంలోని ప్రత్యేక సర్వీస్ సెంటర్ల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 11 శాతం పెరిగింది. ఖాతాదారులకు మరింత మన్నికైన వస్తువులు, సేవలు అందించడం, భారత్‌లో తాము అందించే వస్తువుల్లో ఈ దేశానికి మాత్రమే అవసరమైన వినూత్నమైన ప్రత్యేక ఫీచర్లు జోడించడం ప్రాజెక్టు స్టార్ లైట్ లక్ష్యమని వన్‌ప్లస్ ఇండియా తెలిపింది.

హ్యూందై కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: హ్యూందై మోటార్ ఇండియా లిమిటెడ్ తమ కార్ల ధరలు జనవరి ఒకటో తేదీ నుంచి పెంచుతున్నట్టు ప్రకటించింది. మోడల్‌ను బట్టి ధరలో పెరుగుదల రూ.25,000 వరకు ఉంటుందని తెలిపింది. కార్ల తయారీలో వినియోగించే వివిధ రకాల ముడి సరకు ధరలు పెరగడంతో పాటు విదేశీ మారకం రేట్ల ప్రతికూలత, లాజిస్టిక్ వ్యయాల పెరుగుదల ఇందుకు కారణమని హెచ్ఎంఐఎల్ తెలిపింది.

చిన్న నగరాల్లో రియల్టీ జోరు



- జైపూర్‌లో గరిష్ఠంగా 65 శాతం వృద్ధి
- 51 శాతంతో దక్షిణాదిలో గుంటూరు టాప్

న్యూఢిల్లీ: ద్వితీయ శ్రేణి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ ఏడాది జనవరి-సెప్టెంబరు నెలల మధ్య కాలంలో ప్రారంభించిన గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో ఇళ్ల ధరలు 23 నగరాల్లో 65 శాతం మేరకు పెరిగాయి. ఐదు నగరాల్లో మాత్రం తగ్గాయి. రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ ప్రాప్ ఈక్విటీ సంకలనం చేసిన గణాంకాల ప్రకారం జైపూర్‌లో ఇళ్ళ సగటు ధర గరిష్ఠంగా 65 శాతం పెరిగింది. అక్కడ చదరపు అడుగు ధర రూ.6,979 పలుకుతోంది. గత ఏడాది ఇదే కాలంలో సగటు ధర రూ.4,240 ఉంది. లఖనవూలో అతి తక్కువగా ఒక శాతం పెరిగింది. దక్షిణ భారతదేశానికి వస్తే గుంటూరులో ధర అత్యధికంగా 51 శాతం పెరిగింది. ధరల పెరుగుదల విశాఖపట్టణంలో 29 శాతం, విజయవాడలో 21 శాతం ఉంది.

నాణ్యమైన జీవనానికి ఆరాటమే కారణం

ప్రజలు నాణ్యమైన ఇళ్లలో నివశించడానికి ఆసక్తి ప్రదర్శించడమే ధరల్లో పెరుగుదలకు కారణమంటున్నారు. ఆ నగరాల్లో తక్కువ ధరలకు భూమి అందుబాటులో ఉండడంతో పాటు కనెక్టివిటీ మౌలిక వసతులు భారీగా అభివృద్ధి చెందుతూ ఉండడం వల్ల డెవలపర్లు, కార్పొరేట్లు, ఆర్థిక సంస్థలు, ఇన్వెస్టర్ల దృష్టి ఈ నగరాలపై పడిందని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ జసూజా అన్నారు. దీనికి తోడు ప్రీమియం, లగ్జరీ గృహాలకు ఈ నగరాల్లో డిమాండు పెరిగిందని ఆయన చెప్పారు. మంచి సౌకర్యాలు గల ఇళ్ల విషయంలో ఎక్కువ పెట్టేందుకైనా ప్రజలు వెనుకాడడంలేదని, ఇదే ధరల పెరుగుదలకు దారి తీసిందని రాయల్ గ్రీన్ రియల్టీ ఎండీ యశాంక్ వాసన్ అన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ ఎండీ కీర్తి చిలుకూరి చెప్పారు.



బిట్‌కాయిన్ 1,00,000 డాలర్లు

'బిట్‌కాయిన్' విలువ తొలిసారిగా 1,00,000 డాలర్లు దాటేసింది. క్రిప్టో పరిశ్రమపై నియంత్రణలను సడలిస్తామని అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. అలాగే, క్రిప్టోకరెన్సీ అడ్వకేట్ పాల్ అట్కిన్స్‌ను అమెరికన్ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్' (సెక్) తదుపరి ఛైర్మన్‌గా నియమిస్తానన్నారు. దాంతో బిట్‌కాయిన్ సహా మిగతా క్రిప్టోల విలువ భారీగా పెరిగింది. గత నెల 5న జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతోనే బిట్‌కాయిన్ ర్యాలీ మొదలైంది. ఎన్నికల రోజున 69,374 డాలర్ల స్థాయిలో ఉన్న బిట్‌కాయిన్ విలువ వేగంగా పెరుగుతూ వచ్చింది. బుధవారం ట్రేడింగ్‌లో ఒకదశలో 1,03,713 డాలర్లకు ఎగబాకింది. ట్రంప్ గతంలో క్రిప్టో కరెన్సీలపై అయిష్టంగానే ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు అనూహ్యంగా మనసు మార్చుకున్నారు. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. అంతేకాదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు.

కీలక మైలురాళ్లు

2009: ఎలాంటి విలువ లేకుండా బిట్‌కాయిన్ ఆవిర్భావం
2010 అక్టోబరు: తొలిసారిగా 10 సెంట్లు (0.10 డాలరు) దాటిన విలువ
2011 జూన్: 30 డాలర్లకు చేరువైనప్పటికీ ఏడాది చివరినాటికి మళ్లీ 5 డాలర్లకు డౌన్
2013 నవంబరు: తొలిసారిగా 1,000 డాలర్లకు చేరిక
2017 మే: 2,000 డాలర్లు దాటిన విలువ
2020 డిసెంబరు: దాదాపు 20,000 డాలర్లకు చేరువైన కరెన్సీ
2024 మార్చి: తొలిసారిగా 70,000 డాలర్లకు చేరిక
2024 నవంబరు: ట్రంప్ ఎన్నికతో 80,000, 90,000 డాలర్ల మైలురాళ్లను దాటిన ధర
2024 డిసెంబరు: తొలిసారిగా 1,00,000 డాలర్ల ఎగువన ముగింపు

కొనుగోళ్ల వైల్డ్ ఫైర్

- 5 రోజుల్లో సెన్సెక్స్ 2,722 పాయింట్లు అప్
- రూ.15.18 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై: స్టాక్‌మార్కెట్లో కొనసాగుతున్న కొనుగోళ్ల జాతరలో బుల్ ఉత్సాహంతో రంకెలేస్తోంది. దేశీ, విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడుల దన్నుతో ఈక్విటీ సూచీలు వరుసగా ఐదో రోజూ లాభపడ్డాయి. 5 సెషన్లలో సెన్సెక్స్ ఏకంగా 2,722.12 పాయింట్లు ఎగబాకింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.15.18 లక్షల కోట్లు పెరిగి రూ.458.17 లక్షల కోట్లకు (5.41 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఇంట్రాడేలో 82,000 స్థాయికి సెన్సెక్స్: సెన్సెక్స్ గురువారం ఒకదశలో 1,361.41 పాయింట్లు పెరిగి 82,317.74 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో మదుపరులు కొంత లాభాల స్వీకరణకు పాల్పడటంతో 809.53 పాయింట్ల లాభంతో 81,765.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 240.95 పాయింట్ల వృద్ధితో 24,708.40 వద్ద ముగిసింది. సూచీలకు ఇది దాదాపు రెండు నెలల గరిష్ఠ ముగింపు స్థాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.27 శాతం వరకు లాభపడ్డాయి.

నేటి మార్కెట్ ర్యాలీకి కారణాలు

- అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ఆశావహ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో యూఎస్ స్టాక్ సూచీలు బుధవారం ర్యాలీ సాధించాయి. డౌజోన్స్ తొలిసారిగా 45,000 మైలురాయిని దాటింది. ఇది దేశీయంగా ఐటీ, టెక్నాలజీ షేర్లలో కొనుగోళ్లకు దోహదపడింది.
- శుక్రవారం ప్రకటించనున్న ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాల్లో భాగంగా ఆర్‌బీఐ నగదు నిల్వ నిష్పత్తి (సీఆర్ఆర్) తగ్గించవచ్చన్న అంచనాలు బ్యాంకింగ్, ఆర్థిక సేవలతోపాటు వడ్డీ ప్రభావిత రంగాల షేర్లకు గిరాకీ పెంచాయి.
- గతనెలలో భారీగా అమ్మకాలకు పాల్పడిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ నెలలో మళ్లీ కొనుగోళ్ల జోరును పెంచడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది.

హైదరాబాద్‌లో 25 ఎకరాలు కొన్న మైక్రోసాఫ్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ సమీపంలోని మేకగూడలో 25 ఎకరాల భూమిని నాట్కో ఫార్మా, టైమ్ క్యాప్ ఫార్మా ల్యాబ్ నుంచి కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.181 కోట్ల వరకు చెల్లించింది. మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద కంపెనీ ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన ఈ లావాదేవీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంపెనీ ఇందుకోసం భూమి ధరతో పాటు స్టాంప్ డ్యూటీ కింద రూ.9.96 కోట్లు, రిజిస్ట్రేషన్ ఛార్జీల కింద రూ.3.62 కోట్లు, ఇతర ఛార్జీల కింద మరో రూ.18 లక్షలు చెల్లించినట్టు సమాచారం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,890 ▲	71,400 ▲	1,01,000 ▲
ముంబై	76,450 ▲	70,030 ▲	91,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	99
వరంగల్	85	గుంటూరు	96
కరీంనగర్	85	ఒంగోలు	96
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	88
కర్నూలు	85	నెల్లూరు	88
విశాఖపట్నం	95	అనంతపురం	88
గోదావరి	99		

సన్‌టెక్ కొత్త బ్రాండ్ 'ట్రూజోన్ సోలార్'

బ్రాండ్ అంబాసిడర్‌గా మహేశ్ బాబు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భవనాల పైకప్పులపై ఈపీసీ పద్ధతిలో రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ 'ట్రూజోన్ సోలార్' పేరుతో కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు వ్యవహరిస్తారని కంపెనీ వ్యవస్థాపకులు, ఎండీ సీహెచ్ భవానీ సురేశ్ చెప్పారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన ఈ కంపెనీ తన సేవలను వచ్చే ఏడాది మార్చి నాటికి మధ్యప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు విస్తరించనుంది. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు, సబ్సిడీ, బ్యాంకు రుణాలు, రిపేర్ల వంటి సమస్త సేవలు పొందవచ్చని ఆయన చెప్పారు.

భవిష్యత్ భేష్ : పర్యావరణ స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్‌కు మంచి భవిష్యత్ ఉందని సురేశ్ అన్నారు. సౌర విద్యుత్ ధరలు గత నాలుగేళ్లలోనే 70 శాతం వరకు తగ్గినట్టు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలతో రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటు మరింత ఊపందుకున్నట్టు చెప్పారు. తమ సంస్థ నివాస భవనాలతో పాటు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలపైనా రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తుందన్నారు.

ఈక్విటీ మార్కెట్లో క్లోజ్ యాక్షన్ సెషన్

మధ్యాహ్నం 3.30 నుంచి 3.45 వరకు.. సెబీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఈక్విటీ క్యాష్ మార్కెట్లో షేర్ల ముగింపు ధరను నిర్ణయించేందుకు క్లోజ్ యాక్షన్ సెషన్ (సీఏఎస్) విధానాన్ని ప్రవేశపెట్టాలని సెబీ గురువారం ప్రతిపాదించింది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో షేర్ల ముగింపు ధరను ట్రేడింగ్ సెషన్ చివరి 30 నిమిషాల వాల్యూమ్ వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ (వీడబ్ల్యూఏపీ) ఆధారంగా నిర్ణయిస్తున్నారు. ప్రస్తుత విధానంలో సహేతుక ధరను నిర్ణయించగలిగినప్పటికీ, ముగింపు ధర వద్ద ట్రేడింగ్‌కు అనుమతించదు. సీఏఎస్ విధానం మార్కెట్ క్లోజింగ్ సమయంలో..ముఖ్యంగా ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్, డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజుల్లో ఊగిసలాటలను తగ్గించనుంది. మార్కెట్లో ట్రేడింగ్ ముగిశాక 15 నిమిషాల పాటు (మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 3.45 గంటల వరకు) ప్రత్యేక సెషన్‌గా సీఏఎస్‌ను నిర్వహించాలని సెబీ ప్రతిపాదించింది. తాజా ప్రతిపాదనలపై ఈనెల 26 కల్లా అభిప్రాయాలు తెలుపాల్సిందిగా సెబీ కోరింది.

స్పోర్ట్స్

బ్యాటర్ల బోల్తా

- 5 వికెట్లతో ఆసీస్ గెలుపు



మేగన్ (5/19)

బ్రిస్బేన్: బ్యాటర్ల వైఫల్యంతో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను భారత మహిళలు ఘోర పరాజయంతో ఆరంభించారు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 34.2 ఓవర్లలో 100 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మేగన్ షుట్ 5 వికెట్లతో విజృంభించింది. స్మృతి మంధాన (8), ప్రియా పూనియా (3), హర్లీన్ (19), హర్మన్‌ప్రీత్ (13), జెమీమా (23) విఫలమయ్యారు. ఓ దశలో 89/5తో ఉన్న భారత్ మరో 11 రన్స్ జోడించి ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 16.2 ఓవర్లలో 102/5 స్కోరు చేసి గెలుపొందింది. లిచ్‌ఫీల్డ్ (35), జార్జియా వోల్ (46 నాటౌట్) తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం అందించారు.

వరుసగా ఆరో డ్రా

- సమంగా గుకేష్, లిరెన్

సింగపూర్: వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత జీఎం గుకేష్, డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరేన్ (చైనా) మధ్య గురువారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్ కూడా ఫలితం తేలలేదు. 54 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు పాయింట్ పంచుకొన్నారు. టోర్నీలో ఇది ఏడో డ్రా కాగా.. వరుసగా ఆరోది. దీంతో గుకేష్, లిరెన్ చెరో 4.5 పాయింట్లతో సమంగా ఉన్నారు. విజేతగా నిలవాలంటే ఇంకా 3 పాయింట్లు సాధించాల్సి ఉండగా.. మరో 5 రౌండ్లు మిగిలున్నాయి. మిగిలిన 5 రౌండ్లలో లిరెన్ మూడుసార్లు తెల్లపావులతో ఆడనున్నాడు.

టీ20ల్లో బరోడా ప్రపంచ రికార్డు

ఇండోర్: టీ20 క్రికెట్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా బరోడా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సిక్కింతో గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 20 ఓవర్లలో 5 వికెట్లకు 349 రన్స్ చేసింది. ఈ క్రమంలో గత అక్టోబరులో గాంబియాతో మ్యాచ్‌లో జింబాబ్వే 344/4 రికార్డును బరోడా బద్దలు కొట్టింది. భాను పనియా (51 బంతుల్లో 134 నాటౌట్) చెలరేగిపోయాడు. ఛేదనలో సిక్కిం 87/7 మాత్రమే చేసి 263 పరుగుల తేడాతో చిత్తయింది. కాగా జార్ఖండ్‌తో మ్యాచ్‌లో యూపీ పేసర్ భువనేశ్వర్ కుమార్ (4-1-6-3) హ్యాట్రిక్ నమోదు చేశాడు.

హైదరాబాద్ ఘన విజయం

సౌరాష్ట్ర: అమన్ (67 నాటౌట్), రోహిత్ రాయుడు (53 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగడంతో.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆఖరిపోరులో హైదరాబాద్ మిజోరంపై 10 వికెట్లతో నెగ్గింది. దీంతో టోర్నీలో మొత్తం 7 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ మూడు మాత్రమే గెలిచి నాకౌట్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. తొలుత మిజోరం 18.3 ఓవర్లలో 123 పరుగులకు కుప్పకూలింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని హైదరాబాద్ 11.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా ఛేదించింది. మరో మ్యాచ్‌లో ముంబై చేతిలో పరాజయం పాలైనా ఆంధ్ర జట్టు నాకౌట్‌కు అర్హత సాధించింది.

అడిలైడ్‌లో.. గుభాళించేనా?

ఉదయం 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

పూర్తి స్థాయి జట్టుతో టీమిండియా

మిడిలార్డర్‌లో రోహిత్

విజయంపై ఆసీస్ గురి

నేటి నుంచి డే/నైట్ టెస్టు



రోహిత్

బుమ్రా

అడిలైడ్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఘనవిజయంతో ఆరంభించిన టీమిండియాకు నేటి నుంచి అసలైన సవాల్ ఎదురుకానుంది. ఆస్ట్రేలియాతో శుక్రవారం నుంచి రెండో టెస్టు జరగనుంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సాగే ఈ డే/నైట్ టెస్టులో గులాబీ బంతితో పరుగులు సాధించడం బ్యాటర్లకు అంత సులువు కాదు. పైగా గతంలో భారత్‌కు ఇక్కడ ఓడిన అనుభవం ఉంది. అయినా తొలి టెస్టు విజయం అందించిన ఆత్మవిశ్వాసంతో ఆతిథ్య జట్టును కట్టడి చేస్తూ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. నాలుగేళ్ల క్రితం అడిలైడ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ కేవలం 36 పరుగులకే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. టెస్టు ఫార్మాట్‌లో టీమిండియాకు ఇదే చెత్త స్కోరు. 8 వికెట్ల తేడాతో ఆ టెస్టు ఓడిన భారత్‌కు బదులు తీర్చుకునే సమయం వచ్చింది. మరోవైపు పెర్త్ టెస్టులో చిత్తుగా ఓడిన ఆసీస్ దెబ్బతిన్న పులిలా విజయం కోసం ఎదురుచూస్తోంది. అడిలైడ్‌లో మెరుగైన రికార్డు కలిగిన తాము భారత్‌పై నెగ్గి సిరీస్‌లో సమంగా నిలవాలనుకుంటోంది.

ముఖాముఖి

ఆ.టె	భా. వి	ఆ.వి	డ్రా	టై
108	33	45	29	1

గమనిక: ఆ.టె:ఆడిన టెస్టులు; భా.వి: భారత్ విజయం;ఆ.వి: ఆసీస్ విజయం

పటిష్ఠంగా బ్యాటింగ్ లైనప్

తొలి టెస్టుకు దూరంగా ఉన్న గిల్, కెప్టెన్ రోహిత్ తుది జట్టులోకి వచ్చారు. దీంతో భారత్ పూర్తిస్థాయిలో బరిలోకి దిగబోతోంది. అలాగే అంతా ఊహించినట్టుగా ఈ మ్యాచ్‌లోనూ ఓపెనర్‌గా రాహుల్‌నే బరిలోకి దింపనున్నారు. సరైన కాంబినేషన్‌తో ఆడేందుకు రోహిత్ తన స్థానాన్ని త్యాగం చేశాడు. ఫామ్‌లో ఉన్న రాహుల్‌ను తప్పించడం అనవసరమంటూ, తను ఐదో స్థానంలో రానున్నాడు. తమకు విజయం మాత్రమే ముఖ్యమని, పెర్త్‌లో ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ అద్భుతంగా రాణించారని రోహిత్ కితాబిచ్చాడు. అందుకే వారి స్థానాలను మార్చాల్సిన అవసరం లేదని తేల్చాడు. కివీస్‌తో సిరీస్‌లో తను పెద్దగా ఆకట్టుకోలేకపోగా, ఆసీస్ గడ్డపైనా పేలవ గణాంకాలే ఉన్నాయి. ఈ చివరి పర్యటనలోనైనా రోహిత్ బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. వామప్‌లో హాఫ్ సెంచరీ చేసిన గిల్ జోష్‌లో ఉన్నాడు. వీరి రాకతో దేవ్‌దత్, జురెల్ బెంచీకే పరిమితం కానున్నారు. విరాట్, జైస్వాల్ శతకాలతో ఫామ్ చాటుకున్నారు. బౌలింగ్ విభాగంలో మార్పులు ఉండకపోవచ్చు. ఏదేమైనా రాత్రి పూట పింక్ బాల్‌తో ఎదురయ్యే అదనపు సీమ్‌ను భారత యువ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారో వేచిచూడాల్సిందే.



కమిన్స్

ఒత్తిడిలో కంగారూలు..

పెర్త్‌లో మెరుగ్గా రాణించిన పేసర్ హాజెల్‌వుడ్ ఈ మ్యాచ్‌కు దూరం కావడం ఆసీస్‌కు గట్టి షాక్‌గా చెప్పవచ్చు. అలాగే 2020లో భారత్ 36 రన్స్‌కే కుప్పకూలడంలోనూ అతడి పాత్ర (5-3-8-5) ఉంది. తన స్థానంలో 18 నెలల తర్వాత బోలాండ్ మరో టెస్టు ఆడబోతున్నాడు. దీనికి తోడు బుమ్రా బంతులను ఎదుర్కోవడంలో ఆసీస్ బ్యాటర్లు తేలిపోతున్నారు. టెస్టు స్పెషలిస్టులు స్మిత్, లబుషేన్ ప్రభావం చూపడం లేదు. ఓపెనర్ మెక్‌స్వీన్ అరంగేట్రంలో ఆకట్టుకోలేకపోయాడు. కాగితంపై పటిష్ఠంగా కనిపిస్తున్న బ్యాటింగ్ లైనప్.. స్థాయికి తగ్గట్టు ఆడితే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, కోహ్లీ, రోహిత్ (కెప్టెన్), పంత్, సుందర్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా: మెక్‌స్వీనే, ఖవాజా, లబుషేన్, స్మిత్, హెడ్, మిచెల్ మార్ష్, క్యారీ, కమిన్స్, స్టార్క్, లియోన్, బోలాండ్.

1

అడిలైడ్‌లో జరిగిన 7 గులాబీ టెస్టుల్లోనూ ఆసీస్ గెలిచింది. ఓవరాల్‌గా స్వదేశంలో జరిగిన 12 డే/నైట్ టెస్టుల్లో 11-1 రికార్డుతో ఉంది. అలాగే భారత్ ఆడిన నాలుగు పింక్ టెస్టుల్లో స్వదేశంలో మూడు నెగ్గి ఆసీస్‌గడ్డపై ఒకదానిలో ఓడింది.

విరాట్ మరో సెంచరీ సాధిస్తే అడిలైడ్‌లో నాలుగు శతకాలు సాధించిన విదేశీ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పుతాడు.

పిచ్, వాతావరణం

తొలి రోజు మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం 51 శాతం ఉంది. అయితే ఆ తర్వాత తగ్గుముఖం పట్టనుండడంతో మ్యాచ్‌కు అంతరాయం కలగకపోవచ్చు. ఇక అడిలైడ్ పిచ్ బ్యాట్‌కు బంతికి సమతూకంగా ఉండనుంది. ఆరంభంలో పేసర్లు లాభపడతారు. ముఖ్యంగా రాత్రి పూట బంతితో అదనపు స్వింగ్‌ను రాబట్టవచ్చు. మ్యాచ్ సాగేకొద్దీ బ్యాటర్లకు అనుకూలిస్తుంది.

గుర్తుందా.. 36 ఆలౌట్?

2020.. ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ తొలి టెస్టును అడిలైడ్‌లోనే ఆడింది. ఆ గులాబీ టెస్టును ఏ అభిమానీ గుర్తు తెచ్చుకోవడానికి ఇష్టపడడంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే తమ టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త స్కోరును భారత జట్టు అక్కడే నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 244 పరుగులు చేయడంతో పాటు బౌలర్లు కూడా రాణించడంతో భారత్‌కు 53 పరుగుల ఆధిక్యం కూడా దక్కింది. కానీ ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ పేసర్లు కమిన్స్, హాజెల్‌వుడ్‌ల దాటికి కేవలం 36 పరుగులకే కుప్పకూలడం క్రీడా ప్రేమికులను షాక్‌కు గురిచేసింది. ఒక్కరంటే ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే భారత్ అడిలైడ్‌లో ఆడబోతోంది. అందుకే భారత టెస్టు ఫార్మాట్‌లో పీడకలగా మిగిలిన ఆ పరాభవానికి ఇప్పుడు గట్టిగానే బదులు తీర్చుకోవాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు.

హైబ్రిడ్ మోడల్‌లో చాంపియన్స్ ట్రోఫీ?

- ఏకాభిప్రాయానికి ఐసీసీ, పీసీబీ!
- 2027 వరకు ఇదే విధానం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించడం దాదాపుగా ఖరారైంది. ఈమేరకు ఐసీసీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. 2027 వరకు ఇదే తరహాలో టోర్నీలు నిర్వహించేందుకు ఐసీసీ సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. అంటే, చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ మ్యాచ్‌లను తటస్థ వేదిక దుబాయ్‌లో ఆడనుంది. దీని ప్రకారం ఐసీసీ ఈవెంట్ల కోసం భారత జట్టు పాక్‌కు వెళ్లదు..అలాగే పాక్ జట్టు కూడా భారత్‌కు రాదు. దుబాయ్‌లో గురువారం ఐసీసీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐసీసీ ఛైర్మన్ జైషాతో సభ్యుల చర్చలు ఫలించాయని సమాచారం. శనివారం జరిగే బోర్డు మీటింగ్‌లో చాంపియన్స్ ట్రోఫీ గురించి చర్చించే అవకాశం ఉందని ఐసీసీ వర్గాలు తెలిపాయి. 2026 పురుషుల టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించనున్నారు. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తే నష్టపరిహారం కోసం పాక్ చేస్తున్న డిమాండ్ ఇంకా పరిశీలనలో ఉందని ఐసీసీ వర్గాలు తెలిపాయి.

క్రికెట్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్దాం: జైషా

దుబాయ్: ఐసీసీ నూతన ఛైర్మన్ జైషా ప్రపంచ క్రికెట్ వ్యవహారాలపై దృష్టి సారించాడు. గురువారం తొలిసారి ప్రధాన కార్యాలయానికి రావడంతో పాటు బోర్డు సమావేశంలో పాల్గొన్నాడు. ఇందులో హైబ్రిడ్ పద్ధతికి అందరు సభ్యులు అంగీకరించారు. మరింత వివరంగా మాట్లాడేందుకు సమావేశాన్ని శనివారానికి వాయిదా వేశారు. ఈనెల ఒకటిన షా ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు బీసీసీఐని సమర్థవంతంగా నడిపిన జైషా ఐసీసీని కూడా అదే రీతిన ముందుకుతీసుకెళ్లాలని భావిస్తున్నాడు. 'ఇది ఆరంభం మాత్రమే. మనమంతా అకుంఠిత దీక్షతో ప్రపంచ క్రికెట్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లగలమని ఆశిస్తున్నాను' అని బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో షా అన్నాడు. కాగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్ దుబాయ్‌లోని ఐసీసీ కార్యాలయంలో జై షాను కలిసి అభినందించారు.



జై షాను అభినందిస్తున్న ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరనాథ్



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 6-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 248 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

అభ్యర్థుల్లో విశ్వాసం పెంపొందిస్తా!

యూపీఎస్సీ మాదిరిగా టీజీపీఎస్సీని తీర్చిదిద్దుతా

వేగంగా, పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ

టీజీపీఎస్సీ నూతన చైర్మన్ బుర్రా వెంకటేశం.. బాధ్యతల స్వీకరణ

9

కేసీఆర్! ప్రతిపక్ష నేతగా..

నీ డ్యూటీ చెయ్

సభలో విపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండడం మంచిది కాదు

అధికార, ప్రతిపక్షాలంటే భారత్, పాకిస్థాన్‌లా ఉంది!

ఇరు పక్షాలనూ శత్రు సైనికుల్లా మార్చింది కేసీఆరే

ఇకనైనా అసెంబ్లీకి రావాలి.. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి

పక్క పిల్లాడి బొమ్మలు విరగ్గొట్టే పిల్లల్లా హరీశ్, కేటీఆర్

కేసీఆర్ వారికి బుద్ధి చెప్పి పెద్దరికం నిలుపుకోవాలి

'తెలంగాణ తల్లి' విగ్రహావిష్కరణకు కేసీఆర్‌నూ పిలుస్తాం

ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఆవిష్కరణలో సీఎం రేవంత్

కాంగ్రెస్‌తో టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!: మహేశ్‌గౌడ్

హస్తం పార్టీలోకి సోయం బాపూరావు, ఆత్రం సక్కు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండడం రాష్ట్రానికి మంచిది కాదని సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హితవు పలికారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో అధికార, విపక్షాలు అంటే భారత్-పాకిస్థాన్ మాదిరిగా కొట్లాడుకునే వైరి వర్గాల తరహాగా తయారైందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. శాసనసభ శీతాకాల సమావేశాలకు కేసీఆర్ హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రజల సమస్యలపై సభలో చర్చ పెట్టాలని.. ఆయన చతురతను, ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా పని చేసిన అనుభవాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. గురువారం సచివాలయంలో

మిగతా 11వ పేజీలో...

బహుజనుల తల్లిగా..

తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పన

సచివాలయంలో విగ్రహ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి

11

ఇందిరమ్మ ఇళ్ల యాప్





ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఆవిష్కరణలో ఇంటి నమూనాతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పొంగులేటి, పొన్నం, మహేశ్‌గౌడ్

అస్థిరత నుంచి

సుస్థిరత దాకా!

ఏడాదిలో అడ్డంకులను అధిగమించిన ప్రభుత్వం

కాంగ్రెస్ మార్క్ రాజకీయానికి దూరంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రాధాన్యం

కలిసికట్టుగా వ్యవహరిస్తున్న పార్టీ నాయకులు

'టీపీసీసీ చీఫ్'తో సామాజిక సమతుల్యత సాధన

కొలిక్కిరాని మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ భర్తీ

రెండో ఏడాది మొదట్లోనే స్థానిక ఎన్నికల సవాల్

గేరు మార్చి వేగం పెంచుతామంటున్న హస్తం

మళ్లీ రాజకీయ కార్యక్షేత్రంలోకి దిగనున్న కేసీఆర్

మహారాష్ట్రలో భారీ విజయం ఇచ్చిన జోష్‌లో బీజేపీ

వచ్చే ఏడాది కాలమంతా సంకుల సమరమే!

హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చింది బొటాబొటీ మెజారిటీ.! అలిగి అరడజను మంది ఎమ్మెల్యేలను చీల్చుకుపోగలిగే నేతలూ ఉన్నారనే చర్చ..! పార్టీ చరిత్ర చూస్తే.. నిత్యం అసమ్మతి, అంతర్గత కుమ్ములాటలు..! సీనియారిటీ ఉన్నా.. సీఎం కుర్చీ దక్కలేదన్న అసంతృప్తితో రగులుతున్న నాయకులు..! రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి మించి గ్యారెంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన నేపథ్యం..! ప్రధాన ప్రతిపక్షం ఏమో.. పదేళ్ల పాలనా అనుభవం, సమృద్ధిగా ఆర్థిక వనరులు, పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలతో బలంగా ఉంది..! దీనికితోడు సర్కారు త్వరలోనే కూలిపోతుందంటూ ఆ పార్టీ అగ్ర నాయకుల ప్రకటనలు..! సరిగ్గా నిరుడు డిసెంబరు 7న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన సమయంలో ఉన్న పరిస్థితి ఇది. కానీ, ఏడాది తిరిగేసరికి అంతా మారిపోయింది. వ్యూహాత్మకంగా అడ్డంకులను

మిగతా 8వ పేజీలో...

రెండేళ్లలో హైదరాబాద్‌లో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు

డీజిల్ బస్సులు, ఆటోలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రోత్సాహకాలు

ఆర్టీసీకి వెలుగులు నింపుతున్న మహాలక్ష్మి పథకం: సీఎం

ఉచిత ప్రయాణం.. 3902 కోట్ల చెక్కు ఆర్టీసీకి అందజేత

11

5,942 కోట్లతో వంతెనలు, అండర్‌పాస్‌లు

పాతబస్తీ నుంచి ఐటీ కారిడార్ వరకు

నలువైపులా ప్రాజెక్టులు

పురపాలక శాఖ అనుమతి

₹ 2.22 లక్షల కోట్ల పెట్టుబడులు

ఏడాదిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఘనత

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

11



అల్లు అర్జున్‌పై కేసు

ఆయన భద్రతాసిబ్బందితోపాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైనా!

మహిళ మృతి నేపథ్యంలో.. బీఎన్ఎస్‌లోని నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద నమోదు

అల్లు అర్జున్ వస్తున్నట్టు యాజమాన్యం సమాచారం ఇవ్వలేదు: పోలీసులు

నేరం రుజువైతే పదేళ్లదాకా జైలు!

చిక్కడపల్లి/కవాడిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన నేపథ్యంలో.. సినీ నటుడు అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సంధ్య థియేటర్ యాజమాన్యంపైన, అల్లు అర్జున్ సెక్యూరిటీ సిబ్బందిపైనా భారత న్యాయ సంహితలోని సెక్షన్ 105 (హత్య కిందకు రాని ప్రాణనష్టం కేసుల్లో పెట్టే సెక్షన్), 118(1) (ప్రమాదకరంగా వ్యవహరించడం ద్వారా వేరే వ్యక్తులు గాయపడేందుకు కారణం కావడం) వంటి నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. ఈ తరహా కేసుల్లో నేరం రుజువైతే గరిష్ఠంగా పదేళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది (గతంలో సల్మాన్‌ఖాన్‌పై పెట్టిన ఐపీసీ 304 సెక్షన్ బీఎన్ఎస్‌లోని సెక్షన్ 105తో సమానం). ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో

మిగతా 9వ పేజీలో...

'పుష్పా' అని పిలుచుకునేవాళ్లు!

హీరో అల్లు అర్జున్ అభిమాని శ్రీతేజ్

సినిమాకి వెళ్లి కన్నతల్లిని కోల్పోయి..

ఆస్పత్రిలో ఆందోళనకరస్థితిలో బాలుడు

9

తెలంగాణకు రెండు పత్తి పరిశోధన కేంద్రాలు

వరంగల్, ఆదిలాబాద్‌లకు కేటాయింపు

మంజూరు చేస్తూ ఐసీఏఆర్ లేఖ

11

కౌశిక్‌రెడ్డి అరెస్టు..

హైడ్రామా!



హరీశ్‌రావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు; బంజారాహిల్స్ పీఎస్‌లో కౌశిక్‌రెడ్డి

ఉదయమే కౌశిక్ నివాసానికి హరీశ్

అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనంతరం కౌశిక్ రెడ్డి, 20 మంది కార్యకర్తల అరెస్టు

అరెస్టులు అక్రమం: కవిత

హరీశ్ అరెస్టు నిరసనగా సిద్దిపేటలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

నేడు నెక్లెస్ రోడ్డులో నిరసనలు

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం/బంజారాహిల్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని గురువారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్టుకు ముందు, తర్వాత హైడ్రామా నెలకొంది. కౌశిక్ రెడ్డి అరెస్టును అడ్డుకొనేందుకు కొండాపూర్‌లోని ఆయన నివాసానికి వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలను వచ్చినవారిని వచ్చినట్లుగా పోలీసులు అరెస్టు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతోందని.. ఇందుకు సీఎం

మిగతా 9వ పేజీలో...



ధరణి మొరాయింపు

డేటా బదిలీలో సాంకేతిక సమస్యలు

నిర్వహణ బాధ్యతలు 1 నుంచి ఎన్ఐసీకి

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను విదేశీ సంస్థ టెర్రాసిస్ నుంచి 'జాతీయ సమాచార కేంద్రాని (ఎన్ఐసీ)'కి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులో ఉత్తర్వులిచ్చింది. ధరణి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. 1.56 కోట్ల ఎకరాలకు సంబంధించిన భూదస్త్రాలను గత పాలకులు విదేశీ సంస్థ చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ధరణి నిర్వహణను ఎన్ఐసీకి అప్పగించడం వల్ల రైతులకు చెందిన 71 లక్షల ఖాతాల భూములు సురక్షితంగా ఉంటాయని ప్రకటించారు. ఈ నెల 1 నుంచి భూ రికార్డుల నిర్వహణను

మిగతా 8వ పేజీలో...

హరీశ్‌రావును

అరెస్టు చేయొద్దు

దర్యాప్తు కొనసాగించవచ్చు: హైకోర్టు

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల కేసులో బీఆర్ఎస్ నేతకు ఊరట

గోప్యత ప్రాథమిక హక్కు.. దానిని ఉల్లంఘించారు: ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ చేయించారనే ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయరాదని.. కేసును యథావిధిగా దర్యాప్తు చేసుకోవచ్చని పోలీసులకు హైకోర్టు స్పష్టంచేసింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్ హరీశ్‌రావుకు సూచించింది. హరీశ్‌రావుపై కేసు పెట్టిన ఫిర్యాదుదారుడు చక్రధర్‌గౌడ్ వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక.. అక్రమంగా క్రిమినల్ కేసుల్లో ఇరికించడంతో పాటు, తన ఫోన్‌ను ట్యాపింగ్ చేయించారని

మిగతా 9వ పేజీలో...



పాఠశాలల్లో కలుషిత భోజనంపై నివేదిక ఇవ్వండి

టాస్క్‌ఫోర్స్ కమిటీల సమాచారం సమర్పించండి

8

మునిసిపాలిటీల్లో పంచాయతీల విలీనం సబబే

హైకోర్టు స్పష్టీకరణ

9

ఒకేసారి రెండు డిగ్రీలు

ఒకే దఫాలో రెండు పీజీలు కూడా చేసే అవకాశం

ఏడాదికి రెండు సార్లు ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు

ఏ కోర్సులోనైనా చేరవచ్చు

గడువు తగ్గింపు లేదా పొడిగింపునకు చాన్స్

ఉన్నత విద్యలో సంస్కరణలు

యూజీసీ మార్గదర్శకాల ముసాయిదా విడుదల

విద్యాసంస్థల సంసిద్ధత ఆధారంగానే అమలు


చైర్మన్ జగదీశ్ కుమార్



యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన సబ్జెక్టులు చదువుకునేందుకు వీలుగా పలు ప్రతిపాదనలు చేసింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఏడాదికి రెండుసార్లు ప్రవేశాల ప్రక్రియ, ఒకేసారి రెండు డిగ్రీ కోర్సులు చదివే అవకాశం, గత సబ్జెక్టుతో సంబంధం లేకుండా డిగ్రీ లేదా పీజీ కోర్సుల్లో ప్రవేశం ఇందులో ముఖ్యమైనవి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాల ముసాయిదాను యూజీసీ చైర్మన్ మామిడి జగదీశ్ కుమార్ గురువారం విడుదల చేశారు. ముసాయిదాలో పేర్కొన్న సంస్కరణలు అమలైతే.. ఓ విద్యార్థి ఒకేసారి రెండు డిగ్రీ కోర్సులు లేదా పీజీ కోర్సులు చేసే అవకాశం లభిస్తుంది. 12వ తరగతిలో చదివిన సబ్జెక్టుతో సంబంధం లేకుండా విద్యార్థి తనకు నచ్చిన సబ్జెక్టులో డిగ్రీ(అండర్ గ్రాడ్యుయేషన్) చేయవచ్చు. అలాగే, డిగ్రీలో చదువుకున్న సబ్జెక్టుతో నిమిత్తం లేకుండా

మిగతా 10వ పేజీలో...



భారత్‌లో పెట్టుబడులు

లాభదాయకం

ఆ దేశంతో వ్యాపారానికి రెడీ

10

పరిశ్రమల ఏర్పాటుకు రష్యా కంపెనీలు సిద్ధం

మోదీ 'మేక్ ఇన్ ఇండియా' భేష్: పుతిన్

సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

మహారాష్ట్ర సీఎంగా మూడోసారి.. డిప్యూటీ సీఎంలుగా శిందే, అజిత్‌పవార్

హాజరైన ప్రధాని మోదీ, షా, చంద్రబాబు, గడ్కరీ, యోగి, నితీశ్‌కుమార్

షారుక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, అంబానీ, సచిన్ కూడా..

10



ప్రమాణం చేసిన ఫడణవీస్, శిందే, పవార్‌తో ప్రధాని మోదీ

రేపు హైదరాబాద్‌లో బీజేపీ బహిరంగ సభ

ముఖ్య అతిథిగా హాజరుకానున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుఖాంతం..!

మొన్నటిదాకా ముఖ్యమంత్రి కుర్చీలో కూచొని, మళ్ళీ సీఎం కావాలని ఆఖరు వరకూ ప్రయత్నించి, హోం లేని డిప్యూటీ వద్దు గాక వద్దని భీష్మించుకున్న ఏక్‌నాథ్ శిందే ఎట్టకేలకు వచ్చారు, ప్రమాణం చేశారు. మహారాష్ట్రలో గురువారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవాన్ని అక్కడే ఉన్న ప్రధాని నరేంద్రమోదీనుంచి, టెలివిజన్ చానెళ్ళలో చూసిన పామరజనం వరకూ ఎవరూ అంతత్వరగా మరిచిపోలేరు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు, ఆ ప్రతిలో ఉన్న ప్రతీమాటనూ వల్లెవేయడం తప్ప ఆ వేదికమీద వేరు ప్రసంగం చేయవచ్చునని ఏక్‌నాథ్ షిండే తొలిసారిగా నిరూపించారు. మైకుముందుకు రాగానే, గవర్నర్ నోటినుంచి మాటను అదుకోవాల్సిన శిందే, దానిని పెడచెవినబెట్టి, నలభైసెకన్లపాటు ఓ అధిక ప్రసంగం చేశారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్‌థాకరేనుంచి తనకు రాజకీయబిక్ష పెట్టిన ఆనంద్ దిఘేవరకూ అందరినీ తలచుకున్నారు. మోదీ, అమిత్‌షాల పేర్లు కూడా అందులో ఉన్నందుకు ఆ పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు ఊపిరిపీల్చుకొని ఉంటారు. కానీ, శిందే వైఖరి ఆ ఉత్సవానికి హాజరైన పెద్దలందరినీ ఇబ్బందిపెట్టిందని వారి మొఖకవళికలే చెబుతున్నాయి. శిందేలో అణచిపెట్టుకొని ఉన్న ఆగ్రహం, అసహాయత అలా వ్యక్తమైనాయని గిట్టనివాళ్ళు భాష్యం చెప్పుకుంటున్నారు.


పదిరోజుల సస్పెన్స్‌కు తెరపడింది, ఫడణవీస్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. రానురానంటూ ఆఖరు వరకూ అదే ఉద్రిక్తస్థితిని కొనసాగించిన శిందే ఒకవైపు, ఆరోసారి డిప్యూటీ సీఎం పోస్టులో రికార్డు సృష్టించిన అజిత్‌పవార్ మరొకవైపు నిలబడివున్న ఆ దృశ్యం చూసినవారికి కథ సుఖాంతమైందని అనిపిస్తుంది. శిందే దెబ్బకు బీజేపీ ఇంకొంత దిగివచ్చిందనీ, మరో మూడు పోస్టులు ఆయనపార్టీకి దక్కాయని వార్తలు వస్తున్నాయి. ఏదో సినిమాలో డైలాగుమాదిరిగా, పదవులు మారాయి తప్ప, మనుషులువారే, దిశా వేగమూ అవే అని కొత్త సీఎం తన ప్రభుత్వం గురించి చెప్పుకున్నారు. మహాయుతి చిరకాలం నిలుస్తుందని, నాలుగుకాలాలు వర్ధిల్లుతుందనీ అన్నారు. కలసినడుస్తామని, సంఘటితంగా రాష్ట్రాన్ని పాలిస్తామని హామీ ఇచ్చారు. మహాయుతి మనుగడ విషయంలో ఏ భయమూ అక్కరలేదన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. శిందే ఒత్తిడిరాజకీయాలకు బీజేపీ లొంగిరాలేదన్న మాట నిజమే కానీ, ఈమారు ఫడణవీస్‌ను కాదనగలిగే శక్తి బీజేపీకి కూడా లేదన్నది నిజం. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికీ, ఫడణవీస్ ముఖ్యమంత్రి కావడానికీ ఆరెస్సెస్ కారణమని అందరికీ తెలుసు.

గతంలో కంటే మరింత బలపడిన రెండు పక్షాలతో ఫడణవీస్ కలసి నడవబోతున్నారు. యాభై ఏడుస్థానాలు నెగ్గిన శిందేకు ముఖ్యమంత్రిగా మరోమారు కొనసాగాలన్న కోరిక ఉన్నట్టుగానే, ఎప్పటికైనా ఆ కుర్చీలో కూచోవాలన్న ఆశ అజిత్‌పవార్‌కు ఉండటం సహజం. శరద్‌పవార్ నుంచి చీలివచ్చినప్పుడు అజిత్ స్థితివేరు, ఇప్పుడు 41స్థానాలతో, పెద్దాయన పార్టీని పదిస్థానాలకు పరిమితం చేసిన స్థాయి వేరు. పార్టీ వ్యవస్థాపకులు, వారసులకంటే మాతృసంస్థలను చీల్చివచ్చినవారు ఈమారు విస్తృత ప్రజామోదంతో మరింత బలమైన భాగస్వాములుగా కొనసాగుతున్నారు. ఓ యాభైస్థానాలు మినహా శాసనసభను మొత్తంగా కొల్లగొట్టినందువల్ల మహాయుతి ఓ మహాశక్తి. పూర్తి మెజారిటీకి ఓ పాతిక స్థానాల దూరంలో ఉన్న బీజేపీకి కూడా తిరుగులేదు. మళ్ళీ ముఖ్యమంత్రిని అవుతానని ఫడణవీస్ ఏ ధైర్యంతో అన్నారో గానీ, అదే జరిగింది. ఐదేళ్ళక్రితం ఉద్ధవ్‌థాకరేతో కలిసి ఎన్నికల్లో గెలిచాక, ఎప్పటిలాగానే బీజేపీ నుంచి తానే సీఎం అవుతానని ఈయన నమ్మాడు. కానీ, బాల్‌థాకరే కాలం నుంచీ రెండుపార్టీలూ పాటిస్తున్న సంప్రదాయాన్ని ఉద్ధవ్ కాదుపొమ్మన్నారు. ఈ మారు తానే కూర్చుంటానని నిర్ణయించి అప్పటికింకా చీలని ఎన్సీపీతోనూ, కాంగ్రెస్‌తోనూ చేతులు కలిపి రాజ్యాధికారాన్ని చేపట్టాడు. తన తరువాత ఎదిగివచ్చిన కుమారుడికి రాజ్యాధికారాన్ని అప్పగించాలని కూడా ఆశపడ్డాడు. ఆ తరువాత శిందేను సృష్టించి శివసేనను చీల్చి బీజేపీ తిరిగి రాజ్యం దక్కించుకున్నప్పటికీ, అధిష్ఠానం మాట కాదనలేక ఫడణవీస్ ఆ కుర్చీని వదులుకోవలసి వచ్చింది. చేజేతులా ఏక్‌నాథ్‌కు అప్పగించాల్సివచ్చింది. సముద్రం వెనక్కుపోయింది కదా అని ఒడ్డున పిచికగూళ్ళు కట్టకూడదు, నేను సముద్రాన్ని, మళ్ళీ వస్తాను అని అప్పట్లో ఆయన చేసిన వ్యాఖ్య ఇప్పుడు అంతా గుర్తుచేసుకుంటున్నారు. రాజకీయ యుద్ధంలో ఓడిగెలిచిన ఫడణవీస్‌కు రాబోయేరోజుల్లో ఎలా నడుచుకోవాలో, ఎవరితో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియనిదేమీ కాదు. ప్రస్తుతం...సుఖాంతం!

అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాధికార పోరాటం

కుల వ్యవస్థ, అంటరానితనం, అస్పృశ్యత కోట్లాది ప్రజల జీవితాలకు మానవీయ హుందాను నిరాకరించాయి. ఇలాంటి వివక్షపూరిత సమాజంలో పుట్టిన ధ్రువతార డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. దళిత జాతులను కులం పేరుతో మంచినీటికి దూరం చేసిన అగ్రకుల సమాజానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో 'మహాద్ చెరువు' పోరాటం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది భారతదేశంలోనే మొదటి మానవ హక్కుల ఉద్యమం. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక కుట్రల వలన అవి ఆచరణ సాధ్యం కానప్పటికీ నేటి రిజర్వేషన్ వ్యవస్థకు మూలమైనవి.

1927లో అంబేడ్కర్ 'బహిష్కృత భారత్' అనే పత్రికలో తిలక్ అంటరానివాడిగా పుట్టి ఉంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అనేవాడు కాదు, అస్పృశ్యతా నివారణ నా ధ్యేయం, నా జన్మ హక్కు అని నినదించేవాడని రాశారు. అంబేడ్కర్ రాకతో అణచివేతపై దిగువ కులాల పోరాట ఉద్యమాలు ప్రాంతీయ పరిధిని దాటి జాతీయస్థాయికి విస్తరించాయి. అవి 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే నినాదాలతో అందరిని సంఘటితం చేశాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి సమస్యల పరిష్కారంలో గాంధీతో అంబేడ్కర్ విభేదించారు. అంటరాని కులాలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడనిదే వారి సమస్యలకు పరిష్కారం దొరకదని భావించారు. అందుకే వీరికి రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులను పొందుపరిచారు. భారత రాజ్యాంగ రచన కమిటీకి అధ్యక్షత వహించారు. మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రాశారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి 'భారత రాజ్యాంగ పిత'గా వెలుగొందాడు. పీడనకు గురైన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్స్ కల్పించాడు. అగ్రకులాల కుట్రలు ఛేదించి అందిరికీ ఓటు హక్కును కల్పించి, రాజకీయ సమానత్వం సాధించాడు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా స్త్రీల ఆస్తి హక్కు కొరకు పోరాడారు. ఆయన అన్ని వర్గాల ప్రజల సమస్యలకు సబబైన పరిష్కారం చూపారు. జీవిత చరమాంకంలో అంబేడ్కర్ 'నా పుట్టుక నా చేతిలో లేదు కానీ, నా చావు నా చేతిలో ఉంది' అని ప్రకటించి హిందూ మతాన్ని వీడి మానవీయ విలువలతో కూడిన బౌద్ధాన్ని స్వీకరించారు. 1956 డిసెంబర్ 6న తుది శ్వాస విడిచారు.



నేడు ప్రతి వ్యక్తికి అమ్మ జన్మనిస్తే... అంబేడ్కర్ రాజ్యాంగం జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలపై లక్ష పేజీల సాహిత్యాన్ని మనకు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప నాయకుడు. అందుకే ఐక్యరాజ్య సమితి అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తించిది. ఆయన జయంతిని 'ప్రపంచ విజ్ఞాన దినోత్సవం'గా ప్రకటించడం మనందరికీ గర్వించ దగ్గ విషయం. కానీ, ఇప్పటికి ఆయనను దళిత నాయకుడుగా మాత్రమే సమాజం కీర్తించడం బాధాకరం. అన్ని వర్గాలకు హక్కులు కల్పించిన విశ్వమానవుడు. నేడు మనమంతా రాజ్యాంగం కల్పించిన హక్కులతో విలాస జీవితాలు అనుభవిస్తున్నాము తప్ప, ఆయన ఉద్యమ రథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమవుతున్నాము. అయినప్పటికీ అగ్రకుల పార్టీలు ఆర్థికంగా బలహీన వర్గాలకు 10శాతం EWS రిజర్వేషన్లు కల్పించుకొన్నాయి. ఇది వారి జనాభా కన్నా అధికం. అయినప్పటికీ వెనకడిన వర్గాలు ఈ విషయాన్నీ ప్రశ్నించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో దేశంలో మెజార్టీ జనాభా గల బీసీ, ఎస్సీ, ఎస్టీలు చేయాల్సింది రాజ్యాధికార యుద్ధం తప్ప, మరోటి కాదు. నేడు అన్నివర్గాల ఆత్మఘోషను వినిపించే భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. అగ్రకుల పార్టీలు ఒకటై రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నంలో ఉన్నాయి. రాజ్యాంగ రక్షకులు ఒకవైపు... రాజ్యాంగాన్ని మార్చేందుకు సంకల్పించిన శక్తులు మరొకవైపుగా దేశ రాజకీయ యుద్ధం జరుగుతుంది. కావున ఎన్నికల్లో అగ్రకుల ఆధిపత్య పార్టీలకు వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికార యుద్ధం చేయాలి. అప్పుడే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం అనే రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగుతుంది. అంబేడ్కర్ కోరుకున్నది కూడా అదే.

– సంపతి రమేష్ మహారాజ్

(నేడు అంబేడ్కర్ వర్ధంతి)

2024: విపత్తుల యుగం ఆరంభం!

సమస్త మానవాళి ఒక భిన్న యుగంలోకి ప్రవేశించింది. మన ధరిత్రి వ్యాప్తంగా సకల సమాజాలూ ఒకటి కాదు, రెండు కాదు.. అనేక విధాలుగా మార్పులకు లోనవడం ప్రారంభమయింది. ఆ మార్పులు ఎటువంటివి? వాతావరణ మార్పు పర్యవసానాలు అవి. అవును, వాతావరణ మార్పు విషమ కాలం ప్రారంభమయింది. 2024 సంవత్సరమే ఈ విపరీత కాలాన్ని ప్రప్రథమంగా పలు రీతుల్లో మన అనుభవాల్లోకి తెచ్చింది– ప్రతి రోజు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడో ఒక చోట తీవ్ర వాతావరణ సంఘటనల తాకిడి కనిపిస్తూనే ఉన్నది. వడగాడ్పులలోను చలిగాడ్పులలోను కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. వెన్వెంటనే వాటిని సరికొత్త రికార్డులు అధిగమిస్తున్నాయి! వాతావరణం వికృత పోకడలు పోతోంది. ఇప్పటికే మనుగడ అంచున జీవిస్తున్న మానవ సమూహాలు ఎన్నో, తరచు సంభవిస్తున్న వాతావరణ విపత్తుల నుంచి కోలుకోలేని రీతిలో నష్టపోతున్నాయి, కాదు, ధ్వంసమవుతున్నాయి. మరి ఇదొక భిన్నమైన యుగం కాదూ?

శాస్త్రవేత్తలు ఈ వినూత్న కాలాన్ని ఆంత్రోపోసీన్ యుగం (మానవుని ఇటీవలి యుగం)గా అభివర్ణించారు. మానవుని కార్యకలాపాలు భూగ్రహ శీతోష్ణపరిస్థితులు, పర్యావరణ వ్యవస్థలపై ఉపేక్షింపదగని ప్రభావాలను నెరపుతున్న కాలమిది మానవునికి మరింత శ్రేయస్సును సమకూర్చేందుకు, మరింత సంపద సృష్టికి చేపట్టిన ప్రతి చర్య, వేసిన ప్రతి ముందు అడుగు నిరర్థకమవుతున్న పాడు కాలమిది. అంతే కాదు, మానవులుగా పరస్పర సంబంధాలలో మనం ప్రవర్తిస్తున్న తీరు తెన్నులు వేగంగా మారిపోతున్న నిష్ఠుర కాలమిది; ఏది మంచి ఏది చెడు అనే విషయంలో లోకం పోకడలు అనూహ్యంగా ఉంటున్న రోజులివి; రాబోయే సంవత్సరాలలో సమస్త మానవ కార్యకలాపాలను మౌలికంగా మార్చివేయగల అధునాతన కృత్రిమ మేధ సాంకేతికతల శక్తి సామర్థ్యాలలో మహా మార్పులు చోటు చేసుకుంటున్న నవీన కాలమిది. సమాజ వ్యవహారాలపై జనసామాన్యం చర్చల 'స్వభావాన్ని' సైతం మనం మార్చివేశాం. తద్వారా ఎంత నీచమైన, విద్వేషపూరితమైన, విధ్వంసకరమైన ఆలోచనలనూ బయటికి చెప్పుతున్నాం. ఇదే, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలిగే వాక్ స్వాతంత్ర్యమని విశ్వసిస్తున్నాం. అయితే కొత్త యుగ అధునాతన సాంకేతికతల వాణిజ్యరీతులలో సంపూర్ణ నమ్మకాన్ని సుదృఢంగా నెలకొల్పుకున్నాం. ఈనాటి బిగ్ టెక్ కంపెనీలు సమాజాల సర్వ కార్యకలాపాలను నియంత్రించే సామ్రాజ్యాలుగా పరిణమించాయి. ఈ కొత్త టెక్ కంపెనీలు గత కాలం బహుళ జాతి సంస్థలను చాలా అల్పమైనవిగా చేశాయి. కొత్త టెక్ కంపెనీలు దేశాల సరిహద్దులను అధిగమించి ప్రపంచ వ్యాప్తంగా సమస్త ప్రజల జీవితాలను అనేక విధాలుగా ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీల అధిపతులే మార్పులకు చోదక శక్తులుగా ఉన్నారు–కేవలం సాంకేతికతలు, మీడియాలోనే కాకుండా రాజకీయాలలో సైతం కనీవినీ ఎరుగని ప్రభావాన్ని నెరపుతున్నారు. విధాన నిర్ణయాలను తీసుకునేది తామేనని, అవి ప్రజల ప్రయోజనాలను కాపాడేవిగా ఉంటాయనే భ్రమల్లో చాలా ప్రభుత్వాలు ఉన్నాయి. వాస్తవమేమిటంటే ప్రభుత్వ నిర్ణయాలను రూపొందించే ప్రక్రియలను ప్రభుత్వాలు చాలా వరకు గ్లోబల్ కన్సల్టెన్సీలకు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, ప్రైవేట్ కంపెనీలకు వదిలివేశాయి. ప్రభుత్వ వ్యవస్థలు ప్రైవేటీకరణ అవుతున్నాయి. మనం అంటే ప్రజలం కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోతున్నాం. ప్రజాస్వామ్యం ఇంకా అంతమైపోలేదు. అయితే కార్పొరేట్ కంపెనీలు, వాటి వినియోగదారులు, అంటే మీరు, నేనూ– మధ్య సంబంధాల ప్రభావంతో ప్రజాస్వామ్యం మౌలికంగా పరివర్తనచెందుతోంది ఇదంతా వాతావరణ మార్పు విశ్వరూపం ప్రదర్శిస్తున్న కాలంలో సంభవిస్తోంది.



> వాతావరణ వైపరీత్యాల అనివార్య కాలంలో ఉన్నామనే కఠోర సత్యం మనకు తెలుసు. ఈ బాధాకర వాస్తవాన్ని మనం నిరాకరించడం లేదు. అయితే మానవాళి అవిభాజ్య శ్రేయస్సు సాధనకు సమష్టిగా పనిచేసే సమాజంగా మనం ఇంకెంత మాత్రం సంఘటితం కాలేకపోతున్నాం.

మనం మరింత అభద్రంగా, మరింత ఆందోళనకరంగా నివశిస్తున్నాం. అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ధనికులు మరింత సంపన్నులుగా పేదలు నిరుపేదలుగా మారిపోతున్న కాలమిది. కోవిడ్ మహమ్మారి సకల ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేయడంతో ఆ అసమానతలు గత ఐదేళ్ల కాలంలో మరింతగా పెరిగాయి. జీవన స్థితిగతులు మెరుగుపరచుకునేందుకు ప్రజలు వలస బాట పడుతున్నారు. వలసల పరిణామాలు, పర్యవసానాలు పలు దేశాల్లో ప్రజలను మరింత అభద్ర పరిస్థితులలోకి నెట్టివేశాయి. వారి ఆగ్రహం ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతగా పరిణమిస్తోంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ ఆగ్రహం, వ్యతిరేకత అన్నవి పేద ప్రజలకే పరిమితం కాదు. సంపన్నులు సైతం తాము దగా పడినట్టు భావిస్తున్నారు. 1990 దశకం తొలినాళ్లలో దేశ దేశాల ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ప్రారంభమయినప్పుడు పేద ప్రజలు మాత్రమే తాము ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోతామని భయపడ్డారు. రైతులు వీధులలోకి వచ్చి తమ దురవస్థలపై నిరసన తెలిపారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు తమకు మేలు చేయడం లేదని ఆక్రోశించారు. ఇప్పుడు పరిస్థితులు తలకిందులయ్యాయి. సంపన్న దేశాలలో అధునాతన సాంకేతికతలతో కార్మికులు ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కోల్పోయారు. వారు క్రమంగా 'విద్యాధిక కులీనులు, నిపుణులు'కు వ్యతిరేకులుగా మారుతున్నారు సర్వీస్ రంగం అభివృద్ధితో అధికంగా లబ్ధి పొందుతున్నది విద్యాధికులు, నిపుణులేనని సామాన్య కార్మికులు విమర్శిస్తున్నారు. ఈ వర్గ వైషమ్యాల కారణంగా సమాజ శ్రేయస్సుకు దోహదం చేసే భావాలు తిరస్కరణకు గురవుతున్నాయి. జ్ఞానసంచయం ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలనే కాపాడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రపంచ సంఘటిత సమాచార, వ్యాపార వ్యవస్థలు ఇటువంటి పరిస్థితులను పెంచుతున్నాయి. ఈ అపసవ్య ధోరణులు శ్రుతిమించుతున్నాయి. చివరకు సమస్త ప్రజల శ్రేయస్సును ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న వాతావరణ మార్పు వాస్తవాన్నీ సంశయిస్తున్నారు!. అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో అది మరింత తీవ్రమయింది.

వాతావరణ వైపరీత్యాల అనివార్య కాలంలో ఉన్నామనే కఠోర సత్యం మనకు తెలుసు. ఈ బాధాకర వాస్తవాన్ని మనం నిరాకరించడం లేదు. అయితే మానవాళి అవిభాజ్య శ్రేయస్సు సాధనకు సమష్టిగా పనిచేసే సమాజంగా మనం ఇంకెంత మాత్రం సంఘటితం కాలేకపోతున్నాం. అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో ఇటీవల ముగిసిన 29వ అంతర్జాతీయ వాతావరణ సదస్సులో అది స్పష్టమయింది. వాతావరణ మార్పు నెదుర్కొనేందుకు ఒక సహకార పూరిత ప్రపంచాన్ని నిర్మించుకునే సంకల్పం విషయంలో కూడా చిత్తశుద్ధి చూపలేకపోయాం. క్లైమేట్ జస్టిస్ పేరిట వాతావరణ మార్పు నెదుర్కొనేందుకై పేద దేశాలకు నామమాత్ర ఆర్థిక సహాయాన్ని అందించేందుకు సంపన్న దేశాలు ముందుకు వచ్చాయి. చారిత్రకంగా వాతావరణ మార్పుకు కారణమైన ఆ దేశాలు పేద దేశాలకు ధర్మ బోధలు చేశాయి. కర్బన ఉద్గారాలు తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచుకోవాలని చెప్పాయి. వాతావరణ మార్పుతో సంభవిస్తున్న నష్టాలను తాము అందించే ఆర్థిక సహాయంతో భర్తీ చేసుకోవాలని స్పష్టం చేశాయి. అయితే మానవాళి మనుగడకు ధరిత్రిని సురక్షిత ప్రదేశంగా మార్చేందుకు ఆ ఆర్థిక సహాయం ఎంత మాత్రం చాలదు. సంపన్న దేశాల వైఖరి వాతావరణ లక్ష్య సాధన ప్రాధాన్యాన్ని తక్కువ చేయడమే కాకుండా, పేద దేశాలను అవమానించడమేనని చెప్పక తప్పదు.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణ ప్రారంభమైనప్పుడు ఒక సుస్థిర ప్రపంచ వ్యవస్థ ఏర్పడగలదనే ఆశాభావం నిండుగా వ్యక్తమయింది. పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాలనే లక్ష్యంతో ప్రపంచ దేశాలు వ్యవహరించాయి. అయితే వాటి అసలు లక్ష్యం ప్రపంచ శాంతి కానేకాదు, వ్యాపార ప్రయోజనాలను కాపడుకోవడమే. కార్మిక, పర్యావరణ భద్రత వ్యయాలను తగ్గించేందుకు తమ ఫ్యాక్టరీలను అభివృద్ధి చెందుతున్న దేశాలకు తరలించాయి. ఈ తరలింపుతో ఉత్పత్తి కార్యకలాపాలే కాకుండా వాతావరణ కాలుష్య వాయు ఉద్గారాలు కూడా తరలిపోయాయి. కర్బన ఉద్గారాల గణాంకాలను చూస్తే చైనా అగ్రస్థానంలో ఉంటుంది. పాశ్చాత్య సంపన్న దేశాల పరిశ్రమలు అధికంగా చైనాకు తరలిపోవడమే అందుకు కారణం. హరిత పరివర్తన అనివార్యమైన నేటి ప్రపంచం కొత్త వాస్తవాలను ఎదుర్కొంటున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా చైనాలో ఉత్పత్తి అవుతున్న సరుకులు చౌకగా పాశ్చాత్య సంపన్న దేశాలకు అందుతున్నాయి. ఉత్పత్తి కార్యకలాపాలు విదేశాలలో జరగడం వల్ల స్వదేశంలో నిరుద్యోగిత ప్రబలిపోతోంది. ఈ కారణంగానే విదేశాలలో ఉన్న అమెరికా ఫ్యాక్టరీలు అన్నిటినీ అమెరికాకు తీసుకువచ్చి అందరికీ ఉద్యోగాలు కల్పిస్తానని డోనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు.

వాతావరణ మార్పు విషమ యుగం ప్రారంభమైన 2024 సంవత్సరంలోనే ప్రపంచ వ్యాప్తంగా సమాజాలు అన్నీ ఒక భిన్న యుగంలోకి ప్రవేశించాయి. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని భిన్నమైన– విధ్వంసక వర్తమానానికి పూర్తిగా విరుద్ధమైన– ఒక భవ్య భవిష్యత్తును నిర్మించుకోవడానికి సంకల్పించుకోవాలి, కార్య ప్రణాళికను రూపొందించుకోవాలి, లక్ష్య నిమగ్నులమవ్వాలి. ఇంకెంత మాత్రం గతంలో జీవించకూడదు. గతానికి ఖైదీలుగా ఉండిపోతే మనం అసలు మనుగడనే కోల్పోయే ప్రమాదమున్నది. ఒక కొత్త పొద్దుపొడుపులోకి పథనిర్దేశకులుగా మనం ప్రవేశించాలి; ఇంతవరకు మనం చేసిన తప్పులను అంగీకరిస్తూ ఒక కొత్త వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మనం నిబద్ధులమవ్వాలి. లేనిపక్షంలో రాబోయే దశాబ్దాల విలువైన సమయాన్ని వ్యర్థం చేసినవాళ్లమవుతాం. పర్యవసానంగా వాతావరణ మార్పు ప్రభావాలు క్రమగా పెరిగిపోయి వాటి సుడిలో చిక్కుకుని అంతిమంగా ఒక శూన్యతలోకి ప్రస్థానించే ప్రమాదమున్నది. పొంచి ఉన్న ఈ ప్రమాద పరిస్థితిని మనం మార్చి తీరాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

భారత్ పరపతికి 'బంగ్లా' పరీక్ష


బంగ్లాదేశ్‌లో చెలరేగుతున్న అల్లర్లు, మైనారిటీల లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. అక్కడి తాత్కాలిక ప్రభుత్వ అసమర్థత లేదా పరోక్ష తోడ్పాటు వల్ల అవి తగ్గే సూచనలు కనబడడం లేదు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు దిగజారితే, ఆ ప్రభావం భారత్‌పై కూడా ప్రతికూలంగానే ఉంటుంది. భారత్‌తో స్నేహం కనపర్చే హసీనా ప్రభుత్వం, తన నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పెల్లుబికిన పౌర సమాజం ఆందోళనలతో కూలిపోయింది. ప్రజాస్వామిక ప్రభుత్వం నెలకొల్పే పేరిట ఆమెకు వ్యతిరేకంగా వ్యవహరించిన వివిధ వర్గాలు తాత్కాలికంగా యూనస్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఆయన ఆధ్వర్యంలో పరిస్థితి చక్కబడడం అటుంచి, మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రిస్టియన్లపై, వారి ఆస్తులు, ప్రార్థనా స్థలాలపై దాడులు పెరిగాయి. ఒక నివేదిక ప్రకారం ఈ మూడు నెలల్లో రెండు వేలకు పైగా ఈ తరహా దుశ్చర్యలు జరిగాయి. ప్రభుత్వం వైపు నుండి మొక్కుబడి ప్రకటనలు మినహా పరిస్థితి కుదుటపర్చే చర్యలు శూన్యం. మైనారిటీలకు రక్షణ కల్పించమని కోరుతూ జరుగుతున్న ఆందోళనలకు నాయకత్వం వహించిన ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ దాస్‌ని అక్కడి ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా భారత్‌లో తలదాచుకున్న మాజీ ప్రధాని హసీనా బంగ్లాదేశ్ నాయకత్వంపై తీవ్ర విమర్శలకు పాల్పడడం కూడా భారత్‌కు ఇరకాటమే. వారి అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చడం భారత్ విధానం కాదు. చూస్తూ చూస్తూ అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన పట్ల ఉదాసీనంగా ఉండడం కూడా సాధ్యం కాదు. పొరుగుదేశం సైనిక రాజ్యంగానో, మత రాజ్యంగానో మార్పు చెందడం క్షేమం కాదు. భారత్ దౌత్యనీతికి, పరపతికి, వ్యవహార దక్షతకి ఇది పరీక్షా సమయం.

– డి.వి.జి. శంకరరావు

ఒంటరి ప్రయాణికుడు

గత 40 ఏళ్లుగా సాహిత్య, సామాజిక రంగాలలో అంకితభావంతో పని చేసిన వుప్పల నరసింహం అనామకంగా కన్నుమూయడం విషాదకరం. కవిత్వం, పాట, నాటకం, వ్యాసం, కథ– ఇలా వివిధ సాహిత్య ప్రక్రియలో ఆయన రచనలు చేశారు. అయినా ఏ సాహిత్యకారుడు పట్టించుకోలేదు. మూడు దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేసినా ఏ జర్నలిస్టు కానీ, యూనియన్ కానీ పట్టించుకున్న దాఖలా లేదు. సినిమాలకు, టీవీలకు కూడా ఆయన పనిచేశారన్న సంగతి చాలామందికి తెలియదు. సామాజిక కార్యకర్తగా వివిధ అన్యాయాలపై కలాన్ని, గళాన్ని వినిపించిన చరిత్ర ఆయనది.

వుప్పల నరసింహం 1955లో, సికింద్రాబాద్‌కు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరయాంజాల్ అనే గ్రామంలో జన్మించారు. అక్కడే ఉన్నత పాఠశాల విద్య, విద్యార్థి దశలోనే రాత్రి పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామీణులకు అక్షరాలు నేర్పారు. దేవరయాంజాల్‌లో, ఆర్ట్ లవర్స్ వారి 'బీదల పాట్లు' నాటకం చూసి ఆకర్షితుడై ఆర్ట్ లవర్స్‌లో చేరారు. అనంతరం తెలంగాణ పల్లెల్లో విస్తృతంగా తిరిగారు. ప్రజల్లో చైతన్యం కలిగించే అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆర్ట్ లవర్స్ సంస్థతో కలిసి అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత జననాట్యమండలిలో చేరి క్రియాశీలకంగా పనిచేశారు. అక్కడి నుండి విరసంలో చేరారు. అప్పుడే 'ఆంధ్రప్రభ'లో జర్నలిస్ట్‌గా ఎంపికై బెంగళూరుకు వెళ్లాల్సి వచ్చింది. ఉద్యోగరీత్యా బెంగళూరు, మద్రాసులు తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆంధ్రప్రభ మూతబడిన తర్వాత ఇంటిపట్టునే ఉండి రచన వ్యాసాన్ని కొనసాగించారు.



వుప్పల నరసింహం
(1955–2024)

వుప్పల నరసింహం 'తిరగబడ్డ భూమి, ముద్ర, ఎర్రలైటు' అనే మూడు కథా సంపుటాలను వెలువరించారు. ఈ మూడింటిని కలిపి 'మట్టి మనిషి వుప్పల నరసింహం కథలు' పేరిట 2016లో ఒకే సంకలనంగా తీసుకువచ్చారు. వుప్పల నరసింహం కథల ఏకైక నేరేటివ్ అజెండా– భూస్వాముల దౌష్ట్యం, భూస్వామ్య వ్యవస్థ క్రూర సంఘటనల కింద నలిగిన సామాన్య ప్రజల బ్రతుకులు. తెలంగాణకు చెందిన చాలా మంది కథా రచయితలు అవలంబించిన ధోరణే ఇది. అయితే గ్రామీణ జీవితాన్ని, అక్కడి వృత్తుల విశేషాలను, జనం నాలుకల మీది నుడికారాలను ఇంత చక్కగా పట్టుకున్న రచయిత వేరొకరు నాకు కనిపించలేదు. కావలి వాండ్లు, సాపలల్లె వాళ్ళు, సొన్నాయిలోళ్ళు, వెట్టి చాకిరికి అంటుకుపోయిన పాలేరులు, మేదరవాండ్లు, శారదకాండ్లు, ఎరుకలోళ్ళు, గ్రౌండ్లోళ్ళు వగైరా వివిధ అణగారిన కులాల వృత్తుల వెతలను ప్రతిబింబిస్తాయి ఈయన కథలు. అలాగే 'చౌరస్తా' పేర నలుగురు తెలంగాణ రచయితల కథల సంకలనాన్ని తీసుకువచ్చారు. కథావేదిక వార్షిక సంచికలు తెచ్చారు.

ఎవరికి తోచిన కథలు వారు రాసుకోవడమే కాదు. కథకుల మధ్య పరస్పర బాంధవ్యం ఉండటం, కథా శిల్పానికి, కథా సృష్టికి, కథాలోకానికి ఎన్నో విధాల ఉపకరిస్తుందనే ఉద్దేశంతో వుప్పల నరసింహం 'కథావేదిక'ను తలపెట్టారు. ఇతర భాషలలోని కథకులను ఆహ్వానించి, వారు తమ కథ చదవగా వినడం, సందేహాలు ఏవైనా కలిగితే అడగడం– ఇలా ఈ వేదిక ఒక విధంగా కథ సాహిత్య సమాలోచనగా రూపొందింది. కథావేదిక పనిచేయడానికి వీలుగా ఒక ట్రస్టు ఏర్పాటు చేసి, ఆ ట్రస్టు ద్వారా సంచార గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, తెలుగు కథను ఇంగ్లీషు –హిందీ భాషలలోకి అనువాదాలు చేసి ప్రచురించాలని, ఒక బులెటిన్ తీసుకురావాలని, పాతతరం కథా రచయితలపై డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించాలని, వీడియో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని కథలతో సంవత్సరానికి ఒకటి రెండు వీడియో సంచికలు తీసుకురావాలని, కథల ఆడియో క్యాసెట్లు తీసుకురావాలని, స్టోరీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ఆ స్టోరీ బ్యాంక్‌లోని కథలను తీసుకొని నాటకాలుగా, టీవీ ప్రాయోజక కార్యక్రమాలుగా రూపొందించాలని కలలుగన్నారు. ఇందులో భాగంగానే కథా వేదిక తరఫున 'కథ మా ఊపిరి' అనే చిన్న పుస్తకంతో పాటు, కథావేదిక వార్షిక సంచికలను వెలువరించారు. 'ఒక కథకుని కథ' పేరుతో మునిపల్లె రాజు గారి మీద విసిడిని తీసుకువచ్చారు.

తను పుట్టిన నేల మీద ప్రేమ, తెలంగాణ భాషా సంస్కృతుల మీద విస్తృతమైన అవగాహన ఉన్న వుప్పల నరసింహం వాటి గొప్పతనాన్ని తెలియజేయడానికి కొన్ని ఫీచర్లను నిర్వహించారు. అందులో 'తెలంగాణ ముచ్చట్లు' ఒకటి. ఈ ముచ్చట్లు అన్నీ దళిత బహుజనులవే. వుప్పల నరసింహం 'సబ్బండ వర్ణాలు' అడుగు వర్గాల జీవన స్వర సంపుటి. ఈ గ్రంథంలో ఆయన 70 కులాలు, వారి వృత్తి జీవితాలను పరిచయం చేశారు. అంతేకాదు. ఆనాటి నుండి ఈనాటి దాకా వారి జీవిత పరిస్థితులను వారి మాటల్లోనే రూపు కట్టించాడు. ఇలాంటి రచనలు సామాజిక వ్యవస్థకు ఆధార గ్రంథాలుగా నిలుస్తాయి. ఓ 50 ఏళ్లు గడిచాక ఈ కులాల, వృత్తుల వారి గురించి తెలుసుకోవడానికి ఈ గ్రంథాన్ని రెఫర్ చేయకుండా ముందుకు సాగలేరు. తెలంగాణ పల్లెల్లో, తెలంగాణ జన జీవితంలో, తెలంగాణ భాషలో జీవించిన వుప్పల నరసింహం 'తెలంగాణ స్వగతాలు' అక్షరబద్ధం చేశాడు. దూర దూర ప్రాంతాలకు వెళ్లి ప్రజల్లో కలిసి జీవించి, వారి జీవితాన్ని అక్షరబద్ధం చేశారు. స్వగతాలు చదవడం కాదు. చూస్తున్నంత సేపు తెలంగాణ పల్లెల జీవితాల బొమ్మ మన ముందు ప్రత్యక్షమవుతుంది. తెలంగాణ భాష, సంస్కృతులను ప్రతిబింబించే 'ముద్ర' ఒక సరికొత్త ప్రయోగం. జానపద కళాకారులు, వృత్తి గాయకులు ఆశువుగా పాడుకునే మౌఖిక సాహిత్య ధోరణిలో ఈ కథనాలు రూపొందాయి. అలాంటిదే 'ప్రజా పలుకు' అనే మరో పుస్తకం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ఎన్నో వ్యాసాలను రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 'జై జై తెలంగాణ' అనే పంచరంగుల బులెటిన్‌ను మాసపత్రికగా తీసుకువచ్చారు. అధికార పీఠం చుట్టూ మూగిన కవులనే తప్ప సీనియర్ రచయితలను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోదు అనే ఫిర్యాదుకు భిన్నంగా– తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి ఉత్తమ రచయితగా వుప్పల నరసింహంను గుర్తించి, అకాడమీ తరఫున లక్ష రూపాయల నగదుతో తగురీతిన సత్కరించడం విశేషం.

లౌక్యం లేకపోవడం, కటువుగా మాట్లాడటం, ఉన్న విషయాన్ని ముఖం మీద గుద్దినట్లుగా చెప్పడంతో– నరసింహం క్రమంగా అందరికీ దూరమై ఒంటరిగా మిగిలిపోయాడు. ఆ ఒంటరి ప్రయాణం గత నెల 14న ముగిసింది. చివరి వరకు ఏదో ఒకటి రాస్తూ వచ్చిన వుప్పల నరసింహం తన 70వ ఏట గుండె పోటుతో స్వగృహంలో మరణించారు. నరసింహం ఉన్నా లేకపోయినా ఆయన సాహిత్యం ఎప్పటికీ ఉండిపోతుంది.

○ కె.పి. అశోక్ కుమార్

సవాళ్ళను దాటుతూ సువర్ణ పాలన వైపు...!

తొలి ఏడాదిలోనే చరిత్రలో నిలిచిపోయేలా తన మార్క్ పాలనను సీఎం రేవంత్‌రెడ్డి అందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ తను ఎంచుకున్న ఉన్నతమైన లక్ష్యాల సాధన దిశగా నిర్విరామంగా అడుగులు వేశారు. నిత్యం ఎన్నో సమస్యలను, మరెన్నో సవాళ్లను అధిగమిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన అందిస్తున్నారు. ఒకవైపు అమలులో ఉన్న పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తున్నారు. తొలి ఏడాదిలోనే రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల దృష్టిలో ఉత్తమ సీఎంగా నిలిచారు.

రేవంత్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల కారణంగా కొన్ని పథకాల అమలు విషయంలో కొంత ఆలస్యం అవుతున్నదే తప్ప– ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమంత బాగా లేదు. రాష్ట్ర ఆవిర్భావం నాటికి రూ.76,577 కోట్ల అప్పు ఉండగా అది డిసెంబరు 2023 నాటికి రూ.6,71,757 కోట్లకు చేరింది. దీనివల్ల ప్రతి నెలా సుమారు రూ.7,500 కోట్లు అప్పులకు వడ్డీగా చెల్లించాల్సి వస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగిస్తోంది.

> రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమంత బాగా లేదు. రాష్ట్ర ఆవిర్భావం నాటికి రూ.76,577 కోట్ల అప్పు ఉండగా అది డిసెంబరు 2023 నాటికి రూ.6,71,757 కోట్లకు చేరింది. దీనివల్ల ప్రతి నెలా సుమారు రూ.7,500 కోట్లు అప్పులకు వడ్డీగా చెల్లించాల్సి వస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆపకుండా కొనసాగిస్తోంది.

తెలంగాణ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మను గత ప్రభుత్వం విస్మరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు చరిత్రలో నిలిచిపోయేలా మహిళా యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టింది. మరోవైపు కలం యోధుడు, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్ రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టి గౌరవించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబరు 9న ఏర్పాటు చేయనున్నారు. విద్యా వ్యవస్థలో సమగ్ర విధానాలను రూపొందించడం కోసం తొలిసారిగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఇదే విధంగా వ్యవసాయ రంగంలోనూ మార్పులు తెస్తూ రైతు సంక్షేమానికి భరోసాగా నిలిచేందుకు వ్యవసాయ కమిషన్‌ను సైతం తొలిసారిగా ఏర్పాటు చేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వినడమే గాక పరిష్కరించేందుకు– దుర్భేద్యమైన ప్రగతిభవన్ ముళ్ల కంచెలు తొలగించి దాన్ని మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్‌గా మార్చి ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంతో పాటు రాష్ట్ర దశాబ్ది



ఉత్సవాలలో ఈ గీతాన్ని జాతికి అంకితం చేశారు. తెలంగాణ ఉద్యమాలకు ఊపిరి పోసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని తెల్లాపూర్‌లో ఏర్పాటు చేశారు.


ప్రజాపాలన మొదలైన తొలి రోజే మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం హామీని అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. గత ఏడాది డిసెంబరు 9న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోని 107.26 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకోగా వీరికి రూ.3,541.67 కోట్లు ఆదా అయింది. ఇదే పథకంలో రూ.500 లకే గ్యాస్ సిలెండర్‌ను అందిస్తున్నారు. రాష్ట్రంలోని 46,67,510 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. గృహ జ్యోతి పథకం కింద అర్హులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా జరుగుతోంది. జీరో బిల్లు కింద రాష్ట్రంలోని 49,51,725 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1158.42 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లించింది. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచారు. ఏడాది కాలంలో వ్యవసాయ రంగానికి రూ.54,280 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. రూ.2 లక్షల రుణాలు తీసుకున్న రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం చాలా గొప్ప విషయం.

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి మూసీనది ప్రక్షాళన, అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. నగరంలో కబ్జాలకు చెక్ పెట్టేందుకు హైడ్రాను ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒక విజనరీగా చెప్పుకోవచ్చు. ఏ పని చేసినా పది తరాలకు ఉపయోగపడేలా ఆలోచన చేస్తున్నారు. అందులో భాగంగానే ఫ్యూచర్ సిటీని తెరమీదకు తెచ్చారు. ఇప్పటి వరకు ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ లకు ధీటుగా ఆధునిక మౌలిక సదుపాయాలతో అత్యాధునిక నగరంగా నాలుగో (ఫోర్త్ సిటీ) నగరాన్ని నిర్మించాలనే సంకల్పంతో ముచ్చర్లలో ఈ సిటీ నిర్మాణానికి పునాది వేశారు.

విదేశీ పెట్టుబడులను రాబట్టేందుకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారుల బృందంతో కలిసి దావోస్, కొరియా, అమెరికా దేశాలకు వెళ్ళారు. ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.76,232కోట్ల విదేశీ పెట్టుబడులను సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసుకుంది. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పాలసీ–2024ను తీసుకొచ్చారు. యువతకు స్వయం ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో భూమి, ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. తెలంగాణ అంతటా పారిశ్రామిక వృద్ధి జరగాలనే లక్ష్యంతో మెగా మాస్టర్ పాలసీ ప్లాన్–2050ను అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ ఒక్కచోటే పారిశ్రామిక ప్రగతి కేంద్రీకృతం కాకుండా తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేసే లక్ష్యంతో మెగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. తొలి ఏడాదిలోనే అన్ని రంగాల్లో రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రగతిని సాధించింది. రాబోయే నాలుగేళ్లలో మరెన్నో విజయాలు సాధించి తెలంగాణను అన్ని రంగాలలో నంబర్ వన్‌గా ప్రపంచ పటంలో నిలుపాలని ఆకాంక్షిద్దాం.

■ ఎన్. యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

'భద్రకాళి' గర్భంలో ఏముందో?


నీరు తరలింపు పూర్తవడంతో పూడికతో కనిపిస్తున్న భద్రకాళి చెరువు

చారిత్రక చెరువు పూడికతీత వేళ ప్రజల్లో ఆసక్తికర చర్చ

- ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- ఇప్పటికే 130 మిలియన్ క్యూబిక్ అడుగుల నీరు వెలికితీత
- 900ఏళ్ల నాటి సరస్సులో వారసత్వ సంపద దాగి ఉందనే భావన
- గుప్త నిధులు, విగ్రహాలు లభిస్తే పక్కదారి పట్టే అవకాశం
- చారిత్రక సంపదను కాపాడాలంటున్న ఓరుగల్లు వాసులు
- సీసీ కెమెరాలు, పోలీసు రక్షణ, పురావస్తు శాఖ పర్యవేక్షణ ఉండాలని డిమాండ్
- 2018లో బండ్‌లో గణపతి, శివలింగాలతోపాటు ఇతర విగ్రహాలు లభ్యం

6

భద్రకాళి చెరువు.. వందల ఏళ్ల చరిత్రకు చిరునామా.. సుమారు 900 ఏళ్లనాడు కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ చెరువులో పేరుకుపోయిన మట్టిని వెలికితీసి.. సుందరీకరించేందుకు తొలిసారి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వరంగల్ నగర నడిబొడ్డున ఈ చెరువు తొలినాళ్లలో 560 ఎకరాల్లో ఉండేది. కాలక్రమంలో కబ్జాకు గురవుతూ వచ్చి.. ఇప్పుడు 382 ఎకరాలకు పరిమితమైంది. ఈ చరిత్రాత్మక భద్రకాళి చెరువు గర్భంలో కాకతీయుల కాలం నాటి విలువైన సంపద, గుప్తనిధులు, విగ్రహాలు దాగిఉంటాయని ప్రజల నమ్మకం. ప్రస్తుతం ఈ చెరువు పూడికతీత, ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టిన క్రమంలో చారిత్రక ఆనవాళ్లు, విగ్రహాలు లభ్యమైతే పరిస్థితేంటనే చర్చ మొదలైంది. పూడికతీత పనుల సమయంలో పోలీసు రక్షణ, పురావస్తు శాఖ పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా లాంటి చర్యలు చేపట్టాలని.. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని నియమించాలన్న డిమాండ్ ప్రజలనుంచి వినిపిస్తోంది. 2018లో బండ్ పనులు జరిగిన సమయంలో గణపతి, శివలింగాలతోపాటు ఇతర విగ్రహాలు లభ్యమయ్యాయని అదే తరహాలో పూడికతీత పనుల్లో పురాతన వస్తువులు, సంపద దొరికితే వాటిని సంరక్షించేదెవరన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిఘా, పర్యవేక్షణ లేకపోతే అవి పక్కదారి పట్టే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చారిత్రక భద్రకాళి చెరువు సుందరీకరణ, పూడికతీత పనులపై నిఘా, పర్యవేక్షణకు సర్కారు ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో చూడాలి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

భూ నిర్వాసితులకు ప్లాట్లు కేటాయిస్తాం..

- టెక్స్‌టైల్ పార్కుకు రేపు మంత్రి శ్రీధర్‌బాబు రాక
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు డ్రాపద్ధతిలో ప్లాట్లను కేటాయిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన కలెక్టర్ సత్యశారదతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 7న సంగెం, గీసుగొండ మండలాల్లో మంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గొర్రెకుంటలో నిర్మించిన బ్రాహ్మణ భవనానికి మంత్రి ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. అనంతరం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించి పార్కు పరిసరాల్లో ఉన్న ఐటీ కంపెనీలలలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తారని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, గీసుగొండ, సంగెం తహసీల్దార్ రియాజుద్దీన్, జి.రాజ్‌కుమార్, ల్యాండ్ సర్వే అధికారి బోజరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వెట్టిచాకిరీ!

- సమస్యల మధ్య విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- పెరగని వేతనాలు, అమలు కాని పీఆర్‌సీ
- పోలీసులతో సమానంగా విధుల నిర్వహణ
- సంక్షేమ విషయంలో మాత్రం చిన్నచూపు
- అమలుకాని ఎక్స్ సర్వీస్‌మెన్ రిజర్వేషన్
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం



నేడు హోంగార్డుల దినోత్సవం

6

ఖాకీ వనంలో వాళ్లు ఓ వెట్టిచాకిరీ జీవులు. శాంతి భద్రతల విధుల్లో, ట్రాఫిక్ కట్టడిలో, ఉన్నతాధికారుల సహాయక విధుల్లో అలుపెరుగని సేవలు చేస్తుంటారు. కానీ వేతనం, ఇతర సదుపాయాల్లో మాత్రం హోంగార్డులు వివక్షను ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెరిగిన వేతనం తప్ప.. ఇప్పటివరకు పెంపు మాటే లేదు. గతంలో ఏర్పాటు చేసిన పీఆర్‌సీ ఊసేలేదు. రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా అమలుకావడం లేదు. అయితే హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ఐపీఎస్ ఆఫీసర్ రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ) ముసాయిదా నిర్ణయాలు ఇంకా అమలుకాలేదు. దీంతో పొట్టకూటి కోసం విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. చివరికి హోంగార్డు ఆవిర్భావ వేడుకలనూ జరుపుకోలేని దైన్య స్థితిలో ఉన్నామని, సర్కారు అధికారికంగా నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- హనుమకొండ టౌన్

మహిళల ఆర్థికాభివృద్ధికి సర్కారు కృషి

- ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంజీఎంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం


శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో నగర మేయర్ సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, తదితరులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యవసాయ, వ్యాపార, విద్య రుణాలు ఇచ్చి ఆర్థికంగా చేయూత అందిస్తోందని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా గురువారం ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను, ఎంజీఎంలో ఓపీ రోగుల కోసం ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ కౌంటర్, ఫార్మసీ కౌంటర్లను మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగుల అటెండెంట్‌లకు క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఉత్తర తెలంగాణకు గుండెకాయలా ఉన్న ఎంజీఎం ఆస్పత్రికి ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి వివిధ ఆరోగ్య సమస్యల చికిత్స కోసం ప్రజలు వస్తుంటారని అన్నారు. ఇటీవల రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎంజీఎంను సందర్శించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింత బలోపేతానికి సూచనలు చేశారని తెలిపారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను దశల వారిగా మరింత అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. ముఖ్యంగా డయాలసిస్, హృద్రోగ, పీడియాట్రిక్ విభాగాలను ప్రభుత్వ, సీఎస్ఆర్ తదితర నిధుల ద్వారా బలోపేతం చేసి ఎలాంటి పేషెంట్లకు అయినా అసౌకర్యం కలగకుండా అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, వస్కుల బాబు, ఓని స్వర్ణలత భాస్కర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, ఎంజీఎం పర్యవేక్షకుడు శశికుమార్, ఆర్ఎంఓలు మురళీ, శ్రీనివాస్, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

- ఎంసీపీఐ(యూ) నేతల డిమాండ్
- హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్‌ల వద్ద ధర్నా

4

రెండురోజుల వ్యవధిలో వృద్ధ దంపతుల ఆత్మహత్య

- తొలుత భార్య, ఆ తర్వాత భర్త బలవన్మరణం
- వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో విషాదం

4

పత్తి కొనుగోళ్లు ఆగొద్దు..

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ఏనుమాముల మార్కెట్‌లో అధికారులు, వ్యాపారులతో సమావేశం


ఏనుమాముల మార్కెట్ పత్తి యార్డులో పత్తిని పరిశీలిస్తున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మార్కెట్ కార్యదర్శి నిర్మల, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ఆపొద్దని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అధికారులు, వ్యాపారులను ఆదేశించారు. గురువారం ఆయన కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, సునిల్, భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డితో కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి వ్యాపారులు చెల్లిస్తున్న ధర గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత మిర్చి యార్డును సందర్శించారు. అనంతరం మార్కెట్ ప్రధాన కార్యాలయంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అధ్యక్షతన సీసీఐ అధికారులు, మార్కెట్ అధికారులు, చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చిన పత్తిని తప్పకుండా కొనుగోలు చేయాలని, బస్తాలలో వచ్చిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను కోరారు. దీనికి వారు సమాధానమిస్తూ.. నిబంధనల మేరకే పత్తి కొంటున్నామని, బస్తాలలో వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలంటే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలని చెప్పారు. దీనికి కోదండరెడ్డి స్పందిస్తూ.. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం నుంచి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా చూస్తామన్నారు. అదేవిధంగా పత్తికి మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవేను కోరారు. మార్కెట్లో మౌలిక సదుపాయాలు సరిగ్గాలేవని, సీసీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీరరావు, చాంబర్ సహాయ కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరెడ్డిని కలిసిన రైతు సంఘం నాయకులు

మార్కెట్‌కు వచ్చిన రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిని రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. మార్కెట్లోని సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా బస్తాలలో వచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయడం లేదని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

పశ్చిమ అభివృద్ధిని గడప గడపకూ చాటండి..

- పని చేసిన వారికి గుర్తింపు.. కార్యకర్తల శ్రేయస్సే లక్ష్యం
- పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యేడాదికాలంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గడపగడపకూ చాటాలని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శ్రేణులకు సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రీతిలో పశ్చిమ నియోజక వర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే క్షేత్రస్థాయిలో అభివృద్ధిని చూపించామన్నారు. అభివృద్ధి వివరాలను పార్టీ శ్రేణులకు తెలియచేసేందుకు ఈనెల 7న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం వద్ద సభను నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. కష్టించి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు తప్పక లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, మామిండ్ల రాజు, పోతుల శ్రీమాన్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

కేంద్ర బృందంతో కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అధికారులు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోస్టు డిజాస్టర్ నీడ్స్ అసెస్మెంట్ (విపత్తు అనంతరం అవసరాల అంచనా) చేసేందుకు 30 మంది సభ్యులతో కూడిన సీబీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్, కేంద్ర బృందం వరంగల్ జిల్లాను సందర్శించింది. గురువారం వారు జీడబ్ల్యూఎంసీ వరంగల్, రాయపర్తి, పర్వతగిరి, నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట, సంగెం, గీసుగొండ, వర్ధన్నపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో పర్యటించి విపత్తు జరిగిన తీరు, అందుకుగల కారణాలను, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు. జిల్లా పర్యటన అనంతరం వరంగల్ కలెక్టరేట్‌లో కేంద్రం, జిల్లా అధికారులతో కలెక్టర్ సత్యశారద సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం బృందం పలు సూచనలు చేసింది. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

» ఎంసీపీఐ(యూ) నేతల డిమాండ్
» హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల వద్ద నిరసనలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ.. రైతులందరికీ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి కొంతమందికే మాఫీ చేశారని అన్నారు. దీంతో రూ.2లక్షలు రుణమాఫీ అయిన రైతులు సంబురపడుతుంటే.. రుణమాఫీ కాని రైతులు బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతూ హామీల అమలు దాటవేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నీల రవీందర్, మాస్ సావిత్రి, కర్రా రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఒక్కల కిషన్, దామరకొండ రమేష్, మంద భద్రయ్య, చీపురు ఓదయ్య, జూలూరు ఇందు, అనిత, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యూ)నాయకులు


వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

● వరంగల్ కలెక్టరేట్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరకొర అమలు చేసి ఇదే గొప్ప ప్రజాపాలన అంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా హామీలు అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, లేదంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌వో విజయలక్ష్మికి అందజేశారు. ధర్నాలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, ఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి వంగాల రాగసుధ, నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, జగదీశ్వర్, నగేష్, ప్రభాకర్, నర్సయ్య, రవి, బాబు, శ్రీనివాస్, రవి, గోవర్ధన్, రాజు, జగపతి, స్వరూప, బిందు, ప్రమీల, నిర్మల, షబానా, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీందర్‌రావు

మంత్రి తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్

హనుమకొండ సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మహబూబ్ నగర్‌లో రైతు పండుగ విజయోత్సవంగా నిర్వహించిన సందర్భాన్ని పురస్కరించుకొని మంత్రి తుమ్మలతో పాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి రవీందర్‌రావు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, డైరెక్టర్లు బోజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు చందన


చందనను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 5:(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-19 ఆధ్వర్యంలో ఈ నెల చివరివారంలో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఖేలో ఇండియా బాక్సింగ్ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న యాట చందన ఎంపికైంది. ఈ నెల 2, 3 తేదీల్లో హనుమకొండ డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-19 బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో చందన అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణపతకం సాధించడంతో జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ ప్రభుదాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన చందన, కోచ్ ప్రభుదాస్, డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్

కేయూ క్యాంపస్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కొత్త పరీక్షల నియంత్రణాధికారిగా ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.


రాజేందర్‌కు నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు

ఇప్పటి వరకు పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి స్థానంలో రాజేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన కట్ల రాజేందర్ గతంలో ఖమ్మంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వర్సిటీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్‌గా, కామర్స్ విభాగం బీవోఎస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. నూతన పరీక్షల నియంత్రణాధికారిగా నియమితులైన రాజేందర్‌ను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మ్యారేజ్ బ్యూరోలపైనే అనుమానం

● రిటైర్డు బ్యాంకు మేనేజర్ హత్యపై వేగంగా విచారణ
● పోలీసుల అదుపులో అనుమానితులు?

మట్టెవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రిటైర్డు మేనేజర్ రాజమోహన్ హత్యపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. రెండు రోజులుగా అనుమానితులను విచారిస్తున్నారు. దగ్గరి బంధువులు, మిత్రులు, పరిచయస్తులతో మాట్లాడారు. రాజమోహన్‌తో ఎవరెవరికి ఆర్థికపరమైన లావాదేవీలున్నాయని ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అనుమానితులను పిలిపించి విచారణ జరిపినట్లు తెలుస్తోంది. మరోవైపు మ్యారేజ్ బ్యూరోలపై దృష్టి సారించారు. పెళ్లిసంబంధాల పేరుతో రాజమోహన్‌కు పరిచయమైన వ్యక్తులపై కన్నేశారు. వారే డబ్బులు, బంగారం కోసమే ఈ హత్య చేశారనే కోణంలో విచారిస్తున్నారు. అదేవిధంగా రాజమోహన్ ఫోన్ కాల్‌డాటా ఆధారంగా ఆరా తీస్తున్నారు.

సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు

రాజమోహన్ సోమవారం రాత్రి హనుమకొండ శ్రీనగర్‌కాలనీ నుంచి రాత్రి 7.35 గంటలకు కారులో బయటకువచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటి నుంచి మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటల వరకు ఎక్కడ ఉన్నారనే విషయం తెలుసుకునేందుకు వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే 500లకు పైగా సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా, ఈ ఘటనలో పోలీసులకు ఆధారాలు దొరకకుండా నిందితులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. చేతులకు గ్లౌజులు, ముఖానికి కర్చీఫ్‌లు, మంకీ క్యాప్‌లు ధరించినట్లు తెలుస్తోంది. 1,2 రోజుల్లో హత్య కేసు మిస్టరీని ఛేదిస్తామని పోలీసులు అంటున్నారు. ఇప్పటికే ప్రత్యేక పోలీసు బృందాలు నగరవ్యాప్తంగా అనేక కోణాల్లో విచారణను వేగవంతం చేశారు. బుధవారం రాత్రి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

18 నుంచి కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ రెగ్యూలర్ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు 18 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్‌ఎల్ సౌజన్యలు గురువారం తెలిపారు. డిసెంబరు 18, 20, 23, 27, 30 జనవరి 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 25 మంది డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 5, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెగ్యులర్ 1, 5 సెమిస్టర్ పరీక్షలలో గురువారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లోని పలు పరీక్షల కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 25 మంది విద్యార్థులను తనిఖీల బృందాలు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి బుధవారం తెలిపారు. డీబారైన వారిలో ఆదిలాబాద్‌లో 22 మంది, ఖమ్మంలో 2, వరంగల్‌లో ఒక్కరూ ఉన్నట్లు తెలిపారు. వీరందరిపై వర్సిటీ మాల్ ప్రాక్టీస్ నిబంధనల మేరకు చర్యలుంటాయని వెల్లడించారు.

రేపు విరాళాల సేకరణ

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా 7వ తేదీ హనుమకొండలో విరాళాల సేకరణ చేయనున్నట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఎస్.సత్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశరక్షణలో అమరులైన కుటుంబాల సంక్షేమం కోసం పునరావాసం, పునర్‌నిర్మాణం చేపట్టేందుకు సహాయపడుతుందన్నారు. విరాళాల కోసం ఎన్‌సీసీ కేడెట్లు స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్, హుండీలతో వచ్చినప్పుడు విరాళాలు అందజేయాల పిలుపునిచ్చారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలు వైద్యులు కారు..

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్

వరంగల్ మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ, పీఎంపీలు వైద్యులు కారని, వారి వద్దకెళ్లి అవసరంలేని స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్ ఇంజక్షన్లు వేయించుకొని ఇబ్బందులకు గురికావొద్దని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ సూచించారు. గురువారం ఫోర్ట్‌వరంగల్‌లోని నకిలీ వైద్యుడు రామకృష్ణ నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను టీజీఎంసీ బృందం తనిఖీలు నిర్వహించింది. నకిలీ వైద్యుడు ఇచ్చిన మందులతో అనారోగ్యం పాలై ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా టీజీఎంసీ బృందం సభ్యులు డాక్టర్ నరేశ్‌కుమార్, డాక్టర్ శేషుమాధవ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ దిలీప్‌లతో కూడిన వైద్య బృందం నకిలీ వైద్యుడు ఇచ్చిన మందులను పరిశీలించారు. మందులు వికటించి చర్మం పొరలు పొరలుగా ఊడిందని, చికిత్స అందించిన డాక్టర్ల రిపోర్టు ఆధారంగా టీజీఎంసీ తనిఖీ బృందం సభ్యులు నిర్ధారించారు. నకిలీ వైద్యులపై ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న టీజీఎంసీ బృందం

సీడ్స్, ఫెస్టిసైడ్స్ షాపులో తనిఖీ

● రూ.4.95లక్షల కలుపు, పురుగుల మందులు సీజ్
● తనిఖీలో పాల్గొన్న విజిలెన్స్, వ్యవసాయశాఖాధికారులు


షాపులోని రిజిస్టర్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


నర్సంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణంలోని హరి ట్రేడర్స్ సీడ్స్, పెస్టిసైడ్స్ షాపును గురువారం విజిలెన్స్ అధికారులు, వ్యవసాయశాఖాధికారులతో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా కంపెనీ అనుమతులు లేకుండా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తున్న రూ.4లక్షల 95 వేల విలువైన కలుపు, పురుగు మందులను సీజ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని హరి ట్రేడర్స్ నిర్వాహకులు బేర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ వద్ద కాకుండా అనుమతిలేకుండా ఆన్‌లైన్‌లో లాడీస్ కలుపు, పురుగు మందును పెద్దసంఖ్యలో కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తున్నారన్న పిర్యాదు మేరకు విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, ఏవో శ్రీనివాస్, బేర్ కంపెనీ ప్రతినిధి అశోక్ రెడ్డి, నర్సంపేట ఏవో కృష్ణకుమార్ హరి ట్రేడర్స్ సీడ్, పెస్టిసైడ్ షాపునకు చేరుకొని స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్కులను పరిశీలించారు. అలాగే ఆ షాపునకు చెందిన గోదాములోని స్టాక్‌ను పరిశీలించారు. కంపెనీ డిస్ట్రిబ్యూటర్ వద్ద కాకుండా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన రూ.4లక్షల 95వేల విలువైన లాడీస్ కలుపు మందులు, మూమెంట్, లోబెరాన్, సోలో, మాస్, జెంప్, పూస్తు రకం పురుగు మందులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారని వ్యవసాయశాఖ ఏవో కృష్ణకుమార్ తెలిపారు. వీటి శాంపిళ్లను పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఈ తనిఖీల్లో నర్సంపేట ఏఈవో మెండు అశోక్, విజిలెన్స్ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.,

హిస్టరీ విభాగంలో మూడు రోజుల సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం నేతృత్వంలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ సోషల్ సైన్స్ విభాగాల డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. 7న కేయూ సెనెట్ హాల్‌లో జరిగే ప్రారంభ సదస్సులో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరిస్తారని, మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.స్వామినాథన్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, యన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్, విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సుస్మిత బసు మజుందార్, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అతిథులుగా హాజరై మాట్లాడుతారని ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు వెల్లడించారు. సదస్సును అందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రెండురోజుల వ్యవధిలో వృద్ధదంపతుల ఆత్మహత్య

➡ తొలుత భార్య, ఆ తర్వాత భర్త బలవన్మరణం
➡ వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో విషాదం


సంజీవరావు(ఫైల్)


భాగ్య (ఫైల్)

దుగ్గొండి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల వ్యవధిలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన దుగ్గొండి మండలం బంధంపల్లిలో జరిగింది. బంధంపల్లి గ్రామానికి చెందిన పల్లం సంజీవరావు(72) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసి 2010లో పదవీవిరమణ చేశారు. ఆ తర్వాత భార్య భాగ్య(60)తో కలిసి సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వతేదీన భాగ్య ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియక పోగా.. పోలీసు కేసుకూడా నమోదు కాలేదు. ఇదే క్రమంలో సంజీవరావు గురువారం ఉదయం గీసుగొండ మండలం ధర్మారం రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు గ్రామస్థులకు ఫోన్ చేసిన సంజీవరావు భార్య మృతిని తట్టుకోలేకపోతున్నానని, ఒంటరినయ్యానని, జీవితంపై విరక్తి కలిగిందని, అందుకే తాను చనిపోతున్నానని సమాచారమిచ్చాడు.

గ్రామస్థుల ద్వారా సంజీవరావు ఆత్మహత్య విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడి సోదరి పోశాల రజిని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. సంజీవరావు, భాగ్య దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. అయితే వృద్ధ దంపతుల ఆత్మహత్యకు కారణాలపై స్పష్టత రాలేదు.

రెండు రోజుల క్రితం భాగ్య ఆత్మహత్య చేసుకోగా అదే రోజు కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆమె అంత్యక్రియలు పూర్తి చేశారు. చివరకు సంజీవరావు ఆత్మహత్య ఘటనతో భాగ్య ఆత్మహత్య విషయం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.

అంతర్జాతీయ భూగోళ సదస్సుకు మల్లికార్జున్‌రెడ్డి

అభినందించిన కేయూ వీసీ, ప్రొఫెసర్లు



కేయూ క్యాంపస్, డిసెంబరు 5,(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 9 నుంచి 13 వరకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరిగే ఏజీయూ-24 భూగోళశాస్త్ర సదస్సుకు కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రాగి. మల్లికార్జున్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం సదస్సు నిర్వాహకులు మల్లికార్జున్‌రెడ్డికి సదస్సుకు రావాలని ఆహ్వానించారు. సదస్సులో 'టూఫిసీక్ కింబర్లైట్ ఫ్రమ్ రాయచూర్ కింబర్లైట్ ఫీల్డ్, ఈస్టర్న్ ధార్వార్ క్రేటాన్, పెనిన్సులర్ ఇండియా :మినరలాజికల్ ఎవిడెన్స్ రిలేటెడ్ టూ దేర్ పార్మేషన్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు.

అంతర్జాతీయ సదస్సుకు వెళుతున్న మల్లికార్జున్ రెడ్డిని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితోపాటు ఇతర బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఫటాఫట్

చేపల పెరుగుదల సంతృప్తికరంగానే ఉంది

నాగమణి, మత్స్యశాఖ అధికారి (ఇన్‌చార్జి) హనుమకొండ జిల్లా



ప్రశ్న: ఈసారి చేప పిల్లల పంపిణీ ఆలస్యంగా జరిగింది కదా... దీని ప్రభావం చేపల పెరుగుదలపై ఏమైనా పడిందా ?

జ: ఈ సారి చేప పిల్లల టెండర్ ప్రక్రియలో జాప్యం జరిగింది నిజమే. చేప పిల్లల పంపిణీలో పెద్దగా జాప్యం జరగలేదు. సెప్టెంబర్ 3న పంపిణీని ప్రారంభించి నెలాఖరులోగా పూర్తి చేశాము.

ప్రశ్న: ఆలస్యంగా చెరువుల్లో చేప పిల్లలను వదలడం వల్ల దాని ప్రభావం వాటి పెరుగుదలపైన ఉంటుందా ?

జ: పెద్దగా ఏమీ ఉండదు. చెరువులో దొరికే సహజసిద్ధమైన ఆహారాన్ని తీసుకొని అవి పెరుగుతాయి. పైగా చాలా మత్స్య సహకార సంఘాలు ప్రభుత్వం పంపిణీ చేసే చేప పిల్లల కోసం వేచి చూడకుండా వారు ప్రైవేటుగా అంతకు ముందే కొనుగోలు చేయడం జరిగింది.

ప్రశ్న: ఎన్ని చెరువుల్లో చేప పిల్లలను విడిచారు.

జ: జిల్లాలో 789 చెరువులు, రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. వాటన్నిటిలో చేప పిల్లలను వదిలాం.

ప్రశ్న: గతంలో కన్నా ఈ సారి 50 శాతం చేప పిల్లల పంపిణీ మాత్రమే జరిగింది. దాని వల్ల చేపల ఉత్పత్తి తగ్గదా ?

జ: బడ్జెట్‌లో కోత వల్ల ఈ సారి 50 శాతం మేరకే చేప పిల్లల పంపిణీ చేయాల్సి వచ్చింది. గత సంవత్సరం జిల్లాలో 2 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశాం. ఈ సారి అందులో సగంమాత్రమే పంపిణీ చేసాం. కొంత మేరకు ఉత్పత్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి.

ప్రశ్న: భద్రకాళి చెరువును ఖాళీ చేశారు కదా ? అందులో చేపల ఉత్పత్తి సంగతేమిటీ ?

జ: భద్రకాళి చెరువులో నీటిని ఖాళీ చేయడానికి ముందే 20 టన్నుల చేపలను పట్టుకున్నారు. చెరువులో తిరిగి నీటిని నింపడానికి ఎక్కువ టైమ్ తీసుకోకపోవచ్చు. ఆరు నెలల్లో అందులో చేపల ఉత్పత్తి మొదలు కావచ్చు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మడికొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

మడికొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలులో పూర్తిగా విఫలమైందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ దుయ్యబట్టారు. గురువారం మడికొండలో జరిగిన సభలో అరూరి రమేష్ మాట్లాడుతూ.. యాక్సిడెంటల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీలేదన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధిచెపుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు బన్న ప్రభాకర్, జలగం రంజిత్, గంట రవికుమార్, 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్, పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, పట్టపురం ఏకాంతంగౌడ్, శ్రీనివాస్, వినోద్ కుమార్, శివ, వెంకటేష్, సురేష్, మౌళి, వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం

రూ.50వేలు అందించిన ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



సుభాష్ కుటుంబానికి సహాయం అందిస్తున్న నాయకులు

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ నాయకపు సుభాష్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం భీమారంలోని సుభాష్ కుటుంబాన్ని ఆయన తరుపున కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి కావాల్సిన పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు కృషిచేస్తానని వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని కలిసిన వారిలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రాజు, నాతి రవీందర్‌గౌడ్, మార్క విజయ్‌కుమార్, కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సింహాచలం నాయుడు

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలుపు మొక్కల తొలగింపులో వయోబెల్ మందు కీలకమని ఎఫ్ఎంసీ కంపెనీ ఏజీఎం సింహాచలం నాయుడు రైతులకు సూచించారు. మండలంలోని గుంటూర్‌పల్లిలో గురువారం ఎఫ్ఎంసీ వారు నూతన కలుపు మందు వయోబెల్‌ను గ్రామ రైతులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. మార్కెట్‌లో ఉన్న ఎన్నో రకాల కలుపు మందులతో పోలిస్తే వయోబెల్ మందు నెంబర్‌వన్‌గా పని చేస్తుందన్నారు. ఈ కలుపు మందుతో వెడల్పు ఆకు, గడ్డి, తుంగజాతి కలుపులన్నింటిని సమర్థవంతంగా కంట్రోల్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏఎంఎం మణిచందర్, టీఎం శివ, సీఎస్ఐఓ కందుకూరి సాయికుమార్, ఏఈవో రోజా, ఎఫ్ఎంసీ ఉద్యోగులు నరేష్, జయకృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రారంభమైన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐ ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ లెవల్ టెక్నో కల్చరల్ ఈవెంట్ అభిజ్ఞాన్ 3.0 వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా ముఖ్య అతిథిగా వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ హాజరై మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థినులు ప్రస్తుత కాలపు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థినుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి ఈ మూడు రోజుల వేడుకలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నేటి కాలంలో జరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐట్రిపుల్‌ఈ అడ్వైజర్ మూల రాము, వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ వి.మహేందర్, డాక్టర్ బి.శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి

వరంగల్ మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ మేకేల్ సుకుమార్ తెలిపారు. గురువారం జాతీయ కుష్టువ్యాధి (లెప్రసీ) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎల్‌సీడీసీ ప్రోగ్రామ్‌ను శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీని డాక్టర్ మేకేల్ సుకుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్ రావులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఇంటింటి సర్వేను ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు నిర్వహించాలన్నారు. ప్రపంచంలోనే భారతదేశంలో ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయని, వీటిలో 6శాతం పిల్లల్లో నమోదవుతున్నట్లు తెలిపారు. తొలి దశలోనే లెప్రసీని గుర్తించినట్లయితే ఎండీటీ చికిత్సతో 6 నుంచి 12 నెలల్లో నయం చేయవచ్చని తెలిపారు. అలక్ష్యం చేసినట్లయితే అంగవైకల్యానికి దారి తీస్తుందన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎల్లాపూర్ ఎంజేపీ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన

హసన్‌పర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లాపూర్ శివారు మహాత్మాజ్యోతిరావుఫూలే తిమ్మాపూర్ గురుకులం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గురుకుల విద్యాలయంలోకి వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు గురుకులం ఎదుట ఆందోళనకు దిగడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణిరాజు నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బండి రజనీకుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు మాచర్ల శరత్‌చంద్ర, నాయకులు గండ్రకోట రాకేష్, గొల్లపెల్లి వీరస్వామి, శ్రీకాంతచారి, మాజీ సర్పంచ్ దేవరబోయిన కుమారస్వామి, దోమ శ్రీనివాస్, చిర్ర ప్రకాష్‌గౌడ్ తదితరులున్నారు.

నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖిలావరంగల్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరాన్ని అన్నిరంగాలలో తీర్చిదిద్దుతానని అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం ఆమె 18వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లో ఓపెన్ పార్కు, సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రూ.30 లక్షల జనరల్‌ఫండ్‌తో ఈ పనులు చేపట్టామన్నారు. నగరంలోని కూడళ్లు, పబ్లిక్ పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జక్కం ప్రవీణ్, గడ్డమీది రాజేష్, మడిపెల్లి జామవా, గబ్బెట సుధాకర్, డేవిడ్‌రాజ్, ఏకాంబ్రం, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

జంక్షన్ సుందరీకరణ పనులు ప్రారంభం..

గిర్మాజీపేట: స్మార్ట్ సిటీ పథకం కింద రూ.46.84 లక్షలతో వరంగల్ వెంకట్రామ జంక్షన్‌లో నిర్మించిన సుందరీకరణ పనులను గురువారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో వరంగల్ తూర్పును అగ్రభాగంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయరు గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కుడా వైస్ చైర్మన్, వరంగల్ మహానగర పాలకసంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, టీపీసీసీ నేత మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహానికి మంత్రి కొండా సురేఖ పూలమాల వేసి నివాళులర్పించారు.



కాశిబుగ్గలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

కాశిబుగ్గ: దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గురువారం కాశిబుగ్గలో రూ.30లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం వీధిలో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, కాంగ్రెస్ నేతలు గోపాల నవీన్ రాజ్, సాంబరాజు, దాసరి రాజేష్, రవీందర్, రాజు, ఏకాంబ్రం, సమ్మక్క పాల్గొన్నారు.

వినతి పత్రం..

కాశిబుగ్గ శ్రీ కాశీవిశ్వేశ్వర దేవాలయ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని, శ్రీరంగనాథస్వామి ఆలయ స్థలంలో దుకాణ సముదాయం నిర్మించాలని కోరుతూ ఆలయాల పరిరక్షణ, అభివృద్ధి సొసైటీ సభ్యులు మంత్రికి వినతి పత్రం అందించారు. వారిలో సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు అకెన వెంకటేశ్వర్లు, అశోక్, ఎల్లయ్య, సాంబయ్యతో పాటు కృష్ణయ్య, కమలాకర్, గోపి, సుధాకర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

రూ.100కోట్లతో హనుమకొండ బస్‌స్టేషన్ నిర్మాణం

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బస్‌స్టేషన్‌ను రూ.100 కోట్లతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హనుమకొండ బస్‌స్టేషన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాజీపేటలో రైల్వేస్టేషన్ సమీపంలో బస్‌స్టేషన్ నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను మాట్లాడుతూ.. 30 కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు, 4 లహరి ఏసీ బస్సులు, 4 నాన్‌ఏసీ లహరి బస్సులు, 18 డీలక్స్ బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఆర్టీసీ అధికారులు కిరణ్‌భాను, జి.మాధవరావు, ఎ.రవిందర్, ఏవో అర్పిత పాల్గొన్నారు.

హయగ్రీవాచారి వర్ధంతి..

హనుమకొండ చౌరస్తా: కాంగ్రెస్ దిగ్గజం, మాజీ మంత్రి హయగ్రీవాచారి వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. గురువారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని హయగ్రీవాచారి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి హయగ్రీవాచారి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. దేశం కోసం, తెలంగాణ రాష్ట్ర కోసం నిజాంలకు వ్యతిరేకంగా తన ప్రాణాలకు లెక్క చేయకుండా పోరాటం చేశారని గుర్తు చేశారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలకు నీటికొరత నుంచి విముక్తి కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు సరళ, నాయకులు లక్ష్మారెడ్డి, హనుమకొండ రాజేందర్, వీసం సురుందర్‌రెడ్డి, పున్నం, శ్రీనాథ్, సునీల్, యదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కాజీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాజీపేటను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంకుగానే చూసిందని, ఏనాడూ అభివృద్ధిపై దృష్టి సారించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట 62వ డివిజన్ రహ్మత్‌నగర్‌లో గురవారం రూ.42లక్షలతో డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో అన్ని డివిజన్‌లలో నీరు నిలవకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కాజీపేటలో ఆర్వోబీ, బస్టాండ్ నిర్మించి తీరుతామన్నారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార స్వామి, సుంచు అశోక్, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.అంకూస్, ఎం.డి.రఫీ, కుమ్మరి నీలక్క, ఎంపీ సమతారాజు, రజియా, సులోచన, పాక ఓం ప్రకాశ్, సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, పోగుల శ్రీను పాల్గొన్నారు.



హనుమకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మానవాళి మనుగడకు భూమే ఆధారం

- వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహాయ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రపంచంలో మనిషితో పాటు సకల జీవరాసులు నేలపై ఆధారపడినవేనని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహాయ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నాబార్డు రైతులకు, విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమారెడ్డి మాట్లాడుతూ.. నేల ఒక జీవ వ్యవస్థ అని, మనుషులు, చెట్లు, జంతువులకు నిలయమని అన్నారు. నేలపై సేంద్రియ పదార్థం తగ్గిపోతోందని, పోషకాల సమతుల్యత లోపిస్తోందని అన్నారు. నాబార్డు సీజీఎం ఎల్.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి పచ్చిరొట్ట సాగుచేయాలని, ఇందుకు నాబార్డు ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. వ్యవసాయ కళాశాల డీన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నేల స్వభావం ఎరిగి పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త దిలీప్, శిక్షణ నిర్వాహకులు సీహెచ్. రాములు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

● మడికొండ: కాజీపేట మండలం కడిపికొండలోని రైతు వేదిక భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మృతిక(ధరిత్రి) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, విద్యార్థులకు నేల సంరక్షణ, మట్టి పరీక్ష ప్రాముఖ్యత, మట్టి పరీక్ష చేసే విధానంపై అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే వరికోతల అనంతరం వరిగడ్డిని కాల్చకుండా పొలంలోనే కలియదున్నుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి సంతోష్, రైతులు, కేంద్రీయ విద్యాలయ, వరంగల్ విద్యార్థులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: భూ సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని మహారాష్ట్ర వసంతరావునాయక్ మరత్వాడా అగ్రికల్చర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో డీన్ భూపాల్‌రాజ్ నేతృత్వంలో మృత్తికా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ నేలల దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నేలలోని సుస్థిర ఆరోగ్యానికి సూక్ష్మజీవుల ప్రాధాన్యతను వివరిస్తూ అవి నేలలోని పోషకాలను మొక్కలకు ఎలా అందుబాటులో ఉంచుతాయో, నేలల సామర్థ్యాన్ని ఎలా మెరుగు పరుస్తాయో తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ మాట్లాడుతూ రాబోయే కాలంలో ఆహార భద్రతకు, వాతావరణ సమతుల్యానికి నేలల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

హోమ్‌గార్డుల సమస్యలను పరిష్కరించాలి

మిల్స్‌కాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోమ్‌గార్డుల సమస్యలను వెంటనే పరిష్కంచాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకట రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయించుకొని వారి సమస్యలు గాలికొదిలేసి వారి కనీస అవసరాలను కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తూ హోంగార్డులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అందించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు, కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు.

కొనసాగుతున్న రైల్వే గుర్తింపు ఎన్నికలు

కాజీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో బుధవారం ప్రారంభమైన రైల్వే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు గురువారం రెండో రోజు కొనసాగాయి. రెండో రోజు సైతం రైల్వే కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. శుక్రవారం మూడోరోజు కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. శుక్రవారం కేవలం రైల్వే గార్డులు, లోకో పైలెట్‌లకు మాత్రమే ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సికింద్రాబాద్ తరలించేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 12న సికింద్రాబాద్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందని రైల్వే కార్మిక నాయకులు తెలిపారు.

4వ రోజుకు దీక్షలు

బాలసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి సాధనే లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ చేస్తున్న దీక్షలు 4వ రోజుకు చేరాయి. గురువారం దీక్షలకు బీజేపీ నాయకులు తండా అశోక్, అనిల్‌కుమార్, పోశాల శ్రీనివాస్ సంఘీబావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు నలింపాష, బరిగల బాబు, యేసేబు, రూప, ఎల్లస్వామి, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో యువత పాత్ర కీలకం

హనుమకొండ టౌన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించడంలో యువత పాత్ర కీలకమని ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ సంతోష్ మిశ్రా అన్నారు. చైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం కమిషనరేట్ రోడ్డు సేఫ్టీ బ్యూరో (సీఆర్ఎస్‌బీ) ఇన్స్‌పెక్టర్ బొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒరిస్సా నుంచి హాజరైన ఇంటర్నేషనల్ సైక్లిస్ట్ సంతోష్‌మిశ్రా మాట్లాడుతూ.. దేశాన్ని రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడటంలో యువత బాధ్యత తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. మైనరు డ్రైవింగ్ చేయొద్దని, హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలని సూచించారు. రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరగడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సైక్లిస్ట్ సత్యానంద్, ఆర్ఎస్సై నవీన్ కుమార్, ఏఎస్సై వేణుగోపాల్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీమత్ భగవద్గీత కంఠస్థ పోటీలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం వరంగల్‌లోని పిన్నవారి వీధి శారద ఉన్నత పాఠశాలలో కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఆత్మసంయమ యోగం 6వ అధ్యాయంపై పోటీలు ఉంటాయని, మొదటి గ్రూప్ వారికి 6,7,8,9 అధ్యాయాలు, రెండో గ్రూప్ వారికి 6వ అధ్యాయం జ్ఞానయోగంపై పోటీలు ఉంటాయని, 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు వచ్చిన 6 నుంచి 18 సంవత్సరాలు పైబడిన వారిని మూడో గ్రూప్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తారని, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచార పరిషత్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి పాల్గొంటారని రాంరెడ్డి తెలిపారు.

రాజరాజేశ్వరి ఆలయంలో రేపు అభిషేకం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 7న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్టిన రోజు సందర్భంగా 60 లీటర్ల ఆవుపాలతో, వెయ్యి అరటి పండ్లతో అభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీఅయ్యప్పస్వామి పూజ అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేసినట్లు అర్చకులు లక్ష్మణ్ శర్మ తెలిపారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



అంధ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న గాజర్ల అశోక్

ఆటోనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాలలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆత్మ బంధు ఫౌండేషన్ చైర్మన్ గాజర్ల అశోక్ హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనల్లో, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అంధులు రాణిస్తున్నారని అన్నారు. అనంతరం అంధ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బాలగోని రమేష్, మంతెన సమ్మయ్య, వెలగందుల రవీందర్, బొల్లేపల్లి విశ్వనాథ్, మండల విజేందర్, గాజర్ల ప్రవీణ్, గాజర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతల అరెస్టులను నిరసిస్తూ గురువారం కేయూ మొదటి గేటు వద్ద బీఆర్ఎస్వీ నేతృత్వంలో విద్యార్థి నేతలు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర సీనియర్ నేత పాలమాకుల కొమురయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తన అధికార బలంలో పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో పాటు మాజీ ప్రజాప్రజాప్రతినిధులను, నాయకులను అరెస్టు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీకార చర్యలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్వీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి రంజిత్ కుమార్, రాష్ట్ర నాయకులు కలకోట సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధీ

హనుమకొండ, డిసెంబర్5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, సైన్సెస్- న్యూమరికల్ ఆప్టిమైజేషన్ 2వ అంతర్జాతీయ సదస్సు గురువారం వరంగల్ నిట్‌లో ప్రారంభమైంది. ఈనెల డిసెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు సదస్సు జరుగుతుంది. గణిత శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్సెస్, ఇంజనీరింగ్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ మాట్లాడుతూ.. కుటుంబ జీవితమైనా, ఇంజనీరింగ్ సమస్యలైనా ఆప్టిమైజేషన్ అనేది మన జీవితంలో భాగమని అన్నారు. ఖతర్‌కు చెందిన ప్రొఫెసర్ పీఎన్ సుగనాథన్ ఆన్‌లైన్‌లో కీలకోపన్యాసం చేశారు. కాన్ఫరెన్స్ కోర్డినేటర్ ప్రొఫెసర్ దేబాషిస్ దత్తా మాట్లాడుతూ.. పరిశోధనాపత్రాలను సమర్పించేందుకు పది ట్రాక్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సుకు సంయుక్త కార్యదర్శులుగా ప్రొఫెసర్ జగన్నాథ్‌రాయ్, ప్రొఫెసర్ సుజిత్‌దాస్ వ్యవహరించారు. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు ఈ సమావేశాన్ని స్పాన్సర్ చేసింది.

'బీసీలు సగం.. బీసీలకు సగం'



బీసీ సమావేశంలో ప్రసంగిస్తున్న ధనుంజయ నాయుడు

ఖిలావరంగల్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): జనాభాలో బీసీలు సగం ఉన్నారని, అన్నింటిలోనూ వారికి సగం వాటా ఇవ్వాలని, ఇదే బీసీ హక్కుల సాధన సమితి నినాదం అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. బడ్జెట్‌లో సైతం బీసీల సంక్షేమానికి సగభాగం నిధులు కేటాయించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంతభవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, ఎంబీసీలను గుర్తించి ప్రత్యేక రిజర్వేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పనాస ప్రసాద్ మాట్లాడుతూ బీసీల మధ్య ఐక్యత ఏర్పడితే రాజ్యాధికారం సిద్ధిస్తుందని అన్నారు. స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు గడిచినా బీసీలు పాలితులుగానే మిగిలిపోయారని, ఫూలే ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా బాధ్యులు పంజాల రమేష్, చిట్యాల సువర్ణ, చింతకింది కుమారస్వామి, వలబోజు వెంకన్న, బుస్స రవీందర్, బొట్ల శ్రీనివాస్, మేడిగ అశోక్, ఇల్లందుల సాంబయ్య, ఆరే రాజు, మెరుగు మల్లయ్య, కత్తోజు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ నూతన అధ్యక్షుడికి ఘనస్వాగతం

కాజీపేట, డిసంబరు 5(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై, హైదరాబాద్ నుంచి వచ్చిన కె.ఆర్. దిలీప్‌కు గురువారం కాజీపేటలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి కాజీపేట చౌరస్తాలో దిలీప్‌కు ఘనస్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. మడికొండ నుంచి ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ హనుమకొండకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా ఎంజీఎం సెంటర్‌కు వెళ్లి అక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్కె కృష్ణ శ్రీలేఖ, నాయకులు కర్ర హరీష్ రెడ్డి, ముప్పిడి జనార్ధన్ శ్రావన్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రేవంత్, అరుణ్, ప్రణయ్, రాజేశ్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



దిలీప్‌ను సన్మానిస్తున్న రమాకాంత్ రెడ్డి

జూడో పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మడికొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కెమిస్ట్రీ భవన్‌లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జిల్లా స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మడికొండ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు కోచ్ నాగరాజ్, పీడీ పద్మ, పీఈటీ సరితను గురువారం అభినందించారు. విజేతలు ఈనెల 10 నుంచి 16 వరకు గుజరాత్‌లోని లూధియానలో జరిగే 68వ జాతీయస్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు.

'భద్రకాళి' గర్భంలో ఏముందో?

చారిత్రక చెరువు పూడికతీత వేళ ప్రజల్లో ఆసక్తికర చర్చ


పూడికతో కనిపిస్తున్న భద్రకాళి చెరువు

- ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- 900 ఏళ్ల నాటి సరస్సులో వారసత్వ సంపద దాగి ఉందనే భావన
- గుప్త నిధులు, విగ్రహాలు లభిస్తే పక్కదారి పట్టే అవకాశం
- చారిత్రక సంపదను కాపాడాలంటున్న ఓరుగల్లు వాసులు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వందల ఏళ్ల చరిత్రకు చిరునామాగా ఓరుగల్లు నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువు ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్ష్యం. తన గర్భంలో ఎన్నో రహస్యాలను అంతర్లీనంగా దాచుకున్న జలాశయం. ఒకప్పుడు 560 ఎకరాలు.. ఇప్పుడు 382 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో పేరుకుపోయిన మట్టిని వందల ఏళ్ల తరువాత వెలికితీసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుందరీకరణ కోసం ఇప్పటికే నీటిని మొత్తం బయటకు పంపి.. చెరువును ఖాళీ చేసిన యంత్రాంగం.. పూడికతీత పనులను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళి చెరువు పూడికతీతతో భూగర్భంలో దాగిఉన్న రహస్యాలు బయటకొచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలంలో నిధిని దాచారని, అలాగే నవాబుల కాలం నాటి దాడుల సమయంలో విగ్రహాలను ఈ చెరువులో పడేశారనే చర్చ ప్రజల్లో ఉంది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో ఏ మూలన ఏ రహస్యం దాగి ఉందో.. తవ్వకాల్లో ఏ చోట ఏ చరిత్ర బయటకు వస్తుందో.. అనేది ఆసక్తికరంగా మారింది.

ఈ నేపథ్యంలో క్షణక్షణం.. పోలీసుల రక్షణ.. సీసీ కెమెరాల నిఘా.. పురావస్తుశాఖ అధికారుల పర్యవేక్షణ ఎంతో అవసరమని, అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఉందని, వారి పర్యవేక్షణలోనే పూడిక తీత పనులు జరగాలని ఓరుగల్లు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు అడుగున చరిత్ర?

భద్రకాళి చెరువు సుందరీకణలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువు కావటంతో ఎన్నో జ్ఞాపకాలకు, గుప్త నిధులకు, రహస్యాలు దాగిఉండి ఉంటాయన్న చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలాన్నే పరిశీలిస్తే వరంగల్ కోటను జయించేందుకు అనేక దాడులు జరిగాయి. క్రీ.శ. 1303, క్రీ.శ 1310లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ, మాలిక్ నేతృత్వంలో జరిగిన దాడులను ప్రతాపరుద్రుడు తిప్పి కొట్టారు. క్రీ.శ. 1321లో గియాజ్ ఉద్దిన్ తుగ్లక్ ఉలుగ్ ఖాన్ నేతృత్వంలోని సైన్యం వరంగల్ కోటపై దాడికి దిగింది. ఇలా నాలుగైదు యుద్ధాలు, దాడులు వరంగల్‌పై జరిగాయి. ఒకప్పుడు భద్రకాళి చెరువు ప్రాంతం మొత్తంగా అడవిగా ఉండేదని, ఈ ప్రాంతంలో నీటి సౌలభ్యం ఉండటంతో ఇక్కడే ఎక్కువ మంది సేద తీరేవారని చెబుతుంటారు. దాడుల సమయంలో గానీ, ఇతర సందర్భంలో భారీగా నిధులను, యుద్ధ సామగ్రిని చెరువుల్లోనే దాచి పెట్టేవారు. భద్రకాళి ఆలయం ఉండటంతో పాటు ఇతర చిన్న చిన్న ఆలయాలు కూడా ఉండేవని, పరాయి దేశస్థుల దాడుల్లో ఆ ఆలయాలను ధ్వంసం చేసి విగ్రహాలు, ఇతర సామగ్రిని భద్రకాళి చెరువులో పడేసి ఉండొచ్చుననే అనుమానాలున్నాయి. వీటికి తోడు భద్రకాళి చెరువు పక్కనే ఉన్న సిద్దుల గుట్ట, భైరవ గుట్టల్లో ప్రాచీన కాలం నుంచి మహర్షులు, మునులు, సాధువులు, యోగులు దీక్షలు, పూజలు చేసుకునేవారని, గుట్టల కింది భాగంలో కూడా విగ్రహారాధన జరిగేదని చెబుతుంటారు.

గుట్టల సమీపంలో ఎలాంటి ఆధారాలు పెద్దగా లేకపోవవటంతో అవి చెరువు గర్భంలో కలిసిపోయి ఉండాయని భావిస్తున్నారు. కాకతీయుల పాలన ముగిసిన తరువాత భద్రకాళి ఆలయం పూజలకు దూరమైందనే అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో అనేక దాడులు, విధ్వంసాలకు భద్రకాళి చెరువు సాక్షిగా నిలిచిందని, అప్పుడు అడవి ప్రాంతంలో ఉండటంతో ఎన్నో గుప్తనిధులు, విగ్రహాలు, యుద్ధ సామగ్రి, రాజులు ధరించిన వస్త్రాలు, కత్తులు ఇలా అనేకం చెరువు గర్భంలో కలిసిపోయి ఉంటాయనే చర్చ జరుగుతోంది.

భద్రకాళి చెరువులో పూడికతీతకు శ్రీకారం

వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. కాకతీయుల కాలంలో క్రీ.శ 1,199-1,323 వరకు కాకతీయుల పాలన సాగింది. క్రీ.శ 1,199-1,262 మధ్యకాలంలో గణపతి దేవుడు వరంగల్ కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆ కాలంలోనే భద్రకాళి ఆలయానికి సమీపంలో ఈ సరస్సును నిర్మించినట్టుగా భావిస్తారు. 900ఏళ్ల కిందటే ఈ చెరువు నిర్మాణ జరగడంతో పాటు నగరవాసులకు తాగునీటిని అందించేవారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళిచెరువులో భారీ మోతాదులో మట్టి పేరుకుపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భద్రకాళి చెరువులో పూడిక తీసినట్టుగా అనవాళ్లు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. భద్రకాళి బండ్‌ను ఇప్పటికే సుందరీకరణ చేయగా, చెరువులో పూడిక తీసి చెరువులో నీటి సామర్థ్యాన్ని పెంచాలని యంత్రాంగం ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. సుమారు 560 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ భారీగా కబ్జాలకు గురైంది. దీంతో ప్రస్తుతం 382 ఎకరాల్లోనే భద్రకాళి చెరువు విస్తరించి ఉంది. 150 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యం ఉన్నా 132మిలియన్ క్యూబిక్ ఫీట్లకు నీరు చేరితే అలుగు పడుతుంది.

నవంబరు 8న చెరువులో ఉన్న 130మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని బయటకు విడుదల చేసి చెరువును ఖాళీ చేశారు. పూడిక తీసే పనులను ప్రైవేట్ కాంట్రా క్టర్‌కు అప్పగించారు. పూడిక తీసి మరో 50మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేసేందుకు భద్రకాళి చెరువు సామర్థ్యాన్ని 200మిలియన్ క్యూబిక్ ఫీట్లకు పెంచాలని అధికారులు యోచిస్తున్నారు.

పర్యవేక్షణతోనే చరిత్రకు రక్షణ

ప్రభుత్వం భద్రకాళి చెరువును సుందరీకరించే పనులు చేపడుతోంది. ప్రస్తుతం చెరువులో ఉన్న 130 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని బయటకు వదిలి ఖాళీ చేశారు. చెరువు విస్తరించి ఉన్న సుమారు 382 ఎకరాల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. మట్టిని కూడా తరలించేందుకు నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ప్రణాళిక రూపొందించారు. భద్రకాళి చెరువులో పూడికతీతలో భాగంగా ఒక మీటర్ లోతు మట్టిని తీయనున్నారు. ఒక మీటర్ మట్టి పూడిక తీసే సమయంలో చరిత్రాత్మక చెరువు కావటంతో ఏ మూల నుంచి ఏ రహస్యం బయటపడుతుందో.. ఏ ప్రాంతంలో.. ఏం చరిత్ర వెలుగులోకి వస్తుందోననే ఉత్కంఠ ప్రజల్లో కనిపిస్తోంది. రాత్రికి రాత్రి ఏదైనా విగ్రహమో.. చారిత్ర ఆనవాళ్లకు సంబంధించిన వస్తువో బయట పడి తే దాని భద్రతకు బాధ్యులు ఎవరనే చర్చ జరుగుతోంది. 2018 మే 4వ తేదీ న భద్రకాళి బండ్ సుందరీకరణ పనుల సందర్భంగా 1,300ఏళ్ల నాటి గణపతి పోలిన విగ్రహంతో పాటు శివలింగం, మరికొన్ని శిల్పాలు లభ్యమయ్యాయి. ఇవీ కాకతీయుల కాలం నాటికంటే పూర్వం విగ్రహాలుగా గుర్తించారు. అదే తరహాలో భద్రకాళి చెరువు మొత్తం పూడిక తీస్తుండటంతో చరిత్ర ఆనవాళ్లు బయటపడే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. పూడికతీత ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఐఏఎస్ అధికారి నేతృత్వంలో పోలీసు అధికా రులు, పురావస్తుశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిపి ఓ ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు. 24 గంటలూ మట్టి తీసివేతపై నిఘా ఉంచాలని, అవస రమైతే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే పూడికతీత చేపట్టాలని కోరు తున్నారు. పూడికతీతలో ఏ రహస్యమో.. నిధి దొరుకుతుందా? లేదా అనేది పక్కన పెడితే.. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సుందరీకరణ పను లు పూర్తి చేసేందుకు కూడా ఈ కమిటీ ఉపయోగ పడుతుందని, ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రకాళి చెరువులో దీవి రహస్యమేంటో?

అద్భుత అందాలకు కేరాఫ్‌గా ఉన్న భద్రకాళి చెరువులోని ఓ ద్వీపంపై అందరి చూపు పడింది. చెరువు మధ్యలో సుమారు 2గుంటల విస్తీర్ణంలో ఈ ద్వీపం ఉంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ద్వీపమా.. లేక పూర్వకాలంలో రాజులు లేదా ఇతరులెవ్వరైనా దీనిని నిర్మించారా? అనేది ఆసక్తికరంగా మారింది. పూర్వకాలంలో ఏదైనా గుప్తనిధులో.. లేక రాజకోట రహస్యం దాచి ఉంచినప్పుడు ఇలాంటి గుర్తులు ఏర్పాటు చేస్తారని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఓరుగల్లువాసులను మంత్రముగ్ధులను చేసే ఈ దీవి వెనుక ఉన్న రహస్యం ఏంటనే చర్చ జరుగుతోంది. ఇది సహజ సిద్ధంగా ఏర్పడిందే అయినా కొన్నేళ్ల తరువాత పూడికతీతకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఈ దీవిపైనా ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది.

పొట్టకూటి కోసం వెట్టిచాకిరీ!



- సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం
- నేడు హోంగార్డుల దినోత్సవం

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడటంతోపాటు నేరస్థులను పట్టుకునే విషయంలో పోలీసులకు దీటుగా విధులు నిర్వర్తించే హోంగార్డుల సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఏ పనిని అప్పగించినా బాధ్యతతో నిర్వర్తించే హోంగార్డులను శాఖలోనే చిన్నచూపు చూస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులతో పాటు పోలీసు ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తున్నప్పటికీ స్పందనలేదు. జీవితమంతా వెట్టిచాకిరీ చేయించుకుని చివరికి రిటైర్‌మెంట్ సమయంలోనూ బెనిఫిట్స్ ఇవ్వకుండా వివక్ష కనబరుస్తున్నారు. విధి నిర్వహణలో మరణిస్తే ఎలాంటి బెనిఫిట్స్ అందించకుండా, కారుణ్య నియామకాలను మధ్యలోనే ఆపి, సెలవులు ఇవ్వకుండా మానసిక వ్యధకు గురిచేస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6వతేదీ శుక్రవారం 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారి దీన పరిస్థితిపై కథనం.

ఆవిర్భావ వేడుకలకు దూరం

హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గతంలో అట్టహాసంగా నిర్వహించేవారు. హోంగార్డులతో పరేడ్ నిర్వహించి, వారి కుటుంబసభ్యులను ఆహ్వానించి, విధి నిర్వహణలో ప్రతిభచూపిన సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేసి భోజనాలు ఏర్పాటు చేసి పెద్ద పండుగలా నిర్వహించేవారు. కరోనా తర్వాత నుంచి హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ మరిచిపోయారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే స్పోర్ట్స్ నిర్వహించి అట్టహాసంగా 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలకు దూరంగా ఉండటంపై హోంగార్డులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ విషయంపై వరంగల్ పోలీసు కమిషనరేట్ హోంగార్డ్స్ ఆర్ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఐదారేళ్లుగా వేడుకలు నిర్వహించడం లేదని చెప్పారు. వేడుకలు నిర్వహణపై ఎలాంటి సమాచారం లేదన్నారు.

అమలు కాని ముసాయిదా

బీఆర్ఎస్ హయాంలో హోంగార్డులకు రెండుసార్లు వేతనాలు పెంచి పీఆర్సీ ప్రకటించారు. నెలకు రూ.9000 ఉన్న వేతనాన్ని 12000కు పెంచారు. ఆ తర్వాత 2018లో రూ.18000కు పెంచారు. అనంతరం యేటా రూ.వెయ్యి పెంచాని జీవో 14, 15 తీసుకొచ్చారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించినట్టుగా పీఆర్సీ అమలు చేసి చివరిగా నెల వేతనం రూ.27,640కు పెంచారు. యూనిఫామ్ అలవెన్స్‌తో పాటు 100రోజులకు డైట్‌చార్జీ చెల్లించాలని జీవోలో పొందుపరిచారు. మిగతా విషయాలైన రిటైర్‌మెంట్, డెత్ బెనిఫిట్స్, కారుణ్యనియామకాలు, సెలవుల అంశాల్లో ఇదే పద్ధతిలో న్యాయం చేయాలని హోంగార్డులు పోరాటాలు చేయగా, ఐపీఎస్ రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ) అనే ఒక ముసాయిదా రూపకల్పన చేశారు. కానీ అది ఇప్పటికీ అమలు కాలేదు. అ ముసాయిదాను అమలు చేయాలని హోంగార్డులు కోరుతున్నారు. గతంలో ప్రతిపక్ష హో దాలో ఉన్న రేవంత్‌రెడ్డి హోంగార్డుల హక్కుల కోసం రోడ్డెక్కి పోరాటం చేశారని, ఇప్పుడు సీఎంగా హోంగార్డుల కష్టాలను గుర్తించి రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని హోంగార్డులు వేడుకుంటున్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఉమ్మడి వరంల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1300 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు కల్పిస్తున్న రిజర్వేషన్‌లు అమలు చేయాలని హోంగార్డులు అభ్యర్థిస్తున్నారు. ప్రతీ నోటిఫికే షన్‌లో హోంగార్డుల కోటాలోని పోస్టులు అలాగే మిగిలి పోతున్నాయని, ఎవరూ ఎంపిక కావడం లేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌మెన్స్ సర్వీసుకు ఉన్న ప్రత్యేక సడలింపులను హోంగార్డులకు కల్పించాలంటున్నారు.

అలాగే జీవో 14, 15లో పొందుపరిచినట్లు యూనిఫామ్ అలవెన్స్, డైట్ చార్జీలు ఇవ్వకుండా ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసి, హోం గార్డుల కుటుంబాలు ఛిన్నాభిన్నం కాకుండా ఆదుకోవాలని కోరుతున్నారు.


బయ్యారం, గార్ల మండలాల పరిధిలో ఉన్న సత్యనారాయణపురం గ్రామం

ఔరా !

రోడ్లకు.. అటు.. ఇటు!

ఏ గ్రామమైనా ఒక మండల పరిధిలో ఉండటం సహజం. కానీ, అందుకు భిన్నంగా ఉంది మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం, బోడగుట్ట తండా, ఉప్పలపాడు గ్రామాల పరిస్థితి. మండలకేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే సత్యనారాయణపురం గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం మధ్య నుంచి ప్రధాన రహదారి వెళ్లగా ఒక వైపు బయ్యారం మండల పరిధిలో.. మరో వైపు గార్ల మండల పరిధిలో ఉంది.. బయ్యారం పరిధిలో 30 కుటుంబాలు, గార్ల పరిధిలో 40 కుటుంబాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల విషయంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఇదే జిల్లాలోని మరో రెండు గ్రామాల ప్రజల పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. చూడటానికి ఒకే గ్రామంగా కనిపిస్తున్నా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు వేరు. ఒక బజారు మహబూబాబాద్ నియోజకవర్గం మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండా పంచాయతీ పరిధిలోది కాగా, మరో బజారు ఇల్లెందు నియోజకవర్గం బయ్యారం మండలం ఉప్పలపాడు పంచాయతీ పరిధికి చెందింది. ఇక్కడ సుమారు 500 ఇళ్లు ఉండగా, బోడగుట్ట తండా పరిధిలోకి 200 ఇళ్లు, ఉప్పలపాడు పంచాయతీ లక్ష్మీనరసింహాపురం పరిధిలో 300ఇళ్లున్నాయి. ఇక్కడ ఓ సిమెంటు రోడ్డు సరిహద్దుగా ఉంది. రెండు గ్రామాలను కలిసిన ఆ గ్రామంలో ఎమ్మెల్యేలు సహా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వేరు కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతరుల పర్యటనల సమయంలో అయోమయానికి గురవుతున్నట్లు చెబుతున్నారు.

- బయ్యారం (ఆంధ్రజ్యోతి)


సిమెంటు రోడ్డుకు అటు, ఇటు ఉన్న లక్ష్మీనరసింహాపురం, బోడగుట్ట తండా ఇళ్లు



కోడిగుడ్డు @ రూ.8

పెరిగిన ధర

ఒక్కఎగ్ ట్రే రూ.200

చలి కారణంగా తగ్గిన ఉత్పత్తి

కేసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండే పౌష్టికాహారం గుడ్డు. చలికాలం కారణంగా ఆ గుడ్డు ధర రోజురోజుకు పెరుగు తోంది. గత నెలలో ఇదే రోజున 30 గుడ్ల ట్రే ధర ధర రూ.170 ఉండగా ఇప్పుడా ధర రూ.200కి పెరిగింది. నెల రోజుల నుంచి హోల్‌సేల్‌లో ట్రే ధర రూ.160 నుంచి ప్రతీరోజు రూ.1 నుంచి రూ. 2 వరకు పెరుగుతోంది. దీంతో 15 రోజుల క్రితం వరకు రిటైల్‌లో ఒక్కో గుడ్డును రూ.6 విక్రయించగా.. ప్రస్తుతం రూ.7 నుంచి రూ. 8కు అమ్ముతున్నారు. అధిక ధరతో మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో గుడ్డు వడ్డించడం నిర్వాహకులకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని కొన్ని దుకాణాల వారు ఒక్కో గుడ్డును రూ.8 నుంచి రూ. 9కు కూడా అమ్ముతున్నారు. సాధారణంగా చలికాలంలో గుడ్లు 20 నుంచి 30 రోజుల వరకు ఎలాంటి ఫ్రీజర్లు అవసరం లేకుండా నిల్వ ఉంటాయి. ప్రస్తుత వాతావరణం కోడిగుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు అను వుగా ఉంటుంది. మరోవైపు కోళ్లఫాంలలో చలి పెరగడంతో గుడ్ల ఉత్పత్తి 60శాతానికి పడిపోయింది.

ఉదాహరణకు 10 వేల కోళ్లు ఉన్న ఫాంలో గత నెలలో నిత్యం 9 వేల గుడ్లు ఉత్పత్తి కాగా చలి పెరిగిన నాటి నుంచి 6వేల నుంచి 6,500 వరకే గుడ్ల ఉత్పత్తి వస్తోందని కేసముద్రంలో కోళ్ల ఫాం నిర్వాహకుడు బొబ్బాల యాకూబ్ రెడ్డి తెలిపారు. ఫలితంగా మొత్తం మూడోంతుల్లో ఒకవంతు ఉత్పత్తి పడిపోయింది.

ఈ కారణాలతో ఏటా చలికాలం గుడ్ల ధరలు స్వల్పంగా పెరగడం సహజం. మరోవైపు డిసెంబరులో క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకల్లో దేశ వ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల కేకులను తయారు చేస్తారు. ఈ కేకుల తయారీ కోసం కోడిగుడ్లను అధికంగా వినియోగిస్తుంటారు. దీంతో డిసెంబరు నెలలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉండటం, ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ధరలు పెరుగుతుంటాయని హోల్‌సేల్ విక్రయదారులు తెలిపారు.

సామాన్యులు కొనే పరిస్థితి లేదు

బాణాల రమ, గృహిణి, కేసముద్రం స్టేషన్



సామాన్యులకు అందుబాటులో ఉండే కోడి గుడ్డు ధర కూడా ఇంతలా పెరుగుతుందని ఊహించలేదు. ఇప్పుడు గుడ్లను కూడా సామాన్యులు కొనే పరిస్థితి లేదు. కొద్దిరోజుల క్రితం రూ.6కు ఒకటి ఉండగా ఇప్పుడు రూ.8 నుంచి రూ.8.50పైసలకు అమ్ముతున్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినట్టే పేద, మధ్యతరగతి వర్గాలకు అవసరమయ్యే కోడిగుడ్డు రేటు పెరగడంతో కుటుంబాలపై మరింత భారం పడుతోంది.

క్యాన్సర్‌ను జయించి..

సామాజిక సేవలో ముందుండి

- సేవా గురువుగా గుర్తింపు తెచ్చుకున్న పింగిలి
- ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపునకూ కృషి

ఆదర్శం


'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న పింగిలి శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల హృదయాంతరాల్లోకి వెళ్లగలిగే.. వారి ఆధ్యాత్మిక ప్రపంచాన్ని అర్థం చేసుకోలిగే.. కుటుంబాల స్థితిగతులను తెలుసుకుని ఆసరాగా నిలవగలిగే.. మనస్సున్న గురువులు కొందరే ఉంటారు. అలాంటి వారిలో పింగిలి శ్రీనివాస్ ఒకరు. విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందిస్తూ.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే ధ్యేయంగా మార్చుకున్నారు గూడూరు మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్. ప్రమాదకరమైన క్యాన్సర్ మహమ్మారిని ఆత్మస్థైర్యంతో జయించి.. ముగ్గురు మిత్రులతో కలిసి మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న ఆయన వ్యాపార దృక్పథానికి దూరంగా, నైతిక విలువలకు దగ్గరగా ప్రయాణిస్తూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. గూడూరుకు చెందిన సరోజన-సత్తయ్య దంపతులకు జన్మించిన శ్రీనివాస్‌ది అతి సామాన్య కుటుంబం కావడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారతీయ విలువల రక్షణ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా 1990లో మానుకోటకు చెందిన అకారపు కె.కేశవరాజు గూడూరులో వివేకానంద పాఠశాలను ప్రారంభించగా.. ఆయన ఆశయాల పట్ల పింగిలి శ్రీనివాస్ ప్రభావితమయ్యారు. ఈ క్రమంలో కేశవరాజు 1995లో ఆర్ఎస్ఎస్‌లో ఫుల్ టైమర్‌గా వెళ్లిపోయిన తర్వాత ఆ పాఠశాల బాధ్యతలను తీసుకున్న శ్రీనివాస్ 1997లో తన స్నేహితులు పింగిలి సంజీవరెడ్డి, కాల్సాని శ్రీనివాస్‌రెడ్డి, నలమాస వెంకన్నతో కలిసి అరవింద పాఠశాలగా మార్చారు. కానీ 2000 సంవత్సరంలో పింగిలి శ్రీనివాస్ సర్కోమా క్యాన్సర్ బారిన పడ్డారు. బతకడం కష్టమని వైద్యులు చెప్పినా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా అనేక ప్రాంతాలు, ఆసుపత్రులకు వెళ్లి కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్‌ను జయించారు. అదే సమయంలో ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకున్న ఆయన తన చిన్నపాటి ఇంట్లో అనేక రకాల ఔషధ పండ్లు, కూరగాయల మొక్కలను పెంచారు. అంతేకాదు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ 'సేవా గురు'గా పేరు తెచ్చుకున్నారు. ప్రతిభ ఉండి చదువుకోలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి చేరదీసి వారికి అండగా నిలిచి అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన వద్ద చదువుకున్న అనేక మంది నేడు దేశవిదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు పూర్వ విద్యార్థులు, స్థానికుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

అలాగే ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడానికి కూడా కృషి చేస్తున్న ఆయన గూడూరు మండల కేంద్రంలో కాకతీయుల నాటి సనాతన శివాలయాన్ని శిథిలావస్థ నుంచి అద్భుతంగా మలిచారు. నేడు ఆ ఆలయం భక్తుల రాకపోకలు, నిత్య పూజలతో వర్ధిల్లుతోంది. అంతేకాకుండా బతుకమ్మ, దసరా వేడుకలు, తదితర పండుగల సందర్భాల్లో ప్రజలను శ్రీనివాస్ ముందుండి నడిపిస్తున్నారు. ఇక ఆయన సతీమణి స్వరూప కూడా ఆయన అడుగు జాడల్లోనే నడుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తున్నారు.

సామాజిక విలువలతో కూడిన విద్యనందించాలి

పింగిలి శ్రీనివాస్, గూడూరు

శ్రమకు విలువ కట్టకలిగే విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. మార్కులతో కూడిన విద్యావిధానం కాకుండా విలువలతో కూడిన విద్యనందించాలి. ప్రాచీన వారసత్వ సంపదకు సంబంధించిన కథనాలు, జీవిత చరిత్రలు బోధించాలి. సామాజిక నైతిక సాంస్కృతిక విలువలను విద్యార్థులకు అందించాలి. ఆచరణాత్మకంగా అమలయ్యే విద్యా విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉంటుంది. విద్య నేర్పిస్తే కాదు.. చూపిస్తే వస్తుంది.. మార్కులు ప్రామాణికం కాదు.. వారికి ఆదర్శాలు నేర్పించాలి.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 6 డిసెంబరు 2024

చింతన


రేడియోనో, టీవీనో పెడితే... ప్రేమతో నిండిన సినిమా పాటలు 24 గంటలూ వినిపిస్తాయి. ప్రేమకు బలైపోయిన దేవదాసులు, లైలా మజ్నూ కథలు సరే సరి. ఇలా ప్రేమ మన జీవితాన్ని ఆక్రమించుకుంటూ ఉంటుంది. చాలామందిలో 'నేను ప్రేమించగలనా?' అనే సందేహాన్ని సమాజంలోని ఈ వాతావరణం పుట్టిస్తూ ఉంటుంది. జిడ్డు కృష్ణమూర్తి సిద్ధాంతంలో కూడా ప్రేమ ఒక ముఖ్యమైన అంశం. అయితే దాని కోణం వేరు.

ఈ ప్రేమ నిజం కాదు!

వాస్తవిక జీవితంలో ప్రేమ పేరుతో ముడిపడిన బాంధవ్యాలు అనతికాలంలోనే నిరాశ, ద్వేషం, అసూయ, క్రౌర్యం కింద మారుతాయి. దంపతులకు వైవాహిక జీవితంలో ఆశించిన వాంఛలు తీరనప్పుడు, విధేయతలో లోపాలు కనిపించినప్పుడు... తొలి దశలో ఉన్న ప్రేమ మాయమై, ద్వేషం మిగిలిపోతుంది. 'ప్రేమకు ద్వేషంతో ఏదైనా సంబంధం ఉందా? కొండంత ధైర్యాన్ని, శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించ వలసిన ప్రేమ అధైర్యానికి, అనుమానాలకు ఎలా దారి తీస్తుందో చెప్పమంటా'రు కృష్ణమూర్తి. ఆయన సిద్ధాంతం ప్రకారం 'వినడం', 'చూడడం' అనేవి మానవ బాంధవ్యాలలో చాలా ముఖ్యమైన ప్రక్రియలు. ఆయన దృష్టిలో ఆ మాటలకు నిర్వచనాలు వేరు. మనం ఎదుటివారిని చూడం, వారు చెప్పేది వినం. అంటే... ఎదుటి వ్యక్తిని చూస్తున్నప్పుడు మన అహంకారం - అంటే 'నేను' అనే భావం, మనోవికారాలు, ఆలోచనలు, అభిప్రాయాలు, కోరికలు, ఇష్టాయిష్టాలు, ఉద్వేగాలు... ఆ ఎదుటి వ్యక్తికి, మన కళ్ళకు మధ్య అడ్డుగోడలా నిలబడతాయి. మనం వాటిని ఆ వ్యక్తికి ఆపాదిస్తాం. తెలిసో, తెలియకో వాటినే ఆ వ్యక్తిలో చూస్తాం తప్ప... ఆ వ్యక్తిని నిజంగా చూడం. మన దృష్టి మీద, అవగాహన మీద లెక్కలేనన్ని ప్రభావాలుంటాయి. మనం నిరంతరం వాటి వశంలో ఉంటాం.

ప్రభావాల నియంతృత్వం

నిర్మొహమాటంగా చెప్పాలంటే ఎదుటి మనిషి మనం చేరుకోలేని ఒక పరాయి ద్వీపం. అతడి అంతరంగంలో దాగి ఉన్న రాగద్వేషాలు, ఆలోచనలు, వాంఛలు, భయాలు, గాయాలు మనకు కనపడవు. వాటిని మనం కేవలం ఊహించుకుంటాం. ఈ ఊహకు మించి మనకు అతని గురించి ఏమీ తెలీదు. ప్రభావాలు మన కళ్ళకు కళ్ళాల్లా ఉన్నంత కాలం ఎదుటి వ్యక్తి నేరుగా, ప్రత్యక్షంగా మన అనుభూతిలోకి రాడు. అందుకే "ఎవరైనా 'నేను ఫలానా వ్యక్తిని ప్రేమిస్తున్నాను' అంటే అది చాలా సందేహాస్పదం. నీ ఊహకు మించి అసలు ఆ వ్యక్తి ఎవరో కూడా నీకు తెలీదు, మరి ఆ వ్యక్తిని ప్రేమించడం ఎలా వీలవుతుందో చెప్పు" అంటారు కృష్ణమూర్తి. వినడంలో కూడా అదే సమస్య. ఎదుటి వాడు చెప్పేది వింటున్నప్పుడు కూడా మన మీద ప్రభావాల నియంతృత్వం ఉంటుంది. వారు చెప్పేది అర్థం చేసుకొనే మనస్థితం మనకు ఉండదు. "ప్రేమించడంలో మొదటి మెట్టు ఎదుటి వ్యక్తిని చూడడం, ఆ వ్యక్తిని సంపూర్ణంగా తెలుసుకోవడం. అంటే మొదట నేను నామీద ఉన్న ప్రభావాల్ని అన్నిటినీ వదిలించుకుని, మనస్సుని శుభ్రపరిచి, ఎదుటి వాడిని చూడగలగాలి. అన్ని ప్రభావాలను విసర్జించినప్పుడు మనిషికి నిజమైన స్వేచ్ఛ



వస్తుంది. స్వేచ్ఛ పొందిన మనిషికి భయం ఉండదు. భయంలేని స్వేచ్ఛాజీవికి మాత్రమే ప్రేమించే తాహతు ఉంటుంది" అని ఆయన చెబుతారు. ఇదంతా విన్నవారిలో "నన్ను పూర్తిగా తమ అదుపులో పెట్టుకున్న ఈ ప్రభావాల్ని నేను ఎలా వదిలించుకోవాలి?' అనే ప్రశ్న తలెత్తుతుంది. "దానికి ఏదైనా మానసిక విశ్లేషణ లాంటి టెక్నిక్, యోగాసనాల్లాంటి అభ్యాసం, ఏదైనా మంత్రం, ఉపదేశం ఉంటుందా?" అని అడుగుతారు. ఈ సందర్భంలో మనకు కృష్ణమూర్తి ప్రత్యేకత కనిపిస్తుంది. టెక్నిక్, అభ్యాసం, ఉపదేశం లాంటివి మనిషికి స్వేచ్ఛని ఇవ్వలేవు. ఉన్న ప్రభావాల్ని వదిలించుకునే బదులు మనిషి కొత్త ప్రభావాల పరాధీనతకు గురౌతాడు. ఈ కారణం వల్లే కృష్ణమూర్తి మనకు ఏ మార్గమూ చూపరు, ఏ నియమాలనూ విధించరు.

ఎలా బయటపడాలి?

'మనిషి రకరకాల ప్రభావాల స్వాధీనంలో ఉన్నాడు' అనే విషయాన్ని ఒక సిద్ధాంతపరంగా, ఒక ఆలోచనాపరంగా విశ్లేషించి... వాటిని వదిలించుకోవడానికి శ్రమపడడం వల్లనో, దాన్ని ఒక సాధనగా మార్చుకోవడం వల్లనో ఏ ఫలితమూ ఉండదు. తీవ్రమైన పంటినొప్పిని ఎలా వాస్తవమైన విషయంగా గుర్తించి, భరిస్తామో అదే తీవ్రతతో మన మీద ఉండే ప్రభావాలను గుర్తించగలిగితే... అవి వాటంతట అవే మాయమైపోతాయి. అప్పుడు మనం సంపూర్ణమైన స్వతంత్రతను, ప్రేమించడానికి అనివార్యమైన యోగ్యతను పొందే అవకాశం ఉంటుంది. మానవ సంబంధాలలో తలెత్తే అన్ని సమస్యలకు పరిష్కారం... ప్రభావాల నియంతృత్వాన్ని గుర్తించడంలో ఉంటుంది.

• గుంటూరు వనమాలి

హరేకృష్ణ



భగవద్గీత నేటికీ ఆచరణయోగ్యమేనా?

భగవద్గీతను అయిదు వేల ఏళ్ళ క్రితం అప్పటి దేశ, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా శ్రీకృష్ణుడు చెప్పాడు. కానీ ప్రస్తుతం పరిస్థితులు వేరు. మన జీవనగతులు వేరు. అలాంటప్పుడు నేటికీ గీత ఆచరణయోగ్యమైనదేనా? దీనికి సమాధానం ఏమిటంటే... ఇటీవలి కాలంలో కొవిడ్ మహమ్మారి ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూశాం. అయితే సమాజంలో నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న మరొక మహమ్మారి ఉంది. అదే మానసిక రుగ్మత. ఆతృత, ఆవేదనలు, నిరాశా నిస్పృహలు, అసంతృప్తి, భయాందోళనలు లాంటి అంతర్గత బలహీనతలతో నేటి మానవుడు సతమతం అవుతున్నాడు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితులు ఉన్న నేటి సమాజానికి భగవద్గీతా విజ్ఞానం సాంత్వన చేకూర్చి, మనసును నిర్మలంగా చేయగలదు.

భగవద్గీత ఆవిర్భవించిన రోజు గీతా జయంతి. మార్గశిర శుక్లపక్ష ఏకాదశి నాడు సనాతనమైన ఈ గీతాజ్ఞానాన్ని శ్రీకృష్ణుడు లోకానికి అందించాడు. 'మాసానాం మార్గశీర్షోహం... మాసములలో మార్గశీర్ష మాసాన్ని నేను' అంటూ అర్జునుడికి ఈ పవిత్రమైన మాసం విశిష్టతను ప్రత్యేకంగా వివరించాడు. కాబట్టి మార్గశీర్ష మాసం శ్రీకృష్ణునితో అభిన్నమయినదే కాకుండా... ఆధ్యాత్మిక సాధనకు ఎంతో శుభప్రదమైనది కూడా. భగవద్గీతలో తెలిపిన నియమాలను మానవుడు అంగీకరిస్తే జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలడు. జీవిత సమస్యలన్నిటికీ శాశ్వతమైన పరిష్కారం చేకూర్చగలడు. అదే సంపూర్ణ భగవద్గీతా సారాంశం.

భగవద్గీత మూల సూత్రం

భగవద్గీత మూల సూత్రాన్ని వివరిస్తూ చివరి అధ్యాయంలో శ్రీకృష్ణుడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ/ అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః... సర్వ విధాలైన ధర్మాలను త్యజించి, కేవలం నన్నే శరణు పొందు. నిన్ను సర్వ పాపాల నుంచి విముక్తుణ్ణి చేస్తాను. భయపడకు" అని చెప్పాడు. జీవితంలో సంభవించే సకల భయాందోళనల నుంచి, గత పాపకర్మ ఫలితాల నుంచి ఉపశమనాన్ని కాంక్షించేవారు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుణ్ణి తక్షణం శరణు వేడడమే తరుణోపాయం. సకల మానవ జాతికి అర్జునుడి ద్వారా శ్రీకృష్ణుడు ఉపదేశించిన సందేశం ఇది.

శరణాగతి ఇలా...

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు... ఎల్లప్పుడూ నన్నే స్మరించు. నా పట్ల భక్తితో ఉండు. నన్ను పూజించు. నాకు నమస్కరించు. అలా చేయడం వల్ల నీవు తప్పకుండా నన్ను చేరుకుంటావు. ఇది నేను నీకు ఇచ్చే వాగ్దానం. ఎందుకంటే, నువ్వు నాకు చాలా ప్రియమైన మిత్రుడవు" అని చెప్పాడు కృష్ణభగవానుడు. పై శ్లోకం శరణాగతిలోని నాలుగు అంశాలను వివరిస్తుంది:

మన్మనా భవ (సదా కృష్ణుణ్ణే స్మరించడం): ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాలను నిత్యం భగవంతుణ్ణి స్మరించడానికి అనుకూలంగా తీర్చిదిద్దుకోవాలి. శ్రీకృష్ణుణ్ణి మన మనస్సులో, హృదయంలో నిలుపుకొన్నప్పుడు ఎలాంటి పాపభీతి లేకుండా, విశుద్ధంగా జీవించగలం. శ్రీకృష్ణుడి పవిత్రనామాలను జపించడం వల్ల లోకంలోని సకల విపత్తుల నుంచి ఉపశమనం పొందగలం.

మద్భక్తో (శ్రీకృష్ణుడి భక్తుడు కావడం): శ్రీకృష్ణుడి మేనమామ కంసుడు సైతం ఎల్లప్పుడూ ఆయన గురించే ఆలోచించేవాడు. అయితే అది శత్రుత్వంతో కూడిన ఆలోచన. అది భగవంతుణ్ణి స్మరించే పద్ధతి కాదు. శ్రీకృష్ణుణ్ణి భక్తిపూర్వకంగా సేవించడానికి అనువైన నవవిధ భక్తి మార్గాలను ఆచార్యులద్వారా నేర్చుకోవాలి. కుల, ప్రాంత, లింగ, జాతి, వర్ణభేదాలేవీ ఎంచకుండా ఎవరైనా ఈ భక్తి మార్గాలను అనుసరించవచ్చు జీవితంలో పురోగతి సాధించడానికి ఇది లోకంలో సముచితమైన మార్గం.

మద్యాజీ (శ్రీకృష్ణుణ్ణి అర్చించడం): ప్రతి రోజూ శ్రీకృష్ణుణ్ణి పూజించాలి. ధూపం, పుష్పం, నీరు మొదలైన వాటిని సమర్పించవచ్చు. అలా భగవంతుడికి సమర్పించినవి ప్రసాదం అవుతాయి. ధూపం ఇల్లు అంతటినీ పవిత్రం చేయగలదు. కృష్ణప్రసాదం ఇంద్రియాలను పరిశుద్ధం చేస్తుంది. ఈ విధమైన నిత్యారాధన మన ఇంటిని, జీవితాలను పవిత్రం చేస్తుంది. సకల పాపాల నుంచి విముక్తి ప్రసాదిస్తుంది.

మాం నమస్కురు (శ్రీకృష్ణుడికి నమస్కరించడం): భగవంతుడికి కేవలం నమస్కారం చేసినంత మాత్రాన ఆయనకు ప్రియమైన భక్తులు కాగలం. అలాంటి భక్తులకు సకల శుభాలు చేకూరుతాయి. భగవద్గీతలోని ఈ సూత్రాలను ఆచరిస్తే... జన్మ, మృత్యు, జరా, వ్యాధులను అధిగమించి, శ్రీకృష్ణుని దివ్య ధామాన్ని చేరుకొని, శాశ్వతమైన నిత్య యవ్వన జీవితాన్ని ఆస్వాదించగలం.

గీతా జయంతిని ఎలా ఆచరించాలి?

గీతా జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి. శ్లోక, ప్రతిపదార్థ, భావాలను చదివి, అర్థం చేసుకొని... తమ జీవితాలను శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లేలా తీర్చిదిద్దుకోవాలి.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్,
9396956984



సుభాషితం

విధి బలీయం

గజ భుజంగ విహంగమ బంధనం
శశి దివాకరయో గ్రహపీడనం
మతిమతాంచ విలోక్య దరిద్రతాం
విధి రహో బలవానితి మే మతిః... విధికి ఎంతటివారైనా తలవంచవలసిందేనని తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు. ఆ శ్లోకాన్ని...
ఫణులు గజములు బక్షులు బట్టువడుట
రవిసుధాకరులకునైన రాహుబాధ
బుద్ధిమంతుల లేమియు బొసగ జూచి
విధి బలాఢ్యుడటంచు భావింతు మదిని... అంటూ తెలుగువారికి అందించాడు ఏనుగు లక్ష్మణకవి.



భావం: పట్టుకోవడం దాదాపు అసాధ్యమైన పాములు, ఏనుగులు, పక్షులు కూడా బందీలు అవుతూ ఉంటాయి. తమ కాంతితో లోకాలన్నిటినీ ప్రకాశింపజేసే సూర్యుణ్ణి, చంద్రుణ్ణి రాహువు పట్టి పీడిస్తూ ఉంటాడు. ఎంతో తెలివైనవారు, మంచి బుద్ధి కలిగినవారు సంపదకు నోచుకోకుండా దరిద్రంతో జీవిస్తున్నారు. ఇవన్నీ చూసినప్పుడు విధి చాలా బలీయమైనదని, దాన్ని తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదని అనిపిస్తూ ఉంటుంది.

స్వర్గం, నరకం లేవు...

పచ్చని గడ్డి, కలప, మొక్క జొన్న పైర్లతో ధన ధాన్య సమృద్ధమైన సేతవ్యా గ్రామాన్ని పాయాసికి కోసల రాజు ప్రసేనజిత్తు బహుమతిగా ఇచ్చాడు. ఒకసారి కుమార కాశ్యపుడు దాదాపు 500 మంది భిక్షువులతో కలిసి కోసల రాజ్యంలో తిరుగుతూ, సేతవ్యా గ్రామానికి ఉత్తరాన ఉన్న శింశుపారణ్యంలో బస చేశాడు. బుద్ధుడి ప్రత్యక్ష శిష్యులలో కుమార కాశ్యపుడు అగ్రగణ్యుడు. అతను అనుభవజ్ఞుడు, విద్యావంతుడు, వివేకి. తాత్త్విక విషయాలను వివరించగలిగే నేర్పరి. పైగా అర్హమైన స్థానానికి ఎదిగినవాడు.

నాలుగు వాదాలు...

పాయాసి భౌతికవాది. కనిపించే వాటిని తప్ప వేరేవాటిని ఒప్పుకొనేవాడు కాదు. అతనికి ఆస్తికత సన్నగిల్లింది. పరలోకాలు, పాప పుణ్యాలు కనిపించవు కాబట్టి వాటిని నమ్మేవాడు కాదు. జీవుడు మరణానంతరం మళ్ళీ పుడతాడనే సిద్ధాంతాన్ని కూడా అతను అంగీకరించేవాడు కాదు. కానీ పాయాసి సిద్ధాంతాన్ని కుమార కాశ్యపుడు ఒప్పుకోలేదు. అప్పుడు తన సిద్ధాంతాన్ని సమర్థించుకోవడానికి నాలుగు వాదాలను పాయాసి ప్రతిపాదించాడు.

- చైతన్య స్వరూపమైన ఆత్మ కనిపించదు కదా, అందుకే అది లేదు. స్వర్గ-నరకాలు లేవు. అందుకే మరణానంతరం మానవుడు తిరిగి జన్మించడు.
- మనిషి మళ్ళీ పుట్టడు కాబట్టి... ధార్మికులైన ఆస్తికులను కూడా మరణభయం వెంటాడుతుంది. మళ్ళీ ఈ లోకానికి రాలేమనే ఆలోచనే ఆ భయానికి కారణం. చావంటే అందరికీ భయమే. మరణం అనివార్యం అని తెలిసి కూడా జ్ఞానులను సైతం ఈ భీతి ఎందుకు వెంటాడుతుంది?
- ఆత్మ అనేది అసలు లేనే లేదు, కాబట్టి మనిషి మరణించినప్పుడు అది ఎవరికీ కనిపించదు. లేనిది ఎలా కనిపిస్తుంది?
- ఆత్మ శరీరం నుంచి వేరయ్యాక ఆ శరీర భారం తగ్గాలి. కానీ శరీర భారం ఇంకాస్త పెరుగుతుంది. అందుకే ఆత్మ లేదు.

స్వర్గం గురించి ఎందుకు తెలుసుకోలేమంటే...

పాయాసి రాజు ప్రస్తావించిన పై వాదనలను కుమార కాశ్యపుడు వరుసగా ఖండించాడు. మొదటి వాదంపై మాట్లాడుతూ "మృత్యు దండనను పొందిన అపరాధిని ఉరి తీసే ముందు... అతడు మిత్రులతో, బంధువులతో కలవడానికి రాజు ఎలాగైతే అనుమతించడో... అదే విధంగా నరకంలో తీవ్ర దుర్గతి పాలైన ప్రాణి భూలోకానికి వచ్చి, పరలోకం గురించి మీకు చెప్పడానికి యముడు అనుమతించడు. ఇక 'త్రాయస్త్రింశ లోకం'లో, అంటే స్వర్గంలో ఉన్న ప్రాణి అక్కడి భోగభాగ్యాలను విడిచి మళ్ళీ ఈ కష్టసాధ్యమైన భూలోక జీవితంలోకి ప్రవేశించాలని అనుకోడు. అపవిత్రం, దుర్గంధభూయిష్టం, హేయం అయిన మలకూపం నుంచి బయటపడి... స్వచ్ఛమైన వస్త్రాలను ధరించి, పంచేంద్రియాలతో, పంచభోగాలను అనుభవించే మనిషి మళ్ళీ ఇలాంటి చోట ప్రవేశించాలని ఎలా అనుకోడో... అదే విధంగా స్వర్గలోకంలో నివసించిన ప్రాణి మళ్ళీ భూలోకానికి రావడానికి అసలు ఇష్టపడదు. అంతేకాదు, స్వర్గలోకంలో అతడు అనుభవించే భోగభాగ్యాలను, స్థితిగతులను భూలోకంలో నివసించే మానవులు తెలుసుకోకపోవడానికి మరో కారణం ఉంది. భూలోకంలో నివసించే మనుషులకు వంద సంవత్సరాల కాలం... స్వర్గవాసులకు ఒక్క రోజుతో సమానం. అలాంటి వేయి దైవీ సంవత్సరాలు స్వర్గ లోక దేవతల ఆయుఃప్రమాణం. అలాంటప్పుడు... స్వర్గలోక నివాసులైన వారు ఆ లోకంలో రెండు మూడు రోజులు భోగభాగ్యాలను అనుభవించి, ఆ విషయాలను మీతో చెప్పడానికి భూలోకానికి తిరిగి వస్తే... అంతవరకూ వారి మాటలు వినడానికి మీరు జీవించి ఉంటారా? అందుకే చనిపోయిన వ్యక్తి మళ్ళీ తిరిగి వచ్చి, పరలోకం గురించి చెబితేనే పరలోకాన్ని నమ్ముతాననడం అవివేకం. అది తెలివైన ఆలోచన కాదు" అన్నాడు. కానీ కుమార కాశ్యపుడు వర్ణించిన దేవతల దీర్ఘాయువును పాయాసి ఒప్పుకోలేదు. అది ఉత్త భ్రమ అన్నాడు. "స్వర్గలోక దేవతల దీర్ఘాయువు గురించి నేను ఎప్పుడూ వినలేదు. అందుకే నేను ఈ విషయాన్ని అంగీకరించను" అన్నాడు. కుమార కాశ్యపుడు అంతటితో వదిలిపెట్టలేదు. అతణ్ణి ఒప్పించడానికి ఒక జన్మాంధుడి ఉదాహరణ ఇచ్చాడు. "సూర్య తేజం వల్ల వచ్చే తెలుపు రంగును, చంద్రప్రభ వల్ల వచ్చే వెన్నెలను చూడలేని ఒక పుట్టు గుడ్డివాడు... సూర్య చంద్రుల అస్తిత్వాన్ని స్వీకరించనట్టే... పాయాసి కూడా పారలౌకిక విషయాలను అంగీకరించలేదు" అన్నాడు. "కుమార కాశ్యపుడు చెప్పిన ప్రకారం. పారలౌకిక విషయాలను మనిషి తన మామూలు కళ్ళతో చూడలేడు. దానికి దివ్య చక్షువు అవసరం. కాబట్టి పరలోకం లేదని అనడం కూడా ఆధారం లేని విషయమే" అని చెప్పాడు.

ధర్మపథం



ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు
జేఎన్‌యు, న్యూఢిల్లీ.
91 98189 69756



సహజయోగ

రాక్షస గుణాలు అంతం కావాలంటే...

పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ దేవుడి గురించి కఠోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాక... తనకు మరణం లేకుండా వరం ఇవ్వాలని కోరాడు. అలాంటి వరం సాధ్యం కాదని బ్రహ్మదేవుడు చెప్పగా... తారకాసురుడు బాగా ఆలోచించి, శివుడి కుమారుడి చేతిలో మాత్రమే మరణించే వరం ఇవ్వాలని అడిగాడు. ఎందుకంటే ఆ సమయానికి శివుని భార్య సతీదేవి అగ్నిలోకి దూకి ఆత్మార్పణ చేసుకుంది. ఆ బాధతో శివుడు హిమాలయాల్లో తపస్సులో లీనమై ఉన్నాడు. శివుడు తపస్సును భగ్నం చేసే సాహసులెవరూ లేరు. ఒకవేళ శివుడు తపస్సు నుంచి బయటకు వచ్చినా... ఆయనకు భార్య లేదు కాబట్టి కుమారుడు కలిగే అవకాశం లేదని తారకాసురుడు భావించాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని అనుగ్రహించాడు.

కుమారస్వామి జననం...

ఆ తరువాత తనను చంపేవారెవరూ లేరనే గర్వంతో తారకాసురుడు విర్రవీగాడు. ముల్లోకాలను తన దారుణ కృత్యాలతో గడగడలాడించాడు. దేవేంద్రుణ్ణి తరిమేసి స్వర్గలోక ఆధిపత్యాన్ని తీసుకున్నాడు. అప్పుడు



తమకు తరుణోపాయం సూచించాల్సిందిగా దేవతలందరూ నారదుణ్ణి వేడుకున్నారు. సతీదేవి పర్వతరాజైన హిమవంతుడి కుమార్తెగా... పార్వతి పేరుతో మళ్ళీ జన్మించిందని, ఆమె శంకరుడికి పత్ని అవుతుందని నారదుడు చెప్పాడు. ఆ తరువాత దేవతలందరూ కలిసి సప్తర్షుల సాయంతో శివ పార్వతులకు వివాహం జరిపించారు. వారి సంతానమే కుమారస్వామి లేదా కార్తికేయుడు. ఆరు ముఖాలు ఉంటాయి కాబట్టి ఆయనకు 'షడాననుడు', 'షణ్ముఖుడు' అని, నెమలి ఆయన వాహనం కాబట్టి 'శిఖి వాహనుడు' అని, ఋషి పత్నులైన కృత్తికల దగ్గర పెరగడం వల్ల 'కృత్తికాసూనుడు', 'కార్తికేయుడు' అనే నామాలు ఏర్పడ్డాయి. ఆయనను సుబ్రహ్మణ్య స్వామి, మురుగన్, వేలాయుధన్, దండపాణి.. ఇలా అనేక పేర్లతో పిలుస్తారు.

తారకాసుర సంహారం...

కార్తికేయుడి జననం మార్గశిర శుద్ధ షష్ఠి నాడు జరిగింది. ఆయన ద్వారా తమకు స్వేచ్ఛ రాబోతోందని దేవతలు సంతోషించగా, తారకాసురుడి అనుచరుల్లో నిరాశ, భయాందోళనలు పెరిగాయి. కుమారస్వామికి విశ్వామిత్ర మహర్షి 'గుహ' అనే నామాన్ని ఇస్తూ... వేదజ్ఞానాన్ని ప్రసాదించాడు. అగ్ని దేవుడు 'శక్తి' అనే ఆయుధాన్ని ఇచ్చాడు. అనంతరం కైలాసానికి యువరాజుగా కార్తికేయుడు పట్టాభిషిక్తుడు అయ్యాడు. వివిధ దేవతలు తమ ఆయుధాలను, శక్తులను బహుమతులుగా ఇచ్చారు. దేవతల సేనాధిపతిగా ప్రకటించారు. కొంతకాలానికి తారకాసురుడు నాశనమయ్యే సమయం వచ్చింది. వారిద్దరి మధ్యా జరిగిన యుద్ధంలో తారకాసురుడు మరణించాడు. గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... పసిపిల్లల్లో ఉండే అమాయకత్వంతో కూడిన తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి. భగవంతుడి పట్ల వినయ విధేయతలు, నాయకత్వ లక్షణాలు, అందరికీ మార్గదర్శకత్వం చేయగల శక్తి, దైవికమైన జ్ఞానం, వివేకం కలుగుతాయి. మన సూక్ష్మ శరీరంలో కార్తికేయుడి స్థానం కుడివైపు మూలాధార చక్రంలో ఉంటుంది. మన లోపల ఉన్న కుండలినీ శక్తి ఆ చక్రాన్ని దాటి పైకి రావాలంటే... మనలో కార్తికేయుడి గుణగణాలు ఉండాలి. ఆ గుణగణాలు ఏమిటో, కార్తికేయుడి ఆశీస్సులు ఎలా పొందాలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు.

కార్తికేయుడి నివాసం మన సూక్ష్మ శరీరంలోని కుడివైపున మూలాధార చక్రమే అయినా... పింగళి నాడి మొత్తం మీద ఆయన ప్రభావం ఉంటుంది. అందుకే ఆయనకు 'సుపింగళా' అనే పేరు ఏర్పడింది. మూలాధార చక్రం శుభ్రమైనప్పుడు.... పింగళానాడి మొత్తం శుభ్రమవుతుంది. మనలోని మూలధార చక్రం, ఆజ్ఞా చక్రం ఒకదానితో ఒకటి పరిపూర్ణమైన సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి మూలాధార చక్రం కుడిభాగం శుభ్రమైతే ఆజ్ఞాచక్రం కుడిభాగం కూడా శుభ్రపడుతుంది. మనలో అహంకారాన్ని నియంత్రించుకొనే శక్తిని మెరుగుపరుస్తుంది. మనలోని రాక్షస గుణాలు అంతం కావాలంటే కార్తికేయుడి అనుగ్రహం కావాలి. అంటే కుడివైపున మూలధార చక్రం బలంగా ఉండాలి. ఈ చక్రం శుభ్రమయ్యేకొద్దీ మనలోని అనవసరమైన ఆలోచనలు తగ్గుతాయి. అంతర్గత ప్రశాంతత కలుగుతుంది. కార్తికేయుడి ఆశీస్సులు ఉన్న వ్యక్తి ఇతరులను శాసించగలుగుతాడు. ఇలా శాసించగలిగే శక్తి పురుషులకు వారి మాటల ద్వారా, చురుకుదనం ద్వారా, వ్యక్తిగత విజయాల ద్వారా లభిస్తే... మహిళలకు సహనం, హుందాతనం, క్షమాగుణం, కరుణ, అందరినీ ఆదరించే గుణం ద్వారా లభిస్తుంది.

> గణేశుడు గణాలన్నిటికీ రాజైతే కార్తికేయుడు సర్వసైన్యాధ్యక్షుడు. మన శరీరంలో కుడివైపున ఉండే పింగళా నాడిని ప్రభావితం చేసే శక్తికి ప్రతీకగా ఉంటాడు. ఆ శక్తి మన ప్రాణశక్తితో అనుసంధానమై ఉంటుంది. కార్తికేయుడి అనుగ్రహం పొందడం వల్ల... తేజస్సు, చక్కటి క్రియాశీలత, చెడుని అంతమొందించే అంతర్గత దైవశక్తి లభిస్తాయి.

సాధారణంగా కొన్ని దేవాలయాలలో రెండు సర్పాలు ఒకదానితో ఒకటి మెలికలు తిరుగుతూ ఉన్న శిల్పం మనకు కనిపిస్తుంది. ఆ శిల్పంలోని రెండు సర్పాలు మన సూక్ష్మ శరీరంలో ఇడా, పింగళా నాడులు ఒకదానితో ఒకటి మెలికలు తిరిగి... ఆరు శక్తి కేంద్రాలను లేదా షట్చక్రాలను ఎలా ఏర్పరుస్తాయో సూచిస్తాయి. వీటినే 'చంద్రనాడి, సూర్యనాడి' అని కూడా పిలుస్తారు. మన వెన్నెముక అడుగు భాగాన త్రికోణాకార ఎముకలో ఉండే కుండలినీ శక్తి... ఈ రెండు నాడుల మధ్య ఉండే సుషుమ్నా నాడి ద్వారా పైకి వచ్చి, మన మాడు పైభాగంలో ఉండే బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, మన చుట్టూ ఉన్న, సర్వవ్యాపితమైన భగవంతుడి పరమ చైతన్య శక్తితో ఐక్యం అవుతుంది. అప్పుడే సాధకుడికి యోగ ప్రాప్తి కలుగుతుంది. ప్రతి నిత్యం సహజయోగ సాధన ద్వారా దీన్ని సాధించగలమనీ, కార్తికేయుడి గుణాలను, శక్తులను మనలో స్థిరపరుచుకోగలమనీ శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో స్పష్టం చేశారు.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ



ధరణి మొరాయింపు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఐసీ చేపట్టాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా ధరణి సమాచారం ఎన్ఐసీకి బదిలీ కావడం లేదు. సాఫ్ట్‌వేర్‌లో లోపాల వల్ల భూదస్త్రాల నిర్వహణ ఎన్ఐసీ చేపట్టలేకపోయింది. రికార్డుల నిర్వహణ, భూ లావాదేవీలపై రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి వేలిముద్రలు వేయాలని ప్రయత్నించినా ఎన్ఐసీ సర్వీస్ ప్రొవైడర్ తీసుకోవడం లేదు. దీంతో చాలా దస్త్రాలు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. అధికారుల వేలిముద్రలు ఎందుకు పని చేయడం లేదనే దానిపై సాంకేతిక నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. త్వరలో కొత్త ఆర్వోఆర్ చట్టం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించింది. కానీ, డేటా బదిలీ కాకపోవడం, సమస్యలను అప్‌డేట్ చేసేందుకు వీల్లేకపోవడంతో గందరగోళం నెలకొంది. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి.

బడుల్లో కలుషిత భోజనంపై నివేదిక ఇవ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనలపై నివేదిక అందజేయాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఆ పథకం అమలును పర్యవేక్షించే టాస్క్‌ఫోర్స్ కమిటీలు, కమిటీ సభ్యుల వివరాలు సైతం నివేదికలో పొందుపర్చాలని తెలిపింది. ప్రమాణాల ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయడం లేదని, నారాయణపేట్ జిల్లా మాగనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారంలో మూడుసార్లు కలుషిత ఆహారం పెట్టారని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. దీనిపై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ పీఎం పోషణ్ పథకంలో భాగంగా పని చేయాల్సిన పర్యవేక్షణ కమిటీలు సరిగా పనిచేయడం లేదన్నారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాగనూర్ పాఠశాల హెచ్ఎంను సస్పెండ్ చేయడంతోపాటు కాంట్రాక్టర్‌ను తొలగించినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కాళేశ్వరం బ్యారేజీలపై వివరాలు ఇవ్వట్లే!

» జాతీయ ఆనకట్టల భద్రత సంస్థకు తెలిపిన నిపుణుల కమిటీ

» వివరాలన్నీ అందించాలని తెలంగాణకు ఎన్‌డీఎస్ఏ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు నిపుణుల కమిటీకి అందించడంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ జాప్యం చేస్తోందని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ తెలిపింది. దీనివల్ల తుది నివేదికను సమర్పించడంలో మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎన్‌డీఎస్ఏ చైర్మన్‌కు నిపుణుల కమిటీ సభ్యకార్యదర్శి లేఖ రాశారు. గడువు ముగిసి నెలరోజులు దాటినా.. తాము కోరిన సమాచారం ఇవ్వలేదని, ఈ అంశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శితో చర్చించి, పరీక్షల నివేదికలన్నీ వచ్చేలా చూడాలని నిపుణుల కమిటీ ఎన్‌డీఎస్ఏ చైర్మన్‌ను అభ్యర్థించింది. దీంతో నివేదికలన్నీ అందించాలని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఎన్‌డీఎస్ఏ డైరెక్టర్ అజయ్‌కుమార్ సిన్హా లేఖ రాశారు. కమిటీ కోరిన వివరాలన్నీ అందించాలని తెలిపారు.

9న రాష్ట్ర బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపు

హైదరాబాద్, ఏటూరునాగారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా చల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఏడుగురు విప్లవకారులకు విషమిచ్చి పోలీసులు అతి కిరాతకంగా చంపారని పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అస్థిరత నుంచి సుస్థిరత దాకా!

(మొదటిపేజీ తరువాయి)



అధిగమిస్తూ సుస్థిర స్థానానికి చేరుకుంది.

పార్టీలో అసమ్మతి స్వరాలు లేవు.. ప్రభుత్వంలో వ్యతిరేక గళాలు లేవు.. ప్రధాన ప్రత్యర్థి డీలాపడింది.. ప్రజలు కూడా వ్యతిరేకతతో లేరు..! వెరసి రేవంత్ సర్కారు తొలి ఏడాది సంతృప్తికరంగా ముగిసింది..! అంతమాత్రాన అంతా సర్దుకుందని కాదు..! మంత్రివర్గ విస్తరణ జరగాల్సి ఉంది.. నామినేటెడ్ పదవుల పంపిణీని ముగించాల్సి ఉంది.. స్థానిక ఎన్నికల సంగ్రామాన్ని ఎదుర్కోవాల్సి ఉంది..! రాజకీయంగానూ దీటుగా నిలవాల్సి ఉంది..! అంటే.. రెండో ఏడాదిలో ఉన్నాయి అసలు సవాళ్లు..! ఉప ఎన్నికలో బీఆర్ఎస్ సీటు కైవసం, ఆ పార్టీ నుంచి వచ్చి చేరిన ఎమ్మెల్యేల మద్దతు, ఎంఐఎం శాసనసభ్యుల దన్నుతో రేవంత్ సర్కారు పటిష్ఠమైంది. ఇదే సమయంలో ఎమ్మెల్యేలను చేజార్చుకుని, లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవని కారు బాగా బలహీనపడింది. ప్రత్యర్థి డీలాతో సహజంగానే రేవంత్ సర్కారు మరింత బలోపేతమైంది. ఇక గత ఏడాది పార్టీ కోణంలోనూ అంతా సానుకూలమే..! అసమ్మతి, అంతర్గత కుమ్ములాటల కాంగ్రెస్ సంస్కృతికి భిన్నంగా.. సీనియర్లు.. సీఎంకు అండగా నిలిచారు. మంత్రులకేమో తమ శాఖల్లో నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లభించింది. క్షేత్రస్థాయిలో తమ పట్టు కొనసాగాలంటే పార్టీ అధికారంలో ఉండడం ముఖ్యమన్న భావనకు వారు వచ్చారు. అక్కడక్కడా అంతర్గత విభేదాలున్నా.. వీటి కంటే బయటి శక్తులు ప్రమాదకరమనే ఆలోచనతో కలిసి నడుస్తున్నారు. పదేళ్లు అధికారానికి దూరంగా ఉండి రాజకీయంగా, ఆర్థికంగా నష్టపోయిన సీనియర్ నాయకులు.. మన ప్రభుత్వం ఉంటేనే పనులు జరుగుతాయన్న ఆలోచనతో వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సీఎంకు పూర్తి అండగా నిలిచారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

కూలిపోతుందంటే.. నిలబెట్టుకున్నారు

గ్యారెంటీల బరువు, స్వల్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందంటూ బీఆర్ఎస్ టార్గెట్ చేసింది. గులాబీ పార్టీ అగ్ర నాయకులు చేసిన ఈ ప్రకటనలనే సీఎం రేవంత్ అస్త్రంగా మలుచుకున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పదిమంది ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా తమ ప్రభుత్వానికి మద్దతు పలికేలా చేశారు. సర్కారు మనుగడపై కారు పార్టీ నాయకుల వ్యాఖ్యలతోనే.. వారి ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సి వచ్చిందన్న సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా పంపారు. మరోవైపు మజ్లి్స్‌తో స్నేహంగా ఉంటూ ఆ పార్టీ మద్దతునూ సాధించారు. తద్వారా సర్కారు సుస్థిరతకు ఢోకా లేదనే సందేశాన్ని ఇచ్చారు.

ఆర్థికంపై శ్వేతపత్రంతో సమాధానం

ఎన్నికల గ్యారెంటీలే ప్రభుత్వానికి మొదటి సవాల్‌గా నిలిచాయి. దీంతో రేవంత్ సర్కారు వ్యూహాత్మకంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల మేరకు అప్పుల్లో ముంచేశారని, అసలు, వడ్డీలకే నెలకు రూ.6,500 కోట్లు చెల్లించాల్సి వస్తున్నదంటూ శ్వేతపత్రం ప్రకటించింది. హామీలను సకాలంలో అమలు చేయాలని ఉన్నా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదన్న అభిప్రాయాన్ని ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లింది. ఇక పంద్రాగస్టు కల్లా రైతులకు రూ.2 లక్షల మేరకు రుణమాఫీ చేస్తామంటూ సీఎం ప్రకటించి ఆ మేరకు కచ్చితంగా అమలు చేయడంతో.. ఆలస్యంగానైనా మిగతా హామీలనూ నెరవేరుస్తారన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని నేతలు చెబుతున్నారు.

'సామాజిక' అసంతృప్తికి అధిష్ఠానం చెక్!

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల టికెట్లలో న్యాయం జరగలేదని, కాంగ్రెస్‌లో బీసీలకు ప్రాధాన్యం దక్కట్లేదని ఆ వర్గం నేతల్లో నెలకొన్న అసంతృప్తిని అధిష్ఠానం చల్లార్చింది. సీఎం తర్వాత అంతటి ప్రాధాన్యమైనదిగా భావించే టీపీసీసీ అధ్యక్ష పదవిలో బీసీ వర్గానికి చెందిన మహే‌ష్‌కుమార్‌గౌడ్‌ను నియమించింది. టిక్కెట్లు దక్కని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల నాయకులను నామినేటెడ్ పదవుల్లో నియమించేలా చూసింది. స్థానిక ఎన్నికలు, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నవారికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు దక్కుతాయని రేవంత్, మహే‌ష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేయడంతో ఆశావహులంతా ప్రజల్లో తిరుగుతున్నారు. అయితే, పదేళ్లు పార్టీకోసం పోరాటాలు చేసి.. కేసులు ఎదుర్కొన్న నేతలకు న్యాయం చేయడం.. నాయకత్వం ముందున్న సవాల్‌గా కాంగ్రెస్‌వర్గాలు పేర్కొంటున్నాయి.

నిర్ణయాల్లోనూ హై కమాండ్ అండ..

పార్టీ అధికారంలోకి రావడానికి పూర్తి సహకారాన్ని అందించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. ప్రభుత్వంలో ఏర్పడిన అడ్డంకులను అధిగమించడంలోనూ తోడ్పాటునిచ్చింది. రేవంత్ సర్కారు ఒక్కో అడుగు వ్యూహాత్మకంగా వేస్తున్నా.. హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన, లగచర్ల భూసేకరణలో స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంది. పర్యావరణవేత్తలు, మేధావుల నుంచి ఈ కార్యక్రమాలకు మద్దతు లభించింది. కానీ, కొందరు బాధితులతో కలిసి ప్రతిపక్షాల ఆందోళనలు చేయడంతో సర్కారు కాస్త వెనక్కుతగ్గాల్సి వచ్చింది. అయితే, ఈ అంశంలోనూ ప్రభుత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతుగా నిలిచింది.

మాసాలు పోయాయి.. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడో?

ఆషాఢం అడ్డంకి దాటి శ్రావణం పూర్తయి.. కార్తీక మాసమూ గడిచిపోయినా రేవంత్ ప్రభుత్వంలో పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. వాస్తవానికి టీపీసీసీ అధ్యక్ష పదవి భర్తీ, మంత్రివర్గ విస్తరణ ఒకేసారి జరుగుతాయని భావించారు. మహేష్ గౌడ్ నియామకమై రెండు నెలలైంది. మంత్రివర్గంలో మరో ఆరు ఖాళీలు మాత్రం అలాగే ఉన్నాయి. హైదరాబాద్, కీలకమైన రంగారెడ్డి సహా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు కేబినెట్‌లో ఇంకా ప్రాతినిధ్యం లేదు. ఈ పరిస్థితి ఆశావహుల్లో అసంతృప్తికి దారితీస్తోంది. సామాజిక సమతూకం కుదరకపోవడం, పదవులు ఆశిస్తున్నవారిలో ఆర్థికంగా, ఇతరత్రా బలమైన నాయకులు ఉండడంతో అధిష్ఠానం తుది నిర్ణయానికి రాలేకపోతోం ది. నామినేటెడ్ పోస్టులు, మంత్రి పదవు లు ఆశిస్తున్న నాయకులనూ సంతృప్తిపరచడం కాంగ్రెస్ నాయకత్వం ముందున్న పెద్ద సవాలు అని పరిశీలకులు చెబుతున్నారు. ఈ విషయాల్లో అటు అధిష్ఠానం, ఇటు ముఖ్యమంత్రి సమన్వయం చేసుకుంటేనే.. కాంగ్రెస్ మార్క్ అసంతృప్తి మళ్లీ తలెత్తకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.

కొత్త ఏడాదిలో స్థానిక ఎన్నికల సవాల్

పదేళ్లుగా బీఆర్ఎస్ కనుసన్నల్లో మెలిగిన రాజకీయ వ్యవస్థపై పట్టు సాధించేందుకు, ఆధిక్యతను సుస్థిరం చేసుకునేందుకు రేవంత్ సర్కార్‌కు ఏడాది పట్టింది. అయితే, రెండో ఏడాదిలో అడుగిడుతుండగానే ప్రభుత్వం ముందు స్థానిక ఎన్నికల సవాల్ నిలవనుంది. జనవరిలో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి, ఫిబ్రవరిలో ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తులు లేకుండా జరిగినా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పార్టీ గుర్తులను వినియోగిస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే రేవంత్ సర్కారు వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. రూ.2 లక్షల లోపు రుణాలున్న రైతులకు మాఫీని పూర్తిచేసింది. రైతు భరోసాను సంక్రాంతి తర్వాత ఇస్తామని ప్రకటించింది.

కేసులతో ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రావడంతోనే.. ప్రభుత్వంపై బీఆర్ఎస్ కీలక నాయకులు కేటీఆర్, హరీశ్ రావు దాడి ప్రారంభించారు. అయితే, కాళేశ్వరం బరాజ్‌లు కుంగడం, విద్యుత్ ఒప్పందాల్లో అవినీతి ఆరోపణలను తెరపైకి తెచ్చిన సీఎం రేవంత్, మంత్రులు.. అసెంబ్లీలో గులాబీ పార్టీ నాయకత్వంపై ప్రతిదాడికి దిగారు. విచారణ జరిపించుకోవాలంటూ శాసనసభ వేదికగా సవాళ్లు విసిరిన కేటీఆర్, హరీశ్, బీఆర్ఎస్ మాజీ మంత్రులు ఉచ్చులో చిక్కుకున్నారు. వారి సవాళ్ల మేరకు రేవంత్ ప్రభుత్వం విచారణ కమిషన్లను నియమించింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసునూ ముందుకు తెచ్చింది. దీంతో బీఆర్ఎస్ నాయకత్వం ఆత్మరక్షణలో పడింది. ఇక ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీ దూకుడును కొంత వెనక్కులాగింది.

అటు కేసీఆర్.. ఇటు కాషాయ దళము..

స్థానిక ఎన్నికలతో పాటు రేవంత్ సర్కారుకు రాజకీయంగా రెండో ఏడాదిలో గట్టి సవాళ్లే ఎదురవనున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి, కాలు విరిగి గాయపడడం, ప్రభుత్వానికి సమయం ఇవ్వాలన్న ఆలోచనతో కేసీఆర్ ఏడాదిగా రాజకీయంగా క్రియాశీలంగా లేరు. పూర్తిగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావులను ముందుపెట్టి నడిపించారు. ఇకపై మాత్రం కేసీఆర్ బయటకు రావడంతో పాటు, ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ గళాన్ని పెంచే అవకాశం ఉంది. కేసీఆర్ బయటకు రావాల్సిందేనని, వస్తే ఏం చేయాలో తమకు తెలుసని రేవంత్ కూడా పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

- తెలంగాణలో తమదే అధికారం అంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పదేపదే ప్రకటించి.. మూడో స్థానానికి పరిమితమైంది బీజేపీ. ఆపై లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 8 సీట్లు గెలుచుకుని సత్తాచాటింది. ఇప్పుడు పొరుగునున్న మహారాష్ట్ర ఎన్నికల్లో సాధించిన ఘన విజయంతో.. తెలంగాణపైనా గట్టిగా గురిపెట్టనుంది. స్వయంగా ప్రధాని మోదీనే.. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారానికి చేరువగా వచ్చినట్లు అనిపించినా, అవకాశం జారిపోయిందని, ఈసారి మాత్రం లక్ష్యం చేరాల్సిందే అన్న సంకేతాలను బీజేపీ రాష్ట్ర నేతలకు పంపించారు. దీంతో రాబోయే కాలంలో అటు కేసీఆర్, ఇటు బీజేపీ తమ వ్యూహాలకు పదునుపెట్టడం, ఆందోళనల తీవ్రత పెంచడం ఖాయం. వీటిని ఎదుర్కొంటూనే తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి రేవంత్ సర్కారుకు ఎదురవనుంది. తొలి ఏడాది అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూనే సుస్థిరత సాధించామని, రాబోయే కాలంలో గేర్ మార్చి వేగం పెంచుతామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.

నవ్య | చిత్రజ్యోతి

గడ్డంతో గొడవ... సుఖాంతం



'అమరన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్నారు శివ కార్తికేయన్. ఆయన నటించే 25వ చిత్రాన్ని.. 'గురు', 'ఆకాశమే హద్దు' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న సుధా కొంగర తెరకెక్కించనున్నారు. అయితే ఈ చిత్రం నిలిచిపోయిందని.. టెస్ట్ షూట్ సమయంలో శివ కార్తికేయన్, సుధా కొంగర మధ్య విభేదాలు తలెత్తడమే కారణమని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తల్లో నిజం లేదని.. అనుకున్నట్లుగానే సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని తెలిసింది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉందట. కాగా, ఈ సినిమా కోసం శివకార్తికేయన్‌కు గడ్డం పెంచమని దర్శకురాలు చెప్పారట. అయితే, టెస్ట్ షూట్ సమయంలో మళ్లీ ఆమే గడ్డం ట్రిమ్ చేయమని చెప్పడంతో అది నచ్చక ఆయన సెట్స్ నుంచి వెళ్లిపోయారనే వార్త వైరల్ అయిన సంగతి తెలిసిందే.

హిందీ సినిమా చేస్తుందా?



నటి ప్రియాంక జోనాస్ బాలీవుడ్‌కు తిరిగి వచ్చేస్తున్నారనే వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. రీసెంట్‌గా సిటాడెల్ వెబ్‌సిరీస్ షూటింగ్‌లో పాల్గొన్న ప్రియాంక తాను త్వరలో హిందీ సినిమా చేయబోతున్నట్లు హింట్ ఇచ్చారు. అయితే ఈ వార్తలు చక్కర్లు కొడుతుండగానే ప్రియాంక తల్లి మధు చోప్రా మాత్రం తమ ప్రొడక్షన్ హౌస్ కార్యకలాపాలను అమెరికాకు షిఫ్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆమె ఓ భారతీయ మీడియా సంస్థతో జరిపిన చాట్ ప్రియాంక బాలీవుడ్‌కు వచ్చే అవకాశాలు లేవనే వాదనకు బలం చేకూరుస్తోంది. 'మా ప్రొడక్షన్ హౌస్ 'పర్పుల్ పెబ్బుల్' అమెరికా తరలిపోయింది. ప్రస్తుతానికైతే ఇక్కడ ఏ సినిమాలూ చేయడం లేదు. కానీ ప్రియాంక ఇండియాకు వస్తే... అప్పుడు ఆలోచిస్తాం. ప్రస్తుతానికైతే ఎలాంటి ప్లాన్‌లు లేవు' అని పేర్కొన్నారు. ప్రియాంక రాకకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఆమె అభిమానులకు, మరీ ముఖ్యంగా 'జీలే జరా' మూవీలో ప్రియాంకతో కలసి నటించిన అలియా భట్, కత్రీనా కైఫ్‌లకు మధు చోప్రా మాటలు నిరాశ కలిగించాయి. 2021లో ప్రారంభమైన 'జీలే జరా' సినిమా షూటింగ్ కొన్ని కారణాల వల్ల మధ్యలోనే ఆటకెక్కినట్లు వార్తలొచ్చాయి. ఈ సినిమా నిర్మాణాన్ని ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఫర్హాన్ అక్తర్ మొదలు పెట్టారు. అయితే ఈ మూవీ అప్డేట్ గురించి ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు ప్రియాంక సమాధానాలు దాటవేశారు. ఈ సినిమా గురించి తన వద్ద సమాచారం లేదంటూనే... ఈ ప్రాజెక్టుపై ఆశావాదంతో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. కాగా, అనేక ఇంటర్నేషనల్ కమిట్‌మెంట్స్ ఉన్నప్పటికీ బాలీవుడ్‌కి తిరిగి వస్తున్నానంటూ తన అభిమానులను ఆటపట్టిస్తూ 'ఇక్కడ ఎంతో మంది నిర్మాతలను కలుస్తుంటాను. స్క్రిప్ట్‌లను చదువుతున్నాను. హిందీలో ఏదైనా చేయాలనే అమితాసక్తితో ఉన్నాను' అని పేర్కొన్నారు. ప్రస్తుతం హాలీవుడ్‌లో సిటాడెల్ సీజన్-2తో పాటు 'ద బ్లఫ్', 'హెడ్స్ ఆఫ్ స్టేట్' చిత్రాల షూటింగ్ పూర్తి చేశారు.



బుధవారం అక్కినేని నాగచైతన్య, శోభిత వివాహబంధంతో ఒక్కటయ్యారు. అన్నపూర్ణ స్టూడియోలో ఏయన్నార్ విగ్రహం సమీపంలోనే వీరి వివాహం జరిగింది. వివాహానంతరం ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి తన ఆనందం వ్యక్తం చేసిన నాగార్జున తన తండ్రి ఏయన్నార్ విగ్రహం దగ్గర తమ కుటుంబ సభ్యులందరూ కలసి దిగిన ఫొటోని గురువారం షేర్ చేసి 'డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ, ఫ్యాన్స్.. మీ ప్రేమ, ఆశీస్సులు ఈ వేడుకను ప్రత్యేకం చేశాయి. నా కుమారుడి పెళ్లి కేవలం కుటుంబ వేడుకే కాదు.. మీ అందరి వల్ల అది ఎప్పటికీ మరిచిపోలేని జ్ఞాపకమైంది. అక్కినేని కుటుంబం తరఫున మీ అందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పుష్ప 2' చిత్రం గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్, సీఈవో చెర్రీ మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వెళ్లి ఆయన్ని కలిసిన దృశ్యం

దీపిక కాదు దిమ్రినే నంబర్ వన్!



'లైలా మజ్నూ', 'కళ' సినిమాల్లో కథానాయికగా నటించినా.. 'యానిమల్'లో చేసిన ఓ చిన్న పాత్రతో నేషనల్ వైడ్ సెన్సేషన్ అయ్యారు బాలీవుడ్ త్రిప్తి దిమ్రి. ఇటీవలే 'బ్యాడ్ న్యూజ్', 'విక్కీ విద్య కా వో వాలా వీడియో', 'భూల్ భూలయ్యా3' చిత్రాలతో ప్రేక్షకులను పలకరించారీ బ్యూటీ. తాజాగా, ఈ నటి ఓ అరుదైన గౌరవాన్ని పొందారు. ఐఎమ్‌డీబీ వెబ్‌సైట్, 2024లో అత్యంత ప్రజాదరణ పొందిన పది మంది భారతీయ స్టార్స్ లిస్టును ప్రకటించింది. ఇందులో త్రిప్తి మొదటి స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లిస్ట్‌లో రెండో స్థానంలో దీపిక పదుకొణే, తర్వాతి స్థానంలో 'ధడక్' ఫేమ్ ఇషాన్ కట్టర్, నాలుగో స్థానంలో షారుక్ ఖాన్, ఐదో స్థానంలో శోభిత ధూళిపాళ.. తొమ్మిదో స్థానంలో ఆలియా భట్, పదో స్థానంలో ప్రభాస్ ఉన్నారు.

ప్రేమకథ ప్రారంభం




శ్రీ లక్ష్మీనరసింహ ఆర్ట్స్ ప్రొడక్షన్ బేనర్‌లో దీపక్ సరోజ్ హీరోగా తన్నీరు హరిబాబు నిర్మిస్తున్న నూతన చిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సినిమాతో హరీశ్ గదగాని దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దీక్షిక, అనైరా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దర్శకుడు వేణు ఉడుగుల క్లాప్ కొట్టగా, సుజిత్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలిషాట్‌కి సందీప్ డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు హరీశ్ మాట్లాడుతూ 'ఇది కంప్లీట్ లవ్ జానర్ సినిమా. చిత్ర నిర్మాణాన్ని జనవరిలో మొదలుపెట్టి ఏప్రిల్‌లో ముగించేలా ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ' నేను మంచి కథ కోసం చూస్తున్నప్పుడు ఈ అవకాశం వచ్చింది. అనూప్ రూబెన్స్ మంచి సంగీతం అందిస్తున్నారు' అని చెప్పారు. నిర్మాత హరిబాబు మాట్లాడుతూ 'ఈ సినిమాతో నిర్మాతగా పరిచయం అవుతున్నాను కథ చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది' అని తెలిపారు. చిత్రంలో రఘుబాబు, హైపర్ ఆది, సత్య, రచ్చ రవి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపిస్తూ జి.చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 1న పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే..! ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు నమోదు చేయడాన్ని హరీశ్‌రావు సవాల్ చేస్తూ.. హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలను వినిపించారు. చక్రధర్‌గౌడ్, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాపింగ్ చేయించారని.. అతనిపై నిఘా ఉంచారని రెండుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. హరీశ్‌రావు ఎన్నికను సవాలు చేసిన చక్రధర్‌గౌడ్.. ఎలక్షన్ పిటిషన్(ఈపీ) దాఖలు చేశారని, అది ఆయన హక్కు అని.. తప్పు పట్టాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఫిర్యాదుదారు అలవాటుగా ఆరోపణలు చేసే స్వభావం ఉన్న వ్యక్తి అని హరీశ్‌రావు తరఫు న్యాయవాది పేర్కొనడాన్ని సిద్ధార్థ లూథ్రా తప్పుబట్టారు. ఎలక్షన్ పిటిషన్, ప్రస్తుత ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వేర్వేరు అంశాలని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల కేసు దర్యాప్తులో ఉన్నందున.. పిటిషనర్ అయిన హరీశ్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పించరాదని.. చక్రధర్‌గౌడ్ నవంబరు 23నే హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉండగా ఫిర్యాదుదారు, ఆయన కుటుంబ సభ్యులు, డ్రైవర్ ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయనే ఆరోపణలు టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం తీవ్రమైనవని.. పోలీసులను దర్యాప్తు చేసుకోనివ్వాలని పేర్కొన్నారు. చట్టబద్ధమైన వ్యవహారాల కోసం ఉపయోగించాల్సిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను, నిఘా పరికరాలను కొంత మంది ప్రైవేటు వ్యక్తుల లబ్ధికోసం చట్టవిరుద్ధమైన కార్యక్రమాల కోసం వినియోగించినట్లు ఫిర్యాదులున్నాయని.. ప్రస్తుత కేసులో సైతం బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర నిఘావర్గాలు ఫిర్యాదుదారు కుటుంబంపై నిఘా పెట్టారని.. దానిపై దర్యాప్తు జరగాలని తెలిపారు. "గోప్యత అనేది ప్రాథమిక హక్కు. చక్రధర్‌గౌడ్ విషయంలో ఆ హక్కు ఉల్లంఘనకు గురైంది. ఫోన్ ట్యాపింగ్ అవుతోందని యాపిల్ కంపెనీ నుంచి ఆయనకు ఈ-మెయిల్ వచ్చింది" అని కోర్టుకు వివరించారు. హరీశ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది జె.రాంచంద్రరావు వాదనలను వినిపిస్తూ.. రాజకీయ దురుద్దేశంతో, ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ఈ కేసు పెట్టారని ఆరోపించారు. పిటిషనర్‌పై ఎన్నికల్లో ఓడిపోయిన ఫిర్యాదుదారు అనేక ఆరోపణలు చేయడంతోపాటు ఎలక్షన్ పిటిషన్ వేశారని.. ఫోన్ ట్యాపింగ్ అయిందని హైకోర్టులో పిటిషన్ వేసి, ఆ తర్వాత ఉపసంహరించుకున్నారని గుర్తుచేశారు. ఇరువైపులా వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. పోలీసులు యథావిధిగా దర్యాప్తు చేసుకోవచ్చని.. పిటిషనర్‌ను అరెస్టు చేయరాదని పేర్కొంటూ.. విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.



కౌశిక్‌రెడ్డి అరెస్టు.. హైడ్రామా!

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి కారణమని ఫిర్యాదు చేసేందుకు బుధవారం కౌశిక్‌రెడ్డి బంజారాహిల్స్ ఠాణాకు చేరుకున్నారు. అదే సమయంలో సీఐ రాఘవేంద్ర తన వాహనంలో బయటకు వెళుతున్నారు. గమనించిన కౌశిక్‌రెడ్డి తన కారుతో సీఐ వాహనాన్ని అడ్డుకున్నాడు. తన ఫిర్యాదు స్వీకరించాలని కోరారు. ముఖ్యమైన పనిమీద బయటకు వెళుతున్నానని స్టేషన్‌లో మిగతా సిబ్బందికి ఫిర్యాదు ఇవ్వాలని సీఐ సమాధానమిచ్చినా కౌశిక్‌రెడ్డి వినిపించుకోలేదు. ఆయనతో వాగ్వావాదానికి దిగారు. దీనిపై సీఐ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 57,126(2), 127(2), 132, 224, 333, 451(3), 191(2) రెడ్ విత్ 190,3(5) కింద కేసులు నమోదు చేశారు. గురువారం ఉదయం పోలీసులు భారీ బందోబస్తుతో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన్ను, మరో 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు... విషయం తెలియడంతో కౌశిక్‌రెడ్డి ఇంటికి హరీశ్ రావు వెళ్లారు. మీ దగ్గర ఎఫ్ఐఆర్ ఉందా? నోటీసులు ఇచ్చారా? అని పోలీసులను హరీశ్ ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ ఉన్నందున నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పోలీసులు చెప్పారు. ఎఫ్ఐఆర్ చూపించాలని అడగగా.. ప్రస్తుతం తమ దగ్గర లేదని చెప్పిన పోలీసులు అక్కడి నుంచి హరీశ్‌ను అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో కౌశిక్ ఇంటివద్ద హరీశ్ అభిమానులు ఆందోళన చేయడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఇక కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి రాగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్ అరెస్టు విషయం తెలియడంతో పార్టీ శ్రేణులు అక్కడికి తరలి


గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వచ్చాయి. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని స్టేషన్ ముందు బైఠాయించారు. కాగా గచ్చిబౌలి పీఎస్‌లో ఉన్న హరీశ్‌ను కలిసేందుకు బీఆర్ఎస్ నేతలు తరలివచ్చారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు హరీశ్‌ను కలిశారు. రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లోని జగదీశ్వర్‌రెడ్డిని పలువురు నేతలు కలిశారు. హరీశ్‌ను కలిసిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టడం దారుణమన్నారు. ఉదయం నుంచి అరగంటకో సెక్షన్ మారుస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పల్లా, ఎర్రబెల్లి మాట్లాడుతూ రేవంత్ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలు నేరవేర్చడంలో విఫలమయ్యారని, దానిని ప్రశించినందుకు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాగా హరీశ్ అరెస్టును నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ కార్యకర్తలు దహనం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ జాతీయ రహదారిపై ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి, సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, హరీశ్ అరెస్టు చేశారని ఆరోపిస్తూ ఇందుకు నిరసనగా శుక్రవారం నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలు చేపట్టేందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది.

సైకో, ఫ్యాక్షనిస్టులా రేవంత్ తీరు

» పగ, ప్రతీకారంతో విపక్ష నేతలను టార్గెట్ చేస్తున్నారు: హరీశ్

హైదరాబాద్ సిటీ: 'సీఎం రేవంత్ రెడ్డి సైకోలా, ఫ్యాక్షనిస్టులా వ్యవహరిస్తున్నారు. పగ, ప్రతీకారంతో శాడిస్టిక్ ప్రెషర్‌తో పని చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టేందుకు లక్ష్యం చేసుకుంటున్నారు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీస్‌స్టేషన్లలో నమోదు కావడం లేదని, గాంధీభవన్‌లో తయారు చేస్తున్నారని విమర్శించారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ నుంచి విడుదలైన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడారు. మార్పు.. మార్పు.. అన్న రేవంత్.. నిర్బంధాలు, అక్రమ అరెస్టులు తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడదనే సంగతి సీఎం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదన్న విషయాన్ని పోలీసులూ గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన నడుస్తోందని విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడినైన తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారని రాహుల్ గాంధీ అడుగుతున్నారని.. మరి, తెలంగాణలో వాళ్ల పార్టీ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? అని మండిపడ్డారు. రేవంత్‌ను బాగుచేయాలని, లేదంటే సీఎంను మార్చాలని రాహుల్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏడాదిలో ఎన్నడైనా కేసీఆర్ పేరెత్తకుండా మాట్లాడారా? మీరు బూతులు తిడితే మేం భరించాలా? మీకు సూచనలివ్వాలా? అని రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని, 12 గంటలైనా మెజిస్ట్రేట్ ముందు ఎందుకు ప్రవేశపెట్టలేదు? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని విడుదల చేసే వరకు నిద్రపోమని, ఆయనకు అండగా ఉంటామన్నారు.

కోటి అబద్ధాల రేవంత్..?

నువ్వు ఆడపిల్లలను కోటీశ్వరులను చేస్తావా: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిది అబద్ధాల పాలన అని కేటీఆర్ మండిపడ్డారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లి కానుకలకు కోత పెట్టిన రేవంత్ మహిళలను కోటీశ్వరులను ఎలా చేస్తారంటూ గురువారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "మూసీలో ఆడబిడ్డల ఆశల గూడును నేలమట్టం చేస్తున్నావ్.. అర్ధరాత్రి ఆడబిడ్డ ఒంటిపై లాఠీ ఝళిపించడమే కాకుండా.. హైడ్రాతో బుచ్చమ్మను పొట్టనపెట్టుకున్నావ్.. కోటి అబద్ధాల రేవంత్‌రెడ్డీ నువ్వు ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తావా? తులం బంగారం అంటూ యువతులను వంచించావు. పేదింటి ఆడబిడ్డల కోసం కేసీఆర్ తీసుకొచ్చిన పెళ్లికానుక, గర్భిణుల న్యూట్రిషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాలను ఎత్తేసి వారి పట్ల నీ నిర్లక్ష్య వైఖరి ఏంటో తెలియచెప్పావు. నీ ఏడాది పాలనతో కోటి రతనాలవీణ తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడమే కాకుండా.. సంక్షేమ రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టావు. నెలకు రూ.2500పేరుతో చెవిలో పూలుపెట్టడంతోపాటు స్కూటీలిస్తానని కాలయాపన చేస్తున్నావు. బతుకమ్మ చీరలను బందుపెట్టిన కారణంగా బతుకమ్మను ఎత్తినచేతులే నీ భరతం పడతాయి." అంటూ కేటీఆర్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. మరోవైపు గురువారం కొచ్చిలో నిర్వహించిన టైకాన్ కేరళ అవార్డుల ప్రదానోత్సవంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. స్వతహాగా మలయాళీలది కష్టపడేతత్వం అని, ప్రపంచంలో ఎక్కడకెళ్లినా అది అర్థమవుతుందని అన్నారు. ప్రతి విషయంలోనూ రాష్ట్రాల మధ్య పోలికలు అవసరం లేదని, ఆయా రాష్ట్రాలకు తమ బలాలు, ప్రాధాన్యతలున్నాయని చెప్పారు. వాటి ఆధారంగా ముందుకు సాగాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

అల్లు అర్జున్‌పై కేసు

(మొదటిపేజీ తరువాయి)

రేవతి(39) అనే మహిళ మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ తొక్కిసలాటలో మరికొంతమందికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పోలీస్ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రీమియర్ షో వీక్షించడానికి హీరో అల్లు అర్జున్ వస్తున్నట్లు సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని.. హీరో థియేటర్‌లోకి ప్రవేశించడానికి అనువుగా ఉండేలా ప్రత్యేక ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయలేదని డీసీపీ తెలిపారు. అభిమానులను నియంత్రించే ఏర్పాట్లుగానీ.. ముందస్తుగా ప్రత్యేక భద్రతా చర్యలుగానీ తీసుకోలేదని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు భద్రతా సిబ్బందితో థియేటర్ వద్దకు వచ్చిన అల్లు అర్జున్ నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా సమీపంలోని క్రిస్టల్ హోటల్ నుంచి ఓపెన్ టాప్ కారులో అభివాదం చేసుకుంటూ లోపలికి వచ్చారని.. ఆయన్ను చూడటానికి, సెల్ఫీలు దిగడానికి అభిమానులు పెద్ద ఎత్తున ఎగబడటం, వందలాది మంది ఒక్కసారిగా చొచ్చుకు రావడంతో తొక్కిసలాట జరిగినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో మరణించిన రేవతి భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా.. రేవతి మృతదేహానికి గురువారం సాయంత్రం పోస్ట్‌మార్టం పూర్తయ్యిందని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామని వివరించారు.

పోలీసుల వైఫల్యంపై విమర్శలు

హీరో రాకపై తమకు ముందస్తు సమాచారం లేదని పోలీసులు చెబుతున్నప్పటికీ.. తాము సమాచారం ఇచ్చామని థియేటర్ సిబ్బంది చెబుతున్నట్టు సమాచారం. పుష్ప మొదటి భాగం విడుదల సమయంలో కూడా అల్లు అర్జున్ ఇలాగే ఓపెన్ టాప్ కారులో అందరికీ అభివాదం చేస్తూ థియేటర్‌కు వచ్చారని.. ఆ విషయం తెలిసీ పోలీసులు ఈసారి కనీస జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడికి ఉచిత వైద్యం, విద్య అందించాలని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, టికెట్ రేట్ల పెంపుపై హైకోర్టును ఆశ్రయించిన జర్నలిస్ట్ సతీశ్ కమాల్ డిమాండ్ చేశారు. ఇక.. సంధ్య థియేటర్‌లో వేసింది బెనిఫిట్ షో కాదని, అది ప్రాఫిట్ షో అని.. హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొద్దిసేపట్లో లోపలికి వెళ్లేవారే

మా అన్నయ్య కుమారుడు శ్రీతేజ్.. అల్లు అర్జున్‌కు వీరాభిమాని. ఇరవై రోజులుగా 'పుష్ప 2' సినిమా చూడాలని అడుగుతున్నాడు. దీంతో ప్రీవియర్ షోకు టిక్కెట్లు బుక్ చేసి తెచ్చుకున్నారు. బుధవారం రాత్రి 9.15 గంటలకు థియేటర్‌కు చేరుకున్నారు. మరో ఐదు నిముషాల్లో టిక్కెట్లు ఇచ్చి థియేటర్‌లోకి ప్రవేశించేవారే. కానీ.. అల్లు అర్జున్ అక్కడికి వచ్చాడని తెలియగానే థియేటర్ లోపల ఉన్నవారు బయటకు రావడానికి యత్నించారు. ఆ తొక్కిసలాటలో వదిన మృతి చెందింది. శ్రీతేజ్ ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. 72 గంటల తర్వాతే ఏదైనా చెబుతామని డాక్టర్లు చెబుతున్నారు.

- సంతోష్ (భాస్కర్ సోదరుడు)

విషమంగానే శ్రీతేజ్ పరిస్థితి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్‌కు కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స చేస్తున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితి ఇంకా ఆందోళనకరంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆస్పత్రికి తీసుకువచ్చేసరికి శ్రీతేజ్ శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నాడని.. దీంతో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేస్తున్నామని వైద్యులు వెల్లడించారు. బాలుడి మెదడు, వెన్ను భాగాలకు సీటీ స్కాన్ చేశామని, అవి సాధారణ స్థితిలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

'పుష్పా' అని పిలుచుకునేవాళ్లు!

హీరో అల్లు అర్జున్ అభిమాని శ్రీతేజ్ .. సినిమాకి వెళ్లి కన్నతల్లిని కోల్పోయి.. ఆస్పత్రిలో ఆందోళనకరస్థితిలో బాలుడు

- తొక్కిసలాట సమయంలో భర్తకు రేవతి ఫోన్
- తర్వాత స్విచాఫ్ రావడంతో అతడిలో కంగారు
- పోలీసుల సమాచారంతో ఆస్పత్రికి పరుగులు
- భార్య చనిపోయినట్టు తెలిసి కన్నీటి పర్యంతం

చాదర్‌ఘాట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభిమాన నటుడి సినిమా తొలి షో చూద్దామన్న చిన్నారి శ్రీతేజ్ ఆశ.. ఆ నిండు కుటుంబంలో తీరని విషాదం నింపింది! థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో కన్నతల్లి చనిపోయిందన్న విషయమైనా తెలియని ఆ బాలుడు.. అపస్మారక స్థితిలో ఆస్పత్రి మంచంపై చికిత్స పొందుతున్నాడు!! శ్రీతేజ్ తండ్రి భాస్కర్ ఒక బంగారం దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నారు. తల్లి రేవతి గృహిణి. శ్రీతేజ్ చెల్లెలు సాన్విక (7). వారు మూసారాం బాగ్‌లోని శాలివాహన నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. పిల్లలిద్దరూ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. చిన్నప్పటి నుంచీ అల్లు అర్జున్ సినిమాలను బాగా ఇష్టపడే శ్రీతేజ్.. పుష్ప సినిమా విడుదలైనప్పటి



ఇద్దరు పిల్లలతో భాస్కర్, రేవతి

నుంచి అవే హావభావాలను అనుకరించే వాడు. దాంతో.. కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు అంతా అతణ్ని ముద్దుగా 'పుష్పా' అని పిలిచేవారు. కుమారుడికి అల్లు అర్జున్ అంటే ఇంత ఇష్టం కావడంతోనే.. భాస్కర్ ఎంతో కష్టపడి సంధ్య థియేటర్‌లో పుష్ప-2 ప్రీమియర్ షో టికెట్లు తీసుకున్నారు. థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన సమయంలో భాస్కర్ సాన్విక చేతిని పట్టుకుని ఉండగా.. రేవతి శ్రీతేజ్ చేతిని పట్టుకుని ఉన్నట్టు సమాచారం. తోపులాటకు వీరు చెరోవైపునకూ వెళ్లిపోయారు. ఆ సమయంలో భర్తకు ఫోన్ చేసిన రేవతి.. తాను ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత కొద్దిసేపటికి భాస్కర్ మళ్లీ ఫోన్ చేసేసరికి ఆమె ఫోన్ స్విచాఫ్ వచ్చింది. 10-15 నిమిషాలపాటు ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో ఆయన ఆందోళనగా అటూఇటూ పరుగులు తీస్తూ భార్య, కుమారుడి కోసం గాలిస్తూ, అక్కడున్న పోలీసులకు విషయం తెలిపారు. పోలీసులు తమ ఫోన్‌లో ఉన్న బాలుడి ఫొటో చూపగా.. అది శ్రీతేజ్‌దేనని గుర్తించారు. స్పృహకోల్పోయిన తన భార్యని, కుమారుణ్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్టు తెలియగానే.. అక్కడికి పరుగు తీశారు. అక్కడికి వెళ్లే సరికే తన భార్య మరణించిందని.. ఆమె మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారని తెలిసి కన్నీరుమున్నీరయ్యారు. కాగా.. శ్రీతేజ్ అల్లు అర్జున్‌ను అనుకరిస్తూ చేసిన డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక.. రేవతి మృతితో శాలివాహన నగర్‌లోని వారి ఇంటివద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. ఒక్కక్షణంలో ఛిన్నాభిన్నమైన ఆ కుటుంబాన్ని తల్చుకుని అంతా కంటతడి పెడుతున్నారు. కొన్నాళ్ల క్రితం భాస్కర్ కాలేయం పాడైతే.. రేవతి తన కాలేయంలో కొంత భాగాన్ని ఇచ్చి భర్తను బతికించుకుందని కుటుంబసభ్యులు, తెలిసినవారు గుర్తుచేసుకుంటున్నారు.

అభ్యర్థుల్లో విశ్వాసం పెంపొందిస్తా..

» యూపీఎస్సీ మాదిరిగా టీజీపీఎస్సీని తీర్చిదిద్దుతా:బుర్రా వెంకటేశం

» కమిషన్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు



హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పట్ల అభ్యర్థుల్లో తిరిగి విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తానని కమిషన్ నూతన చైర్మన్ బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో ఆయన గురువారం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎప్పటికప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంతోపాటు భర్తీ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా చేపడతామని చెప్పారు. అభ్యర్థులు కమిషన్‌పై నమ్మకంతో పరీక్షలకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థుల్లో టీజీపీఎస్సీ పట్ల తిరిగి పూర్తి నమ్మకం ఏర్పడే విధంగా కృషిచేస్తానని వెల్లడించారు. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) మాదిరిగా టీజీపీఎస్సీని తీర్చిదిద్దుతానని చెప్పారు. కష్టపడి పబ్లిక్ సర్వెంట్‌గా మారిన తాను.. నిరుద్యోగ అభ్యర్థుల కోసం మూడున్నరేళ్ల సర్వీసుని వదులుకుని ఈ బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.

బుర్రా వెంకటేశం సేవలను కొనియాడిన గవర్నర్..

టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశంకు రాజ్‌భవన్‌లో గురువారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత తొమ్మిది నెలల్లో ముఖ్య కార్యదర్శి హోదాలో వెంకటేశం అందించిన సేవలను గవర్నర్ కొనియాడారు. విధినిర్వహణలో అంకితభావం, నాయకత్వ లక్షణాలను రాజ్‌భవన్ సిబ్బంది ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పారు.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఎస్.శ్రీధర్

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఎస్.శ్రీధర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. విద్యా శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ చైర్మన్‌గా వెళ్లడంతో ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలుగా విద్యాశాఖను అప్పగించింది.

మున్సిపాలిటీల్లో పంచాయతీల విలీనం ఆర్డినెన్స్ సబబే: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమీపంలో ఉన్న మున్సిపాలిటీల్లో గ్రామపంచాయతీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు సమర్థించింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి తదితర జిల్లాల్లో 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 2న ఆర్డినెన్స్-3 ని ప్రభుత్వం జారీచేసింది. ఈ ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో నాలుగు వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం కొట్టేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం ఆర్డినెన్స్‌లు జారీచేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది.

రేపు సరూర్‌నగర్‌లో బీజేపీ బహిరంగ సభ

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ శనివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరుకానుండడంతో రాష్ట్ర పార్టీ నాయకత్వం ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ఈ సభకు భారీ జన సమీకరణ చేస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఇంచార్జి సునీల్ బన్సల్ రెండురోజుల కిందట రాజధానితోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సభ నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 6 అబద్ధాలు, 66 మోసాలు అన్న నినాదంతో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని బీజేపీ నిర్ణయించింది.

జనగణనలో బీసీ కులగణన చేపట్టాల్సిందే

» జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో బీసీ నేతలు

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి నుంచి దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో బీసీ కులగణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల బీసీ నేతలు డిమాండ్ చేశారు. బీసీ కులగణన ద్వారానే దేశంలోని బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. కులగణన చేయకుండా జనగణన చేయాలని కేంద్రప్రభుత్వం చూస్తే అడ్డుకుని తీరుతామని ప్రకటించారు. గురువారం జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దేశ జనాభాలో 60శాతానికి పైగా ఉన్న ఓబీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా కల్పించకుండా కేంద్రప్రభుత్వం అన్యాయం చేస్తోందని చెప్పారు.బీసీ గణన చేపట్టడానికి కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టు మృతదేహాన్ని అప్పగించండి: హైకోర్టు

హైదరాబాద్/ములుగు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టు ఈగోలపు మల్లయ్య మృతదేహాన్ని ఆయన భార్య అయిలమ్మ, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌కు గురైన ఏడుగురి మృతదేహాల్లో ఆరు మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబాలకు పోలీసులు అప్పగించారు. అయితే.. తన భర్త మృతదేహంపై గాయాలున్నాయని.. ఇది కస్టోడియల్ మరణమంటూ పిటిషనర్ అయిలమ్మ పేర్కొనడంతో మల్లయ్య మృతదేహాన్ని భద్రపర్చాలని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. తాజాగా గురువారం ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించింది. పోస్ట్‌మార్టం నివేదిక, వీడియోలు, ఇతర వివరాలను దర్యాప్తు అధికారికి అందజేయాలని పేర్కొంటూ.. విచారణను 26కు వాయిదా వేసింది.

12 మందిని కాపాడేందుకు చేతులు కలిపిన భారత్-పాక్

- అరేబియా సముద్రంలో భారతీయ నావ మునక
- నావికులను కాపాడిన ఇరుదేశాల కోస్ట్‌గార్డ్స్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: ఉత్తర అరేబియా సముద్రంలో మునిగిపోతున్న ఓ నావ నుంచి 12 మంది భారతీయ నావికులను కాపాడేందుకు భారత్-పాక్ చేతులు కలిపాయి. ఇందుకోసం భారత కోస్ట్‌గార్డ్స్(ఐసీజీ), పాకిస్థాన్ సముద్ర భద్రత దళం(పీఎంఎస్‌ఏ) అరేబియా సముద్రంలో సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ వివరాలను ఐసీజీ అధికారులు గురువారం 'ఎక్స్'లో పంచుకున్నారు. బుధవారం గుజరాత్ తీరంలోని పోరుబందర్ నుంచి ఇరాన్‌కు బయలుదేరిన నావ.. ద్వారకకు పశ్చిమాన 270 కిలోమీటర్ల దూ రంలో.. పాకిస్థాన్ సెర్చ్ అండ్ రెస్క్యూ(ఎస్‌ఏఆర్) ప్రాదేశిక జలాల్లోకి వెళ్లగానే ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. దాంతో నావ మునిగిపోతుండడంతో.. ముంబైలోని మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్(ఎంఆర్‌సీసీ)కు ఎమర్జెన్సీ కాల్ అందింది. ఎంఆర్‌సీసీ నుంచి గాంధీనగర్‌లోని కోస్ట్‌గార్డ్స్ వాయవ్య విభాగం ప్రధాన కార్యాలయం, పాకిస్థాన్ ఎంఎస్‌ఏకు సందేశాలు వెళ్లాయి. కోస్ట్‌గార్డ్స్ అధికారులు ఐసీజీఎస్-సార్థక్‌ను రంగంలోకి దింపారు. ఆలోగా పీఎంఎస్‌ఏ సిబ్బంది హెలికాప్టర్ ద్వారా గాలింపు చేపట్టి, మునుగుతున్న నావను గుర్తించారు. వాణిజ్య నౌక ఎంవీ-కాస్కోగ్లోరీ సిబ్బంది కూడా నౌకను గుర్తించడంలో సాయపడ్డారు. భారత కోస్ట్‌గార్డ్స్ సమయానికి అక్కడికి చేరుకుని, నౌకలోని 12 మందిని కాపాడారు.

యూకేలో జంక్‌ఫుడ్‌పై టీవీ ప్రకటనలు బంద్!

లండన్, డిసెంబరు 5: ఊబకాయంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య దేశంలో రోజురోజుకి అధికమవుతున్న వేళ యూకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జంక్ ఫుడ్‌గా పరిగణించే పిజ్జా, బర్గర్, పేస్ట్రీ, వాఫీ, ప్యాన్ కేక్, ఫ్రెంచ్ ఫ్రైస్ తదితర ఆహార పదార్థాలు, శీతలపానీయాల ప్రకటనలను టీవీల్లో పగటి పూట ప్రసారం చేయడంపై నిషేధం విధించింది. ఆయా ప్రకటనలను రాత్రి తొమ్మిది గంటల తర్వాతే ప్రసారం చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఈ ఆంక్షలను అమలు చేయనుంది. అయితే, ఈ నిషేధం కేవలం జంక్ ఫుడ్‌పై మాత్రమే కానీ ఆహారాన్ని సరఫరా చేసే రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలకు వర్తించదు. ఆయా ప్రకటనలను పిల్లలు చూడకుండా చెయ్యడంవల్ల వారిని జంక్ ఫుడ్‌కు కాస్త దూరం చెయ్యవచ్చనేది ప్రభుత్వ ఆలోచన.

బంగ్లాలో కొత్త కరెన్సీ.. మరో 6 నెలల్లో అమల్లోకి..

- జాతిపిత ముజీబ్ చిత్రం లేకుండా కొత్త నోట్ల ముద్రణ

ఢాకా, డిసెంబరు 5: బంగ్లాదేశ్‌లో మరో 6 నెలల్లో కొత్త కరెన్సీ అమల్లోకి రాబోతోంది. ఇప్పటికే కొత్త నోట్ల ముద్రణను అక్కడి మధ్యంతర ప్రభుత్వం ప్రారంభించింది. మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి, బంగ్లా జాతిపితగా పిలిచే షేక్ ముజీబ్ ఉర్ రహ్మాన్ చిత్రం కరెన్సీపై తొలగించే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. నాలుగు నెలల కింద హసీనాపై చేపట్టిన తిరుగుబాటుకు సంబంధించిన చిత్రాలతో పాటు మతపర నిర్మాణాలు, బెంగాలీ సంప్రదాయానికి సంబంధించిన చిత్రాలనూ కొత్త నోట్లపై ముద్రిస్తున్నారు. ముందుగా 20, 100, 500, 1000 నోట్లను ముద్రిస్తున్నామని.. వాటిపై బంగా బంధు షేక్ ముజీబ్ చిత్రం ఉండదని బంగ్లా సెంట్రల్ బ్యాంకు తెలిపింది. వచ్చే 6 నెలల్లో కొత్త కరెన్సీ అమల్లోకి రావచ్చని బంగ్లాదేశ్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హుస్నేరా శిఖా వెల్లడించారు.

దాడులపై సమాచారం ఇవ్వండి: యూనస్

బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న దాడులపై తాత్కాలిక ప్రభుత్వ నాయకుడు మహమ్మద్ యూనస్ స్పందించారు. ముస్లిం, హిందూ, బౌద్ధ, క్రైస్తవ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. దేశంలో జరుగుతున్న దానికి.. విదేశీ మీడియా చూపుతున్న దానికి చాలా వ్యత్యాసం ఉందని చెప్పారు. ఇటు అధికారుల ద్వారా కూడా తమకు కచ్చితమైన సమాచారం అందట్లేదన్నారు. ఏదేమైనా దేశంలోని పౌరులందరికీ సమాన హక్కులున్నాయని.. మైనార్టీలపై దాడులు జరిగితే ప్రభుత్వం దృష్టికి తేవాలని యూనస్ కోరారు. బాధ్యులను చట్టం ముందు నిలబెడతామని హామీనిచ్చారు. మరోవైపు.. మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రసంగాలను ప్రసారం చేయకూడదంటూ బంగ్లాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (ఐసీటీ) నిషేధం విధించింది. ఆమె చేసే విద్వేషపూరిత ప్రసంగాలను ప్రధాన స్రవంతి మీడియాలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ ప్రసారం చేయకూడదని ఆదేశించింది.

ఇజ్రాయెల్ డ్రోన్లలో పిల్లల ఏడుపు శబ్దాలు

- విని బయటకువచ్చిన పాలస్తీనా ప్రజలపై ఆ దేశం దాడులు
- సంచలన వీడియో విడుదల చేసిన 'అల్ జజీరా'

గాజాస్ట్రిప్, డిసెంబరు 5: గాజాపై ఇజ్రాయెల్ సరికొత్త తరహా డ్రోన్లను ప్రయోగిస్తున్నదనీ, దానివల్ల జన నష్టం అపారంగా పెరిగిపోతోందనీ 'అల్ జజీరా' అనే చానల్ ఒక కథనం ప్రసారం చేసింది. దీనిపై ఒక వీడియోను విడుదల చేసింది. పిల్లల ఏడుపులను, మహిళల అరుపులను పోలిన శబ్దాలను చేసేలా ఈ డ్రోన్లను (క్వాడ్‌కాప్టర్లు) తయారుచేశారని తెలిపింది. ఆ డ్రోన్లనుంచి వచ్చే కేకలు విని తమ ఇళ్లనుంచి, శరణార్థి శిబిరాలు, వైద్య క్యాంపుల నుంచి గుంపులుగా బయటకువచ్చే పౌరులపై అవి బాంబుల వర్షం కురిపిస్తున్నాయని ఈ చానల్ సంచలన ఆరోపణలు చేసింది. పాలస్తీనీయన్లను ఈ విధంగా ఏమార్చి పెద్దఎత్తున వారిని ఇజ్రాయెల్ హత్య చేస్తోందని హక్కుల పర్యవేక్షకురాలు మహా హుస్సేనీ.. అల్ జజీరా విడుదల చేసిన ఆ వీడియోలో మాట్లాడటం వినిపించింది. మరోవైపు.. గాజాలో సేఫ్‌జోన్‌లో ఉన్న ఓ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 21 మంది పౌరులు మరణించారు. పరదాల కింద వీరికోసం క్యాంపును నిర్వహిస్తున్న దక్షిణ గాజాలోని ఆస్పత్రి యాజమాన్యం ఈ దాడిని ధ్రువీకరించింది. ఆకాశంనుంచి కురిసిన బాంబులవర్షానికి పరదాలకు మంటలు అంటుకుని.. అందులోని బాధితులు కాలిపోయారు.

ద్విదేశ విధానమే పరిష్కారం: జైశంకర్

న్యూఢిల్లీ, డిసెంబరు 5: పాలస్తీనాకు భారత్ నుంచి ఇతోధికంగా మానవతా సాయం అందుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రాజ్యసభలో తెలిపారు. ఇజ్రాయెల్- పాలస్తీనా సమస్యకు ద్విదేశ విధానమే పరిష్కారమన్న పాత వైఖరినే ఆయన పునరుద్ఘాటించారు. ఉగ్రవాద దాడులకు గురయిన ఇజ్రాయెల్‌కు దాడి చేసే హక్కు ఉన్నదని స్పష్టం చేశారు. భారత్ స్వయంగా ఉగ్రవాద బాధిత దేశం అనేది మరవరాదన్నారు. అదే సమయంలో మానవతా సంక్షోభానికి తన చర్యలు దారితీయకుండా ఇజ్రాయెల్ విచక్షణను ప్రదర్శించాల్సి ఉందని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే సహా పలువురు ప్రతిపక్ష పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా స్పందించారు.

సీఎంగా ఫడణవీస్ ప్రమాణం

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి

- డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే అజిత్ పవార్ ప్రమాణం



ఫడణవీస్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ

ముంబై, డిసెంబరు 5: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు, వేలాదిమంది జనం మధ్య మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణం చేశారు. గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఫడణవీస్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే (60), అజిత్‌పవార్ (65) ప్రమాణం చేశారు. శిందే ప్రమాణం చేయటానికి ముందు.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రేలకు కృతజ్ఞతలు తెలుపుతూ కొద్దిసేపు ఉపన్యసించారు. గవర్నర్ ప్రమాణం చేయించడానికి ఉద్యుక్తులవటంతో.. ప్రసంగాన్ని ఆపి ప్రమాణం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంల ప్రమాణంతో.. రెండు వారాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ ముగ్గురు మినహా మిగిలిన మంత్రులు ఎవరూ ప్రమాణ స్వీకారం చేయలేదు. శాసనసభ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందే మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. ఈ నెల 23న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ-శివసేన-ఎన్సీపీ కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నప్పటికీ.. సీఎం పదవి కోసం ఏక్‌నాథ్ శిందే పట్టుబట్టటంతో సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే. పలు పర్యాయాల సంప్రదింపులు, చర్చల అనంతరం శిందే.. బీజేపీకే సీఎం పదవి ఇవ్వటానికి అంగీకరించారు. 54 ఏళ్ల ఫడణవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయటం ఇది మూడోసారి. 2014లో తొలి పర్యాయం ఐదేళ్లపాటు సీఎంగా పదవిలో కొనసాగిన ఆయన, 2019లో రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినప్పటికీ.. ఉద్ధవ్ ఠాక్రే మద్దతు ఉపసంహరణతో ఐదు రోజుల్లోనే రాజీనామా చేశారు. శిందే మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి సీఎం పదవి చేపట్టడం మహారాష్ట్రలో ఇదే ప్రథమం.

పలువురు ప్రముఖుల హాజరు

ఫడణవీస్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీతోపాటు కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్‌గడ్కరీ, జేపీనడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, నితీశ్ కుమార్, హిమంతబిశ్వ శర్మ, మోహన్ యాదవ్, ప్రమోద్ సావంత్, నాయబ్‌సింగ్ సైనీ, భూపేంద్ర పటేల్, పుష్కర్‌సింగ్ ధామి హాజరయ్యారు. వీరితోపాటు బాలీవుడ్ ప్రముఖులు షారూక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రణ్‌బీర్‌కపూర్, మాధురీదీక్షిత్, సంజయ్‌దత్, పారిశ్రామికవేత్తలు ముఖేశ్ అంబానీ, నోయల్ టాటా, అనిల్ అంబానీ, కుమారమంగళం బిర్లా, దిలీప్ సాంఘ్వీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తదితరులు హాజరయ్యారు. ప్రముఖ ప్రతిపక్షనేతలెవరూ ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 'త్రిమూర్తులు' దక్షిణ ముంబయిలోని రాష్ట్ర సచివాలయమైన 'మంత్రాలయ'కు వెళ్లారు. ఈ సందర్భంగా ఫడణవీస్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం పారదర్శకతతో పనిచేస్తామని చెప్పారు. వేధింపు రాజకీయాలకు పాల్పడబోమని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యుల సంఖ్య తగ్గడంపై మాట్లాడుతూ రాష్ట్రంలోని రాజకీయ సంస్కృతిలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీల మధ్య రాజకీయ సంభాషణలు జరుగుతుండాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. "ఈ నూతన బృందం అనుభవం, ఉత్సాహాల మేలు కలయిక. ఈ బృందం సమష్టి కృషి కారణంగానే మహారాష్ట్రలో మహాయుతి చరిత్రాత్మక విజయం సాధించింది" అని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తుందని, సుపరిపాలన సాగేలా భరోసా కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు కేంద్రం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత ఏక్‌నాథ్ శిందే విడిగా విలేకరులతో మాట్లాడుతూ ఇంతవరకు తాను సాధారణ వ్యక్తి.. ('కామన్ మ్యాన్-సీఎం)గా పని చేశానని, ఇకపైనా దాన్ని కొనసాగిస్తానని చెప్పారు.

లోకం తీరు



భారత్‌లో పెట్టుబడులు లాభదాయకం

- మోదీ 'మేక్ ఇన్ ఇండియా' భేష్: పుతిన్



మాస్కో, డిసెంబరు 5: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన 'భారతదేశమే ముందు(ఇండియా ఫస్ట్)', 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. బుధవారం మాస్కోలో నిర్వహించిన 15వ వీటీబీ రష్యా కాలింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం లాభదాయకమన్నారు. భారత్‌లో తయారీరంగ పరిశ్రమల ఏర్పాటుకు రష్యా కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' అనేది రష్యాకు చెందిన 'ఇంపోర్ట్ సబ్‌స్టిట్యూషన్ ప్రోగ్రాం' లాంటిదేనని వివరించారు. 'ఇలాంటి కార్యక్రమాన్నే మేక్ ఇన్ ఇండియా పేరిట మోదీ ప్రారంభించారు. భారత్‌లో తయారీ కార్యకలాపాలు చేపట్టేందుకు మనం కూడా సిద్ధంగా ఉన్నాం. భారత్‌లో పెట్టుబడులు పెట్టడం లాభదాయకమని మేం భావిస్తున్నాం' అన్నారు. రష్యా ఇంధన దిగ్గజం రోజ్‌నెఫ్ట్ ఇటీవలే భారత్‌లో రూ.1.70 లక్షల కోట్లు(20 బిలియన్ డాలర్లు) పెట్టుబడిపెట్టిన విషయాన్ని పుతిన్ ప్రస్తావించారు. ఉత్పత్తి రంగం వృద్ధి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత స్థానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం అనుకూల పరిస్థితులను సృష్టించడంలో భారత ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

(మొదటి పేజీ తరువాయి)

నచ్చిన సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) చేయవచ్చు. ఉదాహరణకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థి డిగ్రీలో బీకామ్ చేరవచ్చు. అయితే, ఇలా వేరే కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు సంబంధిత ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వడం తప్పనిసరి. ఇక, ఉన్నత విద్యా సంస్థలు ఏడాదికి రెండు సార్లు.. జూలై-ఆగస్టు లేదా జనవరి- ఫిబ్రవరిలో తాము నిర్వహిస్తున్న కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించవచ్చు. ఈ విధానం వల్ల ఓ విద్యార్థి ఒకేసారి రెండు యూజీ లేదా రెండు పీజీ కోర్సులు చదువుకోవచ్చు. ఒకేసారి రెండు కోర్సులు అభ్యసించే వారి కనీస హాజరు శాతం(అటెండెన్స్) లెక్కింపు అంశంపై సంబంధిత ఉన్నత విద్యా సంస్థలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, సంబంధిత అధీకృత సంస్థల ఆమోదంతోనే ఈ విధానాన్ని అమలు చేయాలి. ఇక, ఓ విద్యార్థి యూజీ డిగ్రీ పొందాలంటే సంబంధిత కోర్సులోని ప్రధాన సబ్జెక్టులో కనీసం 50 శాతం క్రెడిట్ మార్కులు పొందాలి. మిగిలిన 50 శాతం క్రెడిట్లను విద్యార్థి ఇతర కోర్సుల్లో చూపించిన నైపుణ్యం, అప్రెంటిస్‌షిప్ తదితర అంశాల ఆధారంగా కేటాయిస్తారు.



కోర్సు గడువు తగ్గింపు లేదా పొడిగింపు

యూజీ డిగ్రీ విద్యార్థులు తమ కోర్సు కాలాన్ని పొడిగించుకునేందుకు లేదా తగ్గించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఈ ముసాయిదాలో ఓ కొత్త విధానాన్ని ప్రతిపాదించారు. ఇందుకోసం యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ) అనే విధానాలను యూజీసీ తీసుకొచ్చింది. ఎవరైనా విద్యార్థి నిర్ణీత సమయం కంటే ముందుగానే తన కోర్సును పూర్తి చేయాలనుకుంటే ఏడీపీని ఎంచుకోవచ్చు. మొదటి లేదా రెండో సెమిస్టర్ లోపే ఈ నిర్ణయం తీసుకోవాలి. కోర్సు నిడివిని పొడిగించుకోవాలని అనుకునేవారు ఈడీపీని ఎంచుకోవచ్చు. ఏడీపీ, ఈడీపీలో ఉన్న వారందరికీ పాఠ్య ప్రణాళికల్లో ఎలాంటి మార్పులు ఉండవు. అయితే, ఏడీపీ, ఈడీపీలో దేనినైనా విద్యార్థి ఎంచుకుని కోర్సు పూర్తి చేస్తే మాత్రం సర్టిఫికెట్లలో ఆ అంశం ఉంటుంది. ఇక, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ (ఆనర్స్, రీసెర్చ్‌తో సహా ఆనర్స్) పూర్తి చేసిన వారే ఎంఈ, ఎంటెక్ వంటి అడ్వాన్స్‌డ్ పీజీ కోర్సులకు అర్హులవుతారని యూజీసీ ప్రతిపాదించింది. కాగా, ఈ ముసాయిదా అమలు ఉన్నత విద్యాసంస్థల సంసిద్ధతపై ఆధారపడి ఉంటుందని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ వెల్లడించారు. 2020 జాతీయ విద్యా విధానం సూచనల మేరకు విద్యార్థులు వివిధ రకాల కోర్సులు చదువుకునేందుకు వీలు కల్పించడమే ముసాయిదా ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

నాసా చీఫ్‌గా వ్యాపారవేత్త ఐజాక్‌మ్యాన్

ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 5: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తాను అధికారం చేపట్టే లోపు కీలక పోస్టులను భర్తీ చేస్తున్నారు. అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా'కు తదుపరి చీఫ్‌గా ప్రైవేట్ వ్యోమగామి, వ్యాపారవేత్త జారెడ్ ఐజాక్‌మ్యాన్‌ను ప్రకటించారు. ఈ నియామకం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్‌తో ఐజాక్‌మ్యాన్‌కు వ్యాపార సంబంధాలు ఉండటమే విమర్శలకు కారణం. మస్క్ స్పేస్ ఎక్స్ ప్రోగ్రామ్‌కు ఐజాక్‌మ్యాన్ పెద్ద మద్దతుదారుడే కాకుండా అందులో పెట్టుబడి కూడా పెట్టారు. అయితే 41 ఏళ్ల ఐజాక్‌మ్యాన్ ప్రైవేట్ వ్యోమగామిగా, విజయవంతమైన వ్యాపారవేత్తగా గుర్తింపు పొందారు.

ప్రోబా-3 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

18 నిమిషాల్లో కక్ష్యలోకి చేర్చిన పీఎస్ఎల్వీ-సీ59



సూళ్లూరుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉపగ్రహాలను సురక్షితంగా కక్ష్యలోకి చేరుస్తూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తనకంటూ ఒక బ్రాండ్‌ను సృష్టించుకున్న ఇస్రో ఖాతాలో మరో ఘన విజయం వచ్చి చేరింది. తన విజయాశ్వం పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా ఇస్రో గురువారం చేపట్టిన ప్రోబా-3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన రెండు ఉపగ్రహాలతో కూడిన ప్రోబా-3ను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ59 దాన్ని సురక్షితంగా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. వాస్తవానికి ఈ ప్రయోగాన్ని బుధవారమే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. ప్రయోగానికి గంట ముందు రాకెట్‌కు అనుసంధానం చేసిన ఉపగ్రహంలో సాంకేతిక సమస్యను గుర్తించడంతో.. గురువారానికి వాయిదా వేశారు.

నేనూ రోడ్డు ప్రమాద బాధితుడినే

- చట్టం అంటే ప్రజల్లో భయం లేదు: గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 5: దేశంలో రోడ్డు ప్రమాదాల బాధితుల సంఖ్య పెరుగుతోందని, ఇందుకు ప్రజల్లో చట్టం అంటే భయమూ భక్తీ రెండూ లేకపోవడమే కారణమని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తాను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినేనని, అందువల్లనే వీటిపై స్పందించే తత్వంతో వ్యవహరిస్తుంటానని చెప్పారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అంటే భయము, భక్తి లేకపోవడం సమాజంలో పెద్ద సమస్యగా మారిందన్నారు. ఎర్ర సిగ్నల్ వద్ద ఆగకపోవడం, హెల్మెట్లు ధరించకపోవడంవంటి సమస్యలు ఈ కారణంగానే తలెత్తుతున్నాయని అన్నారు. హెల్మెట్లు ధరించని కారణంగానే 30వేల మంది చనిపోతున్నారని చెప్పారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఈ ఏడాది 1.68 లక్షల ప్రమాదాలు జరిగాయని తెలిపారు.

అదానీపై ఆగని రగడ!

- పార్లమెంటు ఆవరణలో విపక్షాల వినూత్న నిరసన
- జేపీసీ వేయాలని డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అదానీ ముడుపుల వ్యవహారంపై విపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. అమెరికా చేసిన ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాల్సిందేనని గురువారం సైతం కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు వినూత్న నిరసన చేపట్టారు. 'మోదీ అదానీ ఏక్ హై.. అదానీ సేఫ్ హై' అనే నినాదంతో ఉన్న జాకెట్లు, టీషర్టులు ధరించి ఆందోళన చేశారు. మోదీ, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో సహా కాంగ్రెస్‌తోపాటు విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ఇందులో పాల్గొన్నారు. ఇటు లోక్‌సభలోనూ విపక్షాల ఆందోళనలు కొనసాగాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. తొలుత సభలో రాహుల్ మాట్లాడుతూ.. అదానీపై మోదీ విచారణ జరపలేరని.. అదానీపై విచారణ జరపడమంటే మోదీ తనపై తానే చేసుకున్నట్లుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. దీనిపై అధికార పక్ష ఎంపీలు పెద్దఎత్తున అభ్యంతరం తెలిపారు. ఇంతలోనే స్పీకర్ ఓం బిర్లా కలుగజేసుకుని మకర ద్వారం వద్ద విపక్షాల ఆందోళనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్షాల తీరుపై పార్లమెంటరీ పార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా మండిపడ్డారు. రాహుల్ తీరుపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్‌గాంధీ దేశ ద్రోహి అని ఆ పార్టీ ఎంపీలు నిషికాంత్ దూబే, సాంబిత్ పాత్రా మండిపడ్డారు. పార్లమెంట్ కార్యకలాపాలకు విపక్షాలు అంతరాయం కలిగిస్తున్నాయంటూ బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రాహుల్‌పై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. కొత్త బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం.. హిందీ రాని వారిపై కూడా ఆ భాషను రుద్దడమేనంటూ రాజ్యసభలో కేంద్రంపై విపక్ష సభ్యులు మండిపడ్డారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రవేశపెట్టిన 'భారతీయ వాయుయాన్ విధేయక్-2024' బిల్లుపై గురువారం చర్చ జరిగింది.

రీజినల్ రింగ్ రోడ్డుపై దృష్టి!

త్వరగా అందుబాటులోకి తెచ్చేలా కృషి.. చారిత్రక కట్టడాలను పునరుద్ధరిస్తున్నాం

ఆర్ అండ్ బీ ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వ నివేదిక

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. మండల, జిల్లా కేంద్రాల నుంచి రాజధాని హైదరాబాద్‌కు రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయడంతోపాటు రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం 2024-25 బడ్జెట్‌లో ఆర్అండ్ బీ శాఖకు రూ.7,490కోట్లను కేటాయించగా.. ఇందులో ఔటర్ రింగు రోడ్డుకు రూ.200 కోట్లు, ఆర్‌ఆర్‌ఆర్ భూ పరిహారం వాటా కోసం రూ.1,500కోట్లను కేటాయించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం పేర్కొంది. ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన ఏడాది ప్రగతి నివేదికను విడుదల చేసింది.

నివేదికలోని ముఖ్యాంశాలు..

"గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో విఫలమైంది. ఫలితంగా రీజినల్ రింగు రోడ్డు సహా వివిధ ప్రాజెక్టుల నిర్మాణాల్లో జాప్యం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పలుమార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఫలితంగా హైదరాబాద్- విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిపై గుర్తించిన 17 బ్లాక్ స్పాట్ల మరమ్మతులకు రూ.422.12 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. జాతీయ రహదారి(ఎన్‌హెచ్)-353సీ లో సిరొంచ-ఆత్మకూర్ భాగానికి రూ.662.67 కోట్లు, నల్లగొండ పట్టణం వెలుపల ఎన్‌హెచ్.- 565 పై నకిరేకల్ - నాగార్జునసాగర్ వరకు నిర్మిస్తున్న 14 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.516.17 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులను పట్టాలెక్కించడంతోపాటు దక్షిణ భాగం డీపీఆర్ రూపొందించేందుకు టెండర్లు పిలిచాం. త్వరలోనే దీని నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం కింద రూ.850 కోట్ల విలువైన 435.29 కి.మీ పొడవైన 31 పనులను మంజూరు చేయించుకోవడంలో సఫలమయ్యాం" అని ప్రభుత్వం పేర్కొంది. అలాగే, రహదారుల నిర్మాణానికి ప్రణాళిక, ప్రణాళికేతర నిధుల కింద రూ.3,725.22 కోట్ల మేరకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు నివేదికలో వెల్లడించింది. ఈ నిధులతో కొత్తగా 769.35 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు పేర్కొంది. అలాగే, హెరిటేజ్ భవనాల మరమ్మతులు, నూతన భవనాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్ అండ్ బీ ప్రయత్నిస్తోందని తెలిపింది. ఇందులో భాగంగా శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక మహబూబియా హాల్‌ను శాసనమండలిగా మార్చేందుకు రూ.49 కోట్లతో పునరుద్ధరణ పనులు ఆగాఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాగుతున్నట్లు వెల్లడించింది. రాజ్‌భవన్ ప్రాంగణంలోని మరో చారిత్రక కట్టడం షామంజిల్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లా కేంద్రాల్లో కోర్టు కాంప్లెక్సుల నిర్మాణానికి రూ.1,053 కోట్లు కేటాయించగా.. రూ.972 కోట్ల పనులకు అనుమతులను మంజూరు చేసినట్లు వివరించింది. నల్లగొండ, కోదాడ నియోజకవర్గాల్లో రూ.20 కోట్లతో స్కిల్ యూనివర్సిటీ భవనాలు, కొడంగల్, మంథని, కోదాడ, హుజూర్‌నగర్‌లో రూ.27.30 కోట్లతో ఆర్ అండ్ బీ అతిథి గృహాలను నిర్మిస్తున్నట్లు తెలిపింది. వరంగల్‌లో మామునూర్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి 253 ఎకరాల సేకరణకు రూ.205 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

తెలంగాణలో పదేళ్లలో 44 ఎన్‌కౌంటర్లు

- 96 మంది మావోయిస్టుల మృతి

హైదరాబాద్,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం తర్వాత.. ఈ పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన 44 ఎన్‌కౌంటర్లలో 96 మంది మావోయిస్టులు మృతి చెందారు. రాష్ట్రం ఏర్పాటైన మొదటి సంవత్సరం నాలుగు సార్లు పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగినా.. మరణాలు నమోదు కాలేదు. 2015 నుంచి తాజాగా ఏటూరు నాగారం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోయిస్టుల వైపు ప్రాణనష్టం సంభవించింది. ఈ సంవత్సరం ఆరంభం నుంచి.. అత్యధికంగా 22 మంది మావోయిస్టులు మరణించారు. ఈ పదేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీకి చెందిన నలుగురు సభ్యులు ఉన్నారు.

పటిష్ఠ నిఘా

తెలంగాణలో మావోయిస్టుల కదలికలపై పటిష్ఠంగా నిఘా కొనసాగుతోంది. 21 కంపెనీల కేంద్ర బలగాలతో పాటు.. యాంటీ-మావోయిస్టు దళం గ్రేహౌండ్స్ బృందాలు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న జిల్లాల పోలీసులు, స్పెషల్ పార్టీలు నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. కేంద్ర నిఘా సంస్థ(ఐబీ)తోపాటు.. తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పొరుగు రాష్ట్రాల నిఘా వర్గాల సమాచారంతో క్షేత్రస్థాయి ఆపరేషన్ బలగాలు ఎప్పటికప్పుడు అప్రమత్తమవుతున్నాయి. రాబంధులను కూడా నక్సల్స్‌పై నిఘాకు ఉపయోగిస్తున్నారు.

కృష్ణా జలాలపై విచారణలో జాప్యం వద్దు!

- వెంటనే వాదనలు ప్రారంభించాలి
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను కోరిన తెలంగాణ
- నేడు ముగియనున్న క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీపై విచారణలో జాప్యం లేకుండా వెంటనే వాదనలు ప్రారంభించడానికి అవకాశం ఇవ్వాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను తెలంగాణ కోరింది. ఈ మేరకు గురువారం ట్రిబ్యునల్‌లో దరఖాస్తు దాఖలు చేసింది. దీనికి తెలంగాణ నుంచి ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్.వైద్యనాథన్, వి.రవీందర్‌రావు, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ కుష్వీందర్ వోహ్రా, హైడ్రాలజీ నిపుణుడు చేతన్ పండిట్‌లు హాజరయ్యారు. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాదులు జయదీప్ గుప్తా, ఉమాపతి హాజరయ్యారు. ఇక శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై ఏపీ దాఖలు చేసిన అఫిడవిట్‌లో గురువారం ఏపీ తరఫు సాక్షి ఏకే గోయల్‌ను సీనియర్ న్యాయవాదులు సీఎస్ వైద్యనాథన్, రవీందర్‌రావులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. కృష్ణా బేసిన్ పరిధిలో ఉన్న అన్ని రిజర్వాయర్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌ను సిద్ధం చేయాల్సిందేనా? అని తెలంగాణ న్యాయవాదిని ప్రశ్నించగా.. చేయాల్సిందేనని చెప్పారు. 'బచావత్ ట్రిబ్యునల్ గంపగుత్త కేటాయింపులు చేసిందా? లేదా? లేక ప్రాజెక్టుల వారీగా, రాష్ట్రాల వారీగా చేసిందా? మీ అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు ఉన్నాయి' అని ప్రశ్నించగా.. గంపగుత్త కేటాయింపులు చేసిందని, ప్రాజెక్టుల వారీగా ఇదివరకే ఉన్న వినియోగానికి బచావత్ ట్రిబ్యునల్ రక్షణ కల్పించిందని గోయల్ బదులిచ్చారు. కామన్ రిజర్వాయర్లకు 520 టీఎంసీల నీటి అవసరాలు తీర్చడానికి జూరాల నుంచి 342 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు కదా? గోదావరి నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల నీటిని పరిగణనలోకి తీసుకున్నాకే ఈ లెక్కలు చెబుతున్నారా? అని ప్రశ్నించగా.. పోలవరం (గోదావరి) నుంచి కృష్ణా డెల్టాకు తరలించే నీటిని పరిగణనలోకి తీసుకోలేదని గోయల్ తెలిపారు. ఇక ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై క్రాస్ ఎగ్జామినేషన్‌ను పొడిగించరాదని తెలంగాణ నిర్ణయించడంతో శుక్రవారం పూర్తికానుంది.

'ఎక్స్' డీపీ మార్చిన సీఎం రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి తన ఎక్స్(ట్విటర్) ఖాతా డీపీ(డిస్‌ప్లే పిక్చర్)ని గురువారం మార్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి కాగడా పట్టుకున్న ఫొటోను ఇన్నాళ్లూ డీపీగా ఉంచిన సీఎం రేవంత్ ఇప్పుడు ఆ స్థానంలో 'తెలంగాణ రైజింగ్' లోగోను పెట్టారు. పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా.. రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఎదుగుతోందని చెబుతూ 'తెలంగాణ రైజింగ్' అనే లోగోను ప్రభుత్వం ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కాగా, సీఎం కార్యాలయం అధికారిక ఎక్స్ ఖాతా 'తెలంగాణ సీఎంవో' డీపీ కూడా తెలంగాణ రైజింగ్ లోగోనే ఉంచారు.

ఏడాదిలో 2.22 లక్షల కోట్ల పెట్టుబడులు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఘనత
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.2.22 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒకే ఏడాది ఈ స్థాయి పెట్టుబడులు ఎప్పుడూ రాలేదని పేర్కొన్నారు. సచివాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు.. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రగతిని వివరించారు. 365 రోజుల్లో 2,783 పరిశ్రమలకు అనుమతులివ్వగా.. ఆ సంస్థలు రూ.2.22 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. వాటితో కొత్తగా 89,852 ఉద్యోగాలు సృష్టించామన్నారు. రూ.200 కోట్లకు పైగా పెట్టుబడి, వెయ్యి మందికిపైగా ఉద్యోగాలిచ్చే మెగా ప్రాజెక్టులు 16 వచ్చాయని, రూ.14,433 కోట్లు పెట్టుబడులు పెట్టాయని వివరించారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో 140 కంపెనీలు రూ.36వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. ములుగు జిల్లా కమలాపూర్‌లో మూసివేసిన బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో 10 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఎంఎస్ఎంఈలకు ఐదు, ఒకటి మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తున్నామన్నారు. కాగా, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో జనవరిలో మరో ఏడు విభాగాల్లో 12 కోర్సులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు

- ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు: పొంగులేటి
- హైదరాబాద్‌లో 81 మంది పేదలకు డబుల్ ఇళ్ల పట్టాలు
- ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చుతున్నాం: పొన్నం



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇళ్ల కల సాకారమవుతుందని, నియోజకవర్గానికి 3500 చొప్పున గృహాలను కేటాయిస్తున్నామన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో 4.5 లక్షల గృహాలను నిర్మించడమే లక్ష్యం అని పేర్కొన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కమలానగర్, ముషీరాబాద్ నియోజకవర్గం బాకారం ప్రాంతానికి చెందిన 81 మంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ అందజేశారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, విడతల వారీగా రూ.5లక్షలు అందజేస్తామన్నారు. ఇళ్ల సర్వేకోసం అధికారులు వస్తారని, ప్రజలు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. తమ ప్రభుత్వం పేద ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తోందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా అర్హులను ఎంపిక చేసి పారదర్శకంగా అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న మురికివాడల్లో ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పది మంది లబ్ధిదారులు తమకు ఇళ్లు రాలేదని స్థానిక నాయకులను, రెవెన్యూ అధికారులను నిలదీశారు. తమ ప్రాంతంలో ఒక్కొక్కరు రెండు, మూడు ఇళ్లు తీసుకున్నారని ఆరోపించారు. కలెక్టరేట్‌లో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు, బస్తీ నాయకులు వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

లక్ష మందితో సీఎం బహిరంగ సభ

- రేపు నల్లగొండ జిల్లాకు ముఖ్యమంత్రి రాక
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం ఏర్పడి ఈ నెల 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల పక్కన రాజీవ్ ప్రాంగణంలో లక్ష మందితో ముఖ్యమంత్రి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 7న నల్లగొండ జిల్లాకు రానున్న నేపథ్యంలో మంత్రి గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. రూ.1000 కోట్లతో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ చానళ్లను, దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్)లో యూనిట్ - 2ను, జిల్లా కేంద్రంలో ఎస్ఎల్‌బీసీ గంధంవారిగూడెం వద్ద రూ.275 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను సీఎం ప్రారంభిస్తారని వెల్లడించారు.

తెలంగాణకు రెండు పత్తి పరిశోధన కేంద్రాలు

- వరంగల్, ఆదిలాబాద్‌లకు కేటాయింపు

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రెండు అఖిల భారత పత్తి పరిశోధన సమన్వయ కేంద్రాలకు (ఏఐసీఆర్ పీ) భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపింది. ఈ కేంద్రాలను మంజూరు చేస్తున్నట్లు ఐసీఏఆర్.. జయశంకర్ యూనివర్సిటీ ఉప కులపతికి అధికారికంగా లేఖ రాసింది. నూతనంగా నియమితులైన ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య గత నెలలో ఢిల్లీలోని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.టి.పి శర్మలను కలిశారు. అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధన పరిశోధన పథకంలో యూనివర్సిటీకి భాగస్వామ్యం కల్పించి.. వరంగల్‌లో ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఒక ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ విజ్ఞప్తికి ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించి కేంద్రాలను వెంటనే మంజూరు చేస్తున్నట్లు గురువారం ఉప కులపతికి లేఖను పంపించారు.

కాంగ్రెస్‌తో టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

- పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ వ్యతిరేకం:మహేశ్
- హస్తం పార్టీలోకి సోయం బాబూరావు, ఆత్రం సక్కు

హైదరాబాద్, ఆసిఫాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని, అయితే పార్టీ ఫిరాయింపులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం అని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ బెదిరింపులకు గురి చేసి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిందని మండిపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో బీజేపీకి చెందిన ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబూరావు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు మహేశ్.. పార్టీ కండువాకప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకుందని, ఇచ్చిన హామీలను నెరవేర్చామని పేర్కొన్నారు. అనంతరం సోయం బాబూరావు మాట్లాడారు.. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ మీద నమ్మకంతో తాను పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. సీఎంగా రేవంత్ రెడ్డి అద్భుతమైన పాలన అందిస్తున్నారని కితాబిచ్చారు. కాగా ఆత్రం సక్కు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆసిఫాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ అని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రతిపక్ష నేతగా.. నీ డ్యూటీ చెయ్

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, పొన్నం, జూపల్లి కృష్ణారావులతో కలిసి 'ఇందిరమ్మ ఇళ్ల యాప్'ను ఆవిష్కరించిన సీఎం.. పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షాలు కల వకుండా చేసింది కేసీఆరేనని.. ఇరు పక్షాలనూ శత్రు దేశ సైనికుల్లా మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆయనలో మానసిక పరివర్తన రావాలని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత వైఎస్.. ఆయన సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు.. ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని రేవంత్ గుర్తుచేశారు. అంతేకాదు.. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్నప్పుడే ఆయన్ను హరీశ్ కలిశారని.. మరి ఇప్పుడేమైందని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని పేర్కొన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎన్ని ఉన్నా.. తమ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో మాత్రం పార్టీలకు అతీతంగా నేతలంతా ఏకమవుతారని.. ఇక్కడ కూడా అలానే కావాలని అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్ర ఎంపీలకు (17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు) సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ఆహ్వానించారు. తాము అభివృద్ధి.. సంక్షేమం రెండింటినీ సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే కేటీఆర్, హరీశ్ చిన్నపిల్లల్లా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేయలేనిది తాము ఏడాదిలోనే చేస్తుంటే.. హోంవర్క్ చేయని పిల్లలు చేసిన పిల్లాడి నోట్సు చింపేసినట్టుగా.. పక్కవాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా.. వారిద్దరూ ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తాము చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని మారీచ, సుబాహుల్లా, రాహుకేతువుల్లా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్ద వారని, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సూచించారు.

అందర్నీ పిలుస్తాం..

సచివాలయంలో 9వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కేసీఆర్‌నూ ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. అలాగే.. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను కూడా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేతగా వచ్చి కేసీఆర్ తన పెద్దరికాన్ని నిలుపుకోవాలని సూచించారు. 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం.. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహిస్తామని.. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లు అందులో ఉంటాయని చెప్పారు. ఈ ఉత్సవాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



సచివాలయంలో 'ఇందిరమ్మ ఇళ్ల యాప్'ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ఇస్తున్నది మనమే

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఆవిష్కరించిన సీఎం.. ఈ పథకం కింద ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు ఇస్తున్నామని.. దేశంలో ఇంత మొత్తం కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు. 2004 నుంచి 2014 వరకు.. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే.. కేసీఆర్ సర్కారు గడిచిన పదేళ్లలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభించి కేవలం 65వేల ఇళ్లను మాత్రమే పూర్తిచేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్లకి సంబంధించి కూడా తమ ప్రభుత్వం రూ.195 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం కింద మొదటివిడతలో.. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇందిరా గాంధీ ప్రధానిగా, ఎన్టీఆర్ సీఎంగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇళ్లు కేటాయించారని.. ఆ తర్వాత వారికి ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం.. ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ఆదివాసీ ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇస్తుందని వెల్లడించారు. "నల్లమల చెంచులు.. ఆదిలాబాద్ గోండులు..భద్రాచలం కోయలు.. ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో.. తెలంగాణ మూలపురుషులో.. వారికి ఇందిరమ్మ ఇళ్లను ప్రత్యేకంగా కేటాయిస్తాం" అని సీఎం హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం ఎలాంటి నమూనాను సూచించట్లేదన్న ఆయన.. ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామని, లబ్ధిదారులు వాటిని పరిశీలించాలని సూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్టు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన పేదలకు అన్యాయం జరగకూడదనే.. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సైతం వినియోగిస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడమే కాక శాఖకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించుకుంటున్నామన్న సీఎం.. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో తీసుకున్న వారి రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రతి ఒక్కరికీ గూడు అవసరం: డిప్యూటీ సీఎం భట్టి

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఆవిష్కరించిన డిసెంబరు 5.. సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రూ.5లక్షలతో ఇంటిని నిర్మించుకుంటున్నామంటూ.. లబ్ధిదారులంతా సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. తాను, రేవంత్‌రెడ్డి పాదయాత్రలు చేసినప్పుడు.. ఆత్మగౌరవంతో బ్రతకడానికి ఇందిరమ్మ ఇల్లు కావాలంటూ ప్రజలు పెద్ద ఎత్తున తమను కోరారని, అందుకే ఇప్పుడు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించుకుంటున్నామని అన్నారు. మొదటి విడతలో రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్టు చెప్పారు.

నేటి నుంచి గ్రామాలకు అధికారులు: మంత్రి పొంగులేటి

ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క తెలంగాణలోనే 18.56 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని.. కానీ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం లక్ష ఇళ్లను కూడా నిర్మించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం కేవలం తమ అనుచరులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించుకుని, పేదలకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో ఇంటికీ రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని నాలుగు దశల్లో అందించనున్నామని తెలిపారు. శుక్రవారం నుంచి ప్రతీ గ్రామానికి అధికారులు వెళ్లి, లబ్ధిదారులను గుర్తిస్తారని చెప్పారు. దరఖాస్తుదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌కు హెల్మెట్ పెడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రెండేళ్లలో హైదరాబాద్‌లో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు

- 3వేల డీజిల్ బస్సులు సహా ఆటోలు, ఓఆర్ఆర్ బయటకు
- ఈవీ వినియోగానికి ప్రోత్సాహకాలు
- హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా చేసేందుకే: సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబర్5 (ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న 3వేల డీజిల్ ఆర్టీసీ బస్సులను నగరం నుంచి బయటకు, ఓఆర్ఆర్ అవలకు తరలిస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. డీజిల్ బస్సులను తొలగించగానే వెంటనే 3వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. డీజిల్ బస్సులు సహా డీజిల్ ఆటోలను కూడా ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామన్నారు. ఈవీ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రాయితీలు అమలు చేస్తామని, ఎలక్ట్రిక్ ఆటోలు కొన్నవారికి రాయితీలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కాలం చెల్లిన వాహనాల (15 ఏళ్లు)ను స్క్రాపింగ్‌కు తరలిస్తామన్నారు. ఢిల్లీ తరహాలో హైదరాబాద్ కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా వచ్చే రెండేళ్లలో ఈ విధానాన్ని అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ, టీజీఎస్ ఆర్టీసీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. ఢిల్లీలో కాలుష్య సమస్య కారణంగా కేంద్ర మంత్రి గడ్కరీ తాను ఢిల్లీకి వస్తే అనారోగ్యానికి గురికావాల్సి వస్తోందని ప్రకటించిన విషయాన్ని రేవంత్ ప్రస్తావిస్తూ దేశంలో ఇతర నగరాల్లో ఉత్పన్నమవుతున్న సమస్యలు హైదరాబాద్‌లో ఏర్పడకుండా రక్షించుకోవలిసిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ నూతన రూపొందించిన లోగోను సీఎం ఆవిష్కరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉద్దేశించిన మహాలక్ష్మి పథకం ఆర్టీసీలో వెలుగులు నింపుతోందని సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు చార్జీల మొత్తం 3,902.31 కోట్ల చెక్కును అందజేశారు. మృతిచెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగ పత్రాలను అందజేశారు. అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖలో యూజర్ చార్జీలను వినియోగించుకునేందుకు అనుమతించాలని కోరారు.

ఇందిరమ్మ ఇంటికి.. 3 నమూనాలు!

- స్థలాన్ని బట్టి నిర్మించుకునేలా అవకాశం
- సింగిల్, డబుల్ బెడ్‌రూమ్‌ల వారీగా డిజైన్లు
- నమూనాలను ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం


హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక సూచనలు చేసింది. ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మూడు నమూనాలను ఖరారు చేసింది. పథకం కింద ఇల్లు మంజూరైన వారు తమ అభిరుచికి అనుగుణంగానే ఇంటిని నిర్మించుకోవచ్చని చెప్పినా.. స్థలాన్ని బట్టి ఏ విధంగా ఇంటిని నిర్మించుకోవాలనే దానిపై డిజైన్లను రూపొందించింది. ఇంటి నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నమూనాలను విడుదల చేసింది. ఈ మూడింటిలో స్థలాన్ని బట్టి గదులను ఎలా నిర్మించుకోవాలనే వివరాలను పొందుపర్చింది. అంతేకాకుండా ప్రతీ మండల కేంద్రంలోనూ ఒక ఇంటిని ప్రభు త్వం ఏర్పాటు చేయనుంది. స్థలాన్ని బట్టి సింగిల్‌బెడ్ రూమ్, డబుల్ బెడ్ రూమ్, నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, ఈ పథకానికి రూపొందించిన విధివిధానాల మేరకు ఇంటిని నిర్మించుకునే వారికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించనుంది. 400 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకున్న వారికి కూడా ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే.

400 చ.అడుగుల్లో నిర్మించే ఇల్లు డిజైన్



ఇంటి స్థలం వెడల్పు ఉండి, లోతు ఎక్కువగా ఉంటే ఇలా నిర్మించుకోవచ్చు





చతురస్రాకారంలో ఉండి, ఆర్థిక స్థోమత ఉన్న వారు.. 500 చ.అడుగుల్లో డబుల్ బెడ్‌రూమ్‌ను ఇలా నిర్మించుకోవచ్చు



తెలంగాణ తల్లి విగ్రహ నమూనా

బహుజనుల తల్లిగా..

- తెలంగాణతనం ఉట్టిపడేలా తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పన
- 5 నెలల పాటు శ్రమించిన జేఎన్ఏఎఫ్ఏయూ ఆచార్యులు
- రేవంత్ ఆలోచనలకు తగ్గట్టు డిజైన్
- పనులను పరిశీలించిన సీఎం

హైదరాబాద్/ అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 17 అడుగుల ఎత్తు, చేతిలో బతుకమ్మతో తెలంగాణతనం ఉట్టిపడేలా 'తెలంగాణ తల్లి విగ్రహం' దర్శనమివ్వనుంది. 3 అడుగుల ఎత్తులో ఉన్న గద్దెపై 17 అడుగుల విగ్రహం కలిపి మొత్తం 20 అడుగుల ఎత్తులో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలోని ప్రధాన ద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న లక్ష మంది మహిళలతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించనుంది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విగ్రహానికి చిన్న చిన్న మెరుగులు దిద్దుతున్నారు. తెలంగాణ తల్లి కాంస్య విగ్రహం కోసం రూ.1.16 కోట్లను ఖర్చు చేస్తుండగా వాటర్ ఫౌంటెయిన్‌లు, లైటింగ్, పచ్చిక బయళ్లు సహా మొత్తం నిర్మాణానికి రూ.5.20 కోట్లను వెచ్చిస్తున్నారు. ఈ పనులను గురువారం సీఎం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. విగ్రహ నమూనాలను రూపొందించే బాధ్యతలను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ (జేఎన్ఏఎఫ్ఏయూ)కు సీఎం అప్పగించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా డిజైన్‌ను రూపొందించినట్లు రూపకర్త ప్రొఫెసర్ గంగాధర్ చెప్పారు. బహుజనుల తల్లిగా, ప్రజలందరి ఆకాంక్షలకు అనుగుణంగా విగ్రహం ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఎంపిక చేసిన డిజైన్ మేరకు పెద్దఅంబర్‌పేట్‌లో ఐదుగురు సభ్యులతో కూడిన సాంకేతిక బృందం ఐదు నెలలు పాటు శ్రమించి విగ్రహాన్ని తయారు చేసిందని చెప్పారు.

అదానీ, అంబానీలతో ఆడబిడ్డలు పోటీ పడాలి

- ఎస్‌హెచ్‌జీ సభ్యులు కోటికి చేరాలి
- ఇందిరా మహిళా శక్తి బజార్.. ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళా సాధికారతలో తెలంగాణ ఓ నాంది: గవర్నర్ జిష్ణుదేవ్



శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సౌరవిద్యుత్తు ప్రాజెక్టులతో ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీపడాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ లక్ష్యం నెరవేరాలంటే.. ప్రస్తుతం 65 లక్షలుగా ఉన్న స్వయం సహాయక బృందాల సభ్యుల సంఖ్య కోటికి పెరగాలని ఆకాంక్షించారు. ఈ కోటి మందిని కోటీశ్వరులను చేసే బాధ్యత తమ సర్కారుదని భరోసా ఇచ్చారు. మాదాపూర్ శిల్పారామంలో కొత్తగా ఏర్పాటు చేసిన 'రాష్ట్రస్థాయి ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఆయన గురువారం సాయంత్రం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన వెంటనే మహిళాసంక్షేమం కోసం అమలు చేస్తున్న గ్యారెంటీలను గురించి వివరించారు. "మహిళాశక్తిని చాటేందుకు, వారి నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలిపేందుకు మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళాశక్తి స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. ఈ బజార్ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా చేయాలి. విదేశీ పర్యాటకులు చార్మినార్, బుద్ధవిగ్రహం, ఐటీకారిడార్‌తోపాటు.. శిల్పారామంలోని మహిళాశక్తి బజార్‌ను సందర్శించనిదే వెలితి ఉండేలా పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ నెల 9న లక్ష మంది మహిళలతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. దేశం మహిళా సాధికారత వైపు చూస్తోందని, తెలంగాణ దీనికి ఓ నాంది పలికిందని వ్యాఖ్యానించారు. అనంతరం సీఎం, గవర్నర్ దంపతులు 106 స్టాళ్లను సందర్శించి, మహిళా సంఘాల సభ్యులతో ముచ్చటించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని ప్రారంభించి, ఆర్థికంగా ఎదుగుతున్నట్లు ఆదిలాబాద్ మహిళా సంఘం సభ్యులు వెల్లడించారు. ప్రభుత్వ బడుల విద్యార్థుల యూనిఫారాల ఆర్డర్లను తమకు ఇచ్చినందుకు వివిధ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. స్వయం సహాయక సభ్యులు ఏర్పాటు చేసిన స్నాక్స్ విందులో అతిథులు పాల్గొనగా.. రేవంత్‌రెడ్డి బిల్లులు చెల్లించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, శంకర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రయ్.. రయ్..!

- ఆగకుండా సాగిపోయేలా వంతెనలు, అండర్‌పాస్‌లు
- హెచ్-సిటీలో భాగంగా రూ.5942 కోట్లతో నిర్మాణం
- అనుమతులిచ్చిన పురపాలక శాఖ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ రహదారుల్లో రయ్, రయ్‌మని దూసుకెళ్లేలా.. సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా పలు ప్రాజెక్టులు నిర్మించనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టులో భాగంగా పాతబస్తీ మొదలు ఐటీ కారిడార్ వరకు నగరం నలువైపులా ప్రాజెక్టులు చేపట్టనున్నారు. 23 ప్రాంతాల్లో వంతెనలు, అండర్‌పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లు, గ్రేడ్ సెపరేటర్ల (చౌరస్తా వద్ద ఓ వైపు నుంచి వెళ్లే వాహనాలు కుడి/ఎడమ వైపునకు వెళ్లేలా నిర్మించేది) నిర్మాణానికి పురపాలక శాఖ పచ్చజెండా ఊపింది. రూ.5942 కోట్లతో చేపట్టనున్న పనులకు పాలనాపరమైన అనుమతులు జారీ చేస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆయా పనులకు గత ఏడాది సెప్టెంబరులో రూ.4305 కోట్లతో అనుమతి ఇవ్వగా.. నిర్మాణ సామగ్రి, ఇతరత్రా ధరలు పెరిగిన నేపథ్యంలో అంచనా వ్యయం రూ.5942 కోట్లకు (రూ.1637 కోట్లు అదనం) పెంచుతూ పంపిన ప్రతిపాదనలకు పురపాలక శాఖ ఆమోదం తెలిపింది. ఐదు ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నారు. గ్రేటర్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వాహనాల సంఖ్య భారీగా పెరగడం.. ఆ స్థాయిలో రహదారుల వ్యవస్థ మెరుగవకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ నేపథ్యంలో రహదారులను మెరుగుపర్చడంపై సర్కారు ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ప్రకటించిన మూడు రోజుల్లోనే..


ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హెచ్-సిటీలో చేపట్టనున్న రూ.3446 కోట్ల పనులకు ఇటీవల సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్ జోన్లలో 5 ప్యాకేజీల కింద చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. 3 రోజుల్లోనే ఈ పనులకు అనుమతులిచ్చారు. పనులకు త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు జీహెచ్ఎంసీ వర్గాలు తెలిపాయి.

పత్తి చేనులో పెద్దపులి గాండ్రింపులు!

» భయంతో చెట్టు పైకెక్కిన కూలీలు

» మంచిర్యాల జిల్లా చెన్నాపూర్ శివారులో ఘటన

భీమిని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులి సంచారంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు, కూలీలు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా మంచిర్యాల జిల్లా భీమిని మండలం చెన్నాపూర్ శివారులోని ఓ పత్తి చేనులో పెద్దపులి గాండ్రింపులు కలకలం రేపాయి. గ్రామ శివారులోని చేనులోకి గురువారం సాయంత్రం పులి రావడంతో పత్తి ఏరుతున్న కూలీలు పరుగులు పెట్టారు. పులిని చూసిన కోయ గోపాల్, రాకేర బాపు అనే కూలీలు చెట్టెక్కి ప్రాణాలను కాపాడుకున్నట్లు తెలిపారు. చెట్టు పైనుంచే కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి పెద్ద శబ్దాలు చేశారని, తరువాత పులి తెనుగుపల్లి వైపు వెళ్లిందని చెప్పారు. పెద్దపులి సంచార విషయం తెలుసుకున్న కుశ్నపల్లి, తాండూరు అటవీ అధికారులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. పెద్దపులి ఎటువైపు నుంచి వచ్చింది? ఎంత సేపు ఉంది? తదితర వివరాలను తెలుసుకున్నారు. పత్తి సేకరణ పనులు జోరుగా నడుస్తుండగా చేలల్లోకి పెద్ద పులి రావడంతో రైతులు, కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో పత్తి సేకరించే మహిళపై పులి దాడి చేసి హతమార్చిన సంగతి తెలిసిందే.



మున్సిపాలిటీల్లో పంచాయతీల విలీనం ఆర్డినెన్స్ సబబే

హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమీపంలో ఉన్న మున్సిపాల్టీల్లో గ్రామపంచాయతీలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు సమర్థించింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి తదితర జిల్లాల్లో 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 2న ఆర్డినెన్స్-3 ని ప్రభుత్వం జారీచేసింది. ఈ ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో నాలుగు వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం కొట్టేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం ఆర్డినెన్స్‌లు జారీచేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది.

సేవాలాల్ మహారాజ్ జయంతిని జాతీయ పండుగగా నిర్వహించాలి

న్యూఢిల్లీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో బీజేపీ తెలంగాణ ఎంపీలు భేటీ అయ్యారు. బంజారా జాతి ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీని జాతీయ పండుగగా నిర్వహించాలని ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు మహబూబాబాద్ మాజీ ఎంపీ ప్రొ.సీతారాం నాయక్ కూడా కేంద్ర మంత్రిని కలిశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.